# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - శనివారం 8 ఆగస్టు 2026 | సంపుటి: 10 | సంచిక: 214 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


ప్రైవేట్ స్కూళ్లలో ఫీజు వివరాలు display చేయాలె




2

Ask Me Anything



2

## సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ టాప్

### మన పోలీసుల పనితీరుకు పీఎంఓ ప్రశంస




ఢిల్లీ, ఆగస్టు 7: సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ దేశంలోనే తొలిస్థానంలో నిలిచింది. ప్రధానమంత్రి కార్యాలయం తాజాగా నిర్వహించిన జాతీయ స్థాయి ప్రగతి సమీక్ష సమావేశంలో ఇందుకు సంబంధించిన గణాంకాల్ని విడుదల చేసింది. మొత్తం 9 ప్రామాణికాల్లో చూపిన పనితీరును ఈ మూల్యాంకనంలో పరిగణనలోకి తీసుకు న్నారు. సైబర్ కమాండ్ సెంటర్(ఎస్4సీ) ఏర్పాటు, ఈ-జీరో ఎఫ్ఐఆర్ అమలు, గ్రీవెన్స్ రిడ్రెసల్ మాడ్యూల్ (జీఆర్ఎం), రీఫండ్ మనీ రెస్టోరేషన్ మాడ్యూల్(ఎంఆర్ఎం), సహయోగ్ పోర్టల్, సమన్వయ పోర్టల్, సైబర్ క్రైమ్ హాట్ స్పాట్లు

...మిగతా 2లో

# ఏఐ టెక్నాలజీతో జీఎస్టీ వ్యవస్థలో లోపాలకు అడ్డుకట్ట

### లీకేజీలను అరికట్టేందుకు ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం అవసరం

### సీఎం రేవంత్‌తో ఆర్థికవేత్త సుబ్రమణియన్ భేటీ



హైదరాబాద్, ఆగస్టు 7 (మనం బ్యూరో): తెలంగాణ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ఖజానాకు జీఎస్టీ రాబడులను పెంచుకోవడంలో ఏఐ ఇంటెలిజెన్స్‌ను వినియోగించడం ద్వారా పటిష్టమైన ప్రణాళికను రూపొందించడంపై సీఎం రేవంత్ రెడ్డి విస్తృత చర్చలు జరిపారు. శుక్రవారం ఎంసీహెచ్ఆర్ డీలోని బోధి పెవిలియన్‌లో సీఎంతో ప్రముఖ ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్ భేటీ అయ్యారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపరచడంలో భాగంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లడంపై ఈ సందర్భంగా చర్చ జరిగింది. ముఖ్యంగా జీఎస్టీ, ఎక్సైజ్ శాఖల్లో చేపట్టాల్సిన సంస్కరణలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ముందుకు తీసుకెళ్లేందుకు జీఎస్టీ అధికారులకు ప్రత్యేక ఏఐ ఆధారిత సమాచారంతో ప్రక్రియను సులభతరం చేసే వ్యవస్థను తేనున్నట్లు స్పష్టం చేశారు. రాష్ట్ర ఖజానాకు

...మిగతా 2లో

## 10న నాగార్జున సాగర్‌లో వరుణ యాగం

### పూర్ణాహుతిలో పాల్గొననున్న సీఎం

హైదరాబాద్, ఆగస్టు 7 (మనం బ్యూరో): రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ ఈనెల 10న నాగార్జునసాగర్‌లో వరుణ యాగం నిర్వహించనున్నారు. నాగార్జునసాగర్ డ్యామ్ తీరంలోని విజయవిహార్ ప్రాంగణంలో యాగం నిర్వహిస్తారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో యాదరిగిగుట్ట దేవస్థానం అర్చకులు, వేదపండితులు నిర్ణయించిన ముహూర్తంలో యాగా క్రతువు జరుగనుంది. కృష్ణా, గోదావరి నదులు చెరువులు జలకళ సంతరించుకోవాలని పాడి పంటలు సమృద్ధిగా పండాలన్న సంకల్పంతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. రాష్ట్ర నీటి పారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో నిర్వహించనున్న ఈ వరుణ యాగం అనంతరం మహా పూర్ణాహుతి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు.

## బీఆర్ఎస్ సోషల్ మీడియాకు మాత్రమే పరిమితం

### పీసీసీ మీడియా కమిటీ చైర్మన్ చామల



హైదరాబాద్, ఆగస్టు 07(మనం బ్యూరో): బీఆర్ఎస్ సోషల్ మీడియాకు మాత్రమే పరిమితమైందని భువనగిరి ఎంపి, పీసీసీ మీడియా కమిటీ చైర్మన్‌గా నియమితులైన చామల కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. పీసీసీ మీడియా కమిటీ

...మిగతా 2లో

# త్వరలో డిజిటల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ

- పౌరుల డేటా భద్రతకు బ్లాక్ చెయిన్ సర్టిఫికెట్లు
- అన్నిగ్రామీణ ప్రాంతాలకు హైస్పీడ్ డిజిటల్ కనెక్టివిటీ
- ఏఐ ట్రాన్స్‌ఫార్మేషన్ కాంక్లేవ్‌లో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, ఆగస్టు 7 (మనం బ్యూరో): త్వరలో రాష్ట్రంలో డిజిటల్ అసెంబ్లీ, డిజిటల్ కౌన్సిల్‌ను అందుబాటులోకి తీసుకు రానున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. శుక్రవారం బేగంపేటలోని ఐటీసీ కాకతీయలో నిర్వహించిన ఏఐ ట్రాన్స్‌ఫార్మేషన్ కాంక్లేవ్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ పాలనలో మార్పులు రావాల్సిన అవసరం ఉందనీ, ఆ దిశగా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. డిజిటల్ క్యాబినెట్, 20 ప్రభుత్వ శాఖలను ఒకే తాటిపైకి తెచ్చేలా రియల్ టైమ్ గవర్నమెంట్ డ్యాష్ బోర్డు ఏఐ ఆధారిత డాటా ఎక్స్ఛేంజ్ వాట్సాప్ ద్వారా

...మిగతా 2లో




## సంక్షోభాలను అవకాశాలుగా మలచుకోవాలె

ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక భౌగోళిక రాజకీయ అనిశ్చితులను సవాళ్లుగా కాకుండా కొత్త అవకాశాలుగా మలచుకోవాలని మంత్రి శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహించిన హిప్లెక్స్ సదస్సులో ఆయన మాట్లాడుతూ పరిశ్రమల ప్రదర్శనల్లో వేలాది యంత్రాలు మాత్రమే తనకు కనిపించవనీ, వాటి వెనుక వేలాది కుటుంబాల జీవనోపాధి, పారిశ్రామికవేత్తల సంకల్పం, యువత భవిష్యత్తు కనిపిస్తాయన్నారు. ఎన్ని ప్రతికూల పరిస్థితులు ఎదురైనా పెట్టుబడులు, విస్తరణ, ఆవిష్కరణలను కొనసాగిస్తున్న పరిశ్రమల ఆత్మవిశ్వాసమే దేశ బలమని ఈసందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

**బో**నాల పండుగ సందర్భంగా రేపు మద్యం దుకాణాలను మూసివేయాలని సైబరాబాద్ పోలీసు కమిషనర్ రమేశ్ ఆదేశించారు. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు వైన్ షాపులు, కల్లు దుకాణాలు, బార్లు మూసివేయాలన్నారు.

## గిరిజన సంక్షేమానికి కేంద్రం అండగా నిలవాలె

### రూ.452.05 కోట్ల పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ బకాయిలు ఇవ్వండి

### కేంద్ర మంత్రి జువాల్ ఓరాంకు మంత్రి అడ్లూరి విజ్ఞప్తి



హైదరాబాద్, ఆగస్టు 7 (మనం బ్యూరో): తెలంగాణలో గిరిజన విద్యార్థుల ఉన్నత విద్యకు ఎలాంటి ఆటంకం కలుగకుండా 2024-27 సంవత్సరాలకు సంబంధించిన ప్రతిపాదనల మేరకు రూ.452.05 కోట్ల కేంద్ర వాటాను వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రి జువాల్ ఓరాంను రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కోరారు. ఈ మేరకు న్యూఢిల్లీలో శుక్రవారం ఆయన కేంద్ర మంత్రిని

...మిగతా 2లో

## మైనింగ్ కాంట్రాక్టర్లను పెనాల్టీ పేరుతో వేధించొద్దు

### మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 7 మనం బ్యూరో: మైనింగ్‌కు సంబంధించిన సమస్యలు, రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న రోడ్ల నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మైనింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తమ సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్న చిన్న కాంట్రాక్టర్లపై భారీగా పెనాల్టీలు విధించడం, మెటల్ పర్మిషన్ల విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులు, నిర్మాణ సామాగ్రి లభ్యతలో ఎదురవుతున్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ రోడ్ల నిర్మాణ పనులు చేస్తున్న చిన్న కాంట్రాక్టర్లను

...మిగతా 2లో

## నైనీ నుంచి బొగ్గు రాక

### తొలి లోడుకు స్వాగతం పలికిన సింగరేణి

### అభినందించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



హైదరాబాద్, ఆగస్టు 7: ఇతర రాష్ట్రాల్లోని సింగరేణి గని నుంచి తెలంగాణకు తొలిసారి బొగ్గు సరఫరా జరిగింది. ఒడిశాలోని నైనీ బొగ్గుబ్లాకు నుంచి తవ్వి తీసిన బొగ్గు తొలి లోడు రాష్ట్రానికి చేరింది. 59 బాక్స్ వ్యాగన్ల ద్వారా 4 వేల టన్నులతో కూడిన 'జీ-10' గ్రేడ్ బొగ్గు

...మిగతా 2లో



## ప్రత్యామ్నాయ పంటలే శరణ్యం

### అపరాల వైపు రైతులను మళ్లించాలని ఆదేశం

### ఎల్-నినో పరిస్థితులపై కలెక్టర్లతో మంత్రులు ఉత్తమ్, తుమ్మల, జూపల్లి సుదీర్ఘ సమీక్ష

హైదరాబాద్, ఆగస్టు 7 (మనం న్యూస్): రాష్ట్రంలో నెలకొన్న ఎల్నినో పరిస్థితులు, వాతావరణ శాఖ (ఐఎండి) హెచ్చరించిన వర్షాభావ సూచనల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. సచివాలయం నుంచి రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పర్యాటక

...మిగతా 2లో

మెడికల్ కోర్సుల ఫీజుపై నిర్ణయం తీసుకోవాలె

2

## అసెంబ్లీలో బోనాల వైభవం

### భక్తిశ్రద్ధలతో బోనాల సమర్పణ

### శ్రీ బంగారు మైసమ్మ ఆలయంలో ఘనంగా ఆషాఢ మాస వేడుకలు



2



## సమాచార భవన్‌లో సంబరాలు

- శ్రీ కనకదుర్గ అమ్మవారికి వైభవంగా బోనాల సమర్పణ
- ప్రత్యేక పూజలు నిర్వహించిన స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి
- పోతరాజుల విన్యాసాలు, డప్పు వాయిద్యాల మధ్య సాగిన ఊరేగింపు

2

# పెరుగుతున్న యువత.. తరుగుతున్న కొలువులు

### ఉపాధి కల్పనకు చర్యలు తక్షణావసరం

### అజీం ప్రేమ్‌జీ వర్సిటీ 'వర్కింగ్ ఇండియా' నివేదిక వెల్లడి




హైదరాబాద్, ఆగస్టు 7: దేశంలో కీలకమైన యువ'శక్తి' నిరుద్యోగ సమస్యతో సవాళ్లు ఎదుర్కొంటోంది. చదువుకున్నవారు పెరుగుతున్నా.. ఆ మేరకు ఉపాధి కల్పించడంలో ప్రభావవంతమైన మార్పులేమీ జరగడం లేదు.. పట్టభద్రులవుతున్నవారికి తగిన సంఖ్యలో ఉద్యోగాలు రావడం లేదు. వచ్చిన కొలువులు కూడా శాశ్వత వేతనాలిచ్చేవిగా ఉండటం లేదని అజీమ్ ప్రేమ్‌జీ వర్సిటీ 'కార్మిక బలగంలో యువత' పేరిట నిర్వహించిన 'వర్కింగ్ ఇండియా-2026' అధ్యయన నివేదిక వెల్లడించింది. దేశంలో మధ్య వయస్కులు, ఇతరులతో పోల్చితే యువతలో నిరుద్యోగిత నాలుగు రెట్లు అధికంగా ఉందని.. ఇది ప్రపంచ సగటు కన్నా ఎక్కువని తెలిపింది. నివేదికలోని ముఖ్యాంశాలివి..

- దేశంలో 15-29 ఏళ్లవారు 36.7 కోట్ల మంది. విద్యావంతుల సంఖ్య బాగా పెరుగుతున్న నేపథ్యంలో.. యువతను శ్రామికశక్తిగా మార్చడం కీలకం. సరైన ఆదాయం లభించే అర్థవంతమైన ఉపాధిని కల్పించాల్సి ఉంది. అప్పుడే యువ జనాభా ఆర్థిక ప్రయోజనకారిగా మారుతుంది.
- ప్రస్తుతం జాతీయ సగటు వయసు 29 ఏళ్లు. తెలంగాణలో అది 30 కాగా ఆంధ్రప్రదేశ్‌లో

...మిగతా 2లో




## నేడు గిగ్ వర్కర్ల సమ్మె

సంక్షేమ బోర్డు ఏర్పాటు, కనీస ఛార్జీలు ఖరారు చేయాలని డిమాండ్

3

## భారతీయులకు మళ్లీ కష్టాలు

### బర్త్‌రైట్ సిటిజన్ షిప్‌పై ట్రంప్ కొత్త ఆదేశాలు

వాషింగ్టన్, ఆగస్టు 7: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొత్తగా రెండు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై సంతకం చేశారు. విదేశీ వలసదారుల పిల్లలకు జన్మతః లభించే పౌరసత్వాన్ని పరిమితం చేయడం , బర్త్ టూరిజాన్ని నిషేధించడం ఈ ఉత్తర్వుల ఉద్దేశం. అక్రమ వలసదారులు, తాత్కాలిక వీసాలు కలిగిన వారి పిల్లలు అమెరికాలో జన్మిస్తే వారిని అమెరికన్లుగానే పరిగణించాలని నెల రోజుల క్రితం ఆ దేశ సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. విదేశీయుల పిల్లలకు పౌరసత్వం నిరాకరించాలనే ట్రంప్ ప్రయత్నం అప్పటికి వీగిపోయింది. కానీ, మళ్లీ కొత్త ఉత్తర్వులు ఇచ్చారు. ఇది భారతీయులకు కొత్త కష్టమనే చెప్పాలి. 'జన్మత: పౌరసత్వ హక్కుకు సంబంధించి సుప్రీంకోర్టులో మాకు వ్యతిరేక తీర్పు వచ్చింది. చాలా స్వల్ప తేడాతో వచ్చిన ఆ తీర్పు.




చాలా దురదృష్టకరం. ఈ క్రమంలోనే మేం కొన్ని సర్దుబాట్లు చేస్తున్నాం'' అని ట్రంప్ పేర్కొన్నారు. అలాగే బర్త్ టూరిజాన్ని కూడా నిషేధించాలని అమెరికా

...మిగతా 2లో

## ఇమ్మిగ్రేషన్ దరఖాస్తు అసంపూర్ణంగా ఉంటే తిరస్కరణ

### అధికారులకు విచక్షణాధికారాన్ని పునరుద్ధరించిన అమెరికా

వాషింగ్టన్, ఆగస్టు 7: వీసా, గ్రీన్‌కార్డు వంటి ఇమ్మిగ్రేషన్ ప్రయోజనాలు కోరుతూ వచ్చే దరఖాస్తులకు సంబంధించి అమెరికా తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. అర్హతను నిర్ధారించేందుకు అవసరమైన పత్రాలను జోడించని, అసంపూర్ణ దరఖాస్తులను అదనపు వివరాలు కోరకుండానే తిరస్కరించే విచక్షణాధికారాన్ని అధికారులకు పునరుద్ధరించింది. అమెరికా పౌరసత్వం, ఇమ్మిగ్రేషన్ సేవల సంస్థ (యూఎస్సీఐఎస్) ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. నూతన విధానం తక్షణమే అమల్లోకి వచ్చినట్లు తెలిపింది. కొత్తగా వచ్చే దరఖాస్తులతోపాటు

...మిగతా 2లో

# ప్రత్యామ్నాయ పంటలే శరణ్యం

(మొదటి పేజీ తరువాయి)

శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులతో కలిసి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లాల కలెక్టర్లతో శుక్రవారం అత్యవసర వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాభావ పరిస్థితులను తట్టుకునేందుకు సిద్ధం చేసిన అత్యవసర పంటల ప్రణాళికను క్షేత్రస్థాయిలో తక్షణమే అమలు చేయాలని మంత్రులు కలెక్టర్లను ఆదేశించారు. రైతులు సాంప్రదాయ వరి సాగుపైనే ఎక్కువగా ఆధారపడకుండా, తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.



**క్షేత్రస్థాయిలో అవగాహన:**

రైతులు వరి సాగుకు గుడ్డిగా వెళ్లకుండా నీటి లభ్యత, వర్షాభావ ముప్పును ముందే గుర్తించేలా చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. నీటి వినియోగం ఎక్కువగా ఉండే పంటల వల్ల వచ్చే నష్టాలను రైతులకు వివరించాలని, ప్రణాళికలు కేవలం జిల్లా స్థాయికే పరిమితం కాకుండా మండలాలు, గ్రామ స్థాయికి చేరాలన్నారు. కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించి పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు, ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించాలని, రైతులకు అవసరమైన సాంకేతిక సహాయం అందించాలని సూచించారు. వ్యవసాయ, నీటిపారుదల శాఖలు సమన్వయంతో పనిచేస్తూ నీటి లభ్యతపై స్పష్టత ఇవ్వాలన్నారు.

**సమావేశాలు నిర్వహించాలి:**

రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు తమ పరిధిలోని నీటిపారుదల సలహా మండలి సమావేశాలను అత్యంత త్వరగా నిర్వహించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు.

జలాశయాలు, ప్రాజెక్టులలో ఉన్న నీటి నిల్వలపై స్పష్టమైన అంచనాకు వచ్చి ఆ సమాచారాన్ని రైతులకు చేరవేయాలన్నారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో వరి వేసి రైతులు నష్టపోకుండా ముందే అడ్డుకోవాలన్నారు.

గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిశోర్ మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాల ద్వారా సమగ్ర ఫాం పాండ్స్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

**15న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ:**

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న 'స్మార్ట్ రేషన్ కార్డుల' పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సంగారెడ్డిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో పంచాయతీరాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిశోర్, ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్‌లతో పాటు పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ స్కూళ్లలో ఫీజు వివరాలు డిస్ ప్లే చేయాల్సిందే

- విద్యాశాఖ కీలక ఆదేశాలు

**హైదరాబాద్, ఆగష్టు 1:** విద్యార్థుల పాఠశాల ఫీజుల వివరాలపై తెలంగాణ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఫీజుల వివరాలను డిస్ప్లే చేయాలని విద్యాశాఖ ఆదేశించింది. పాఠశాల నోటీసు బోర్డు, వెబ్సైట్తో పాటు పాఠశాల విద్యాశాఖ పోర్టల్లోనూ పొందుపరచాలని స్పష్టం చేసింది. నిబంధనలు పాటించని పాఠశాలలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని.. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఫీజుల స్ట్రక్చర్ ప్రదర్శించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని సూచించింది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

# భారతీయులకు మళ్లీ కష్టాలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం కోరుకుంటోంది. ''బర్త్ టూరిజాన్ని భారీ సంఖ్యలో విదేశీయులు ఉపయోగించుకుంటున్నారు. పుట్టుకతో వచ్చే పౌరసత్వాన్ని పొందుతున్నారు. దానిని అపహాస్యం చేస్తున్నారు. అదంతా అవమానకరం. అలా జరగనివ్వం'' అని వ్యాఖ్యానించారు. బర్త్ టూరిజం పుట్టబోయే బిడ్డకు విదేశీ పౌరసత్వం పొందాలనే లక్ష్యంతో నెలలు నిండే సమయంలో గర్భిణీలు వేరే దేశానికి ప్రయాణించి అక్కడ ప్రసవిస్తారు. ఆ దేశపు చట్టాల ప్రకారం అక్కడ పుట్టిన పిల్లలకు దానంతట అదే పౌరసత్వం లభిస్తుంది.

**చట్టాలు ఏం చెప్తున్నాయి..**

1868లో ఆమోదించిన 14వ రాజ్యాంగ సవరణ ప్రకారం..అమెరికాలో పుట్టేవారందరికీ (వారి తల్లిదండ్రులు ఆ దేశంలో అక్రమంగా లేదా తాత్కాలికంగా ఉంటున్నా సరే) ఆ దేశ పౌరసత్వం లభిస్తుంది.

విదేశీ దౌత్యవేత్తలు, విదేశాలకు చెందిన దురాక్రమణదారులకు జన్మించే పిల్లలకు మాత్రమే ఇందులో మినహాయింపు ఉంటుంది. జన్మతః పౌరసత్వం లభించడంపై పరిమితులు అమల్లోకి వస్తే ఏటా అమెరికాలో దాదాపు 2.5 లక్షల మంది పిల్లలపై వాటి ప్రభావం ఉంటుంది.

## ఇమ్మిగ్రేషన్ దరఖాస్తు అసంపూర్ణంగా ఉంటే తిరస్కరణ

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నవాటికీ ఇది వర్తిస్తుందని స్పష్టం చేసింది. పాత విధానం ప్రకారం- ఇమ్మిగ్రేషన్ స్టేటస్ మార్పు, పొడిగింపు, గ్రీన్ కార్డులు, వీసా వంటి ప్రయోజనాల కోసం వచ్చే దరఖాస్తులు అసంపూర్తిగా ఉన్నా అవసరమైన పత్రాలు వాటిలో లేకపోయినా.. చాలా సందర్భాల్లో దరఖాస్తుదారులకు యూఎస్సీఐఎస్ అధికారులు 'రిక్వెస్ట్ ఫర్ ఎవిడెన్స్ (ఆర్ఎఫ్ఈ)' లేదా 'నోటీస్ ఆఫ్ ఇంటెంట్ టు డినై (ఎన్వోఐడీ)' నోటీసులు జారీ చేసేవారు.

# అసెంబ్లీలో 'బోనాల' వైభవం!

- ఉత్సవాల్లో పాల్గొన్న చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

**హైదరాబాద్, ఆగష్టు 7 (మనం న్యూస్):** రాష్ట్ర శాసనసభ ఆవరణలోని శ్రీ బంగారు మైసమ్మ దేవాలయం ఆషాఢ మాస బోనాల సంబరాలతో భక్తిపారవశ్యంగా మారింది. లెజిస్లేటివ్ సెక్రటేరియట్ ఉద్యోగుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించిన ఈ బోనాల ఉత్సవాల్లో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్లు ముఖ్య అతిథులుగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా సెక్రటేరియట్ మహిళా ఉద్యోగులు సాంప్రదాయబద్ధంగా నెత్తిన బోనాలతో తరలిరాగా, పోతరాజుల వీరంగాలు, శివసత్తుల పూనకాలు, తీన్మార్ డప్పుల వాయిద్యాలు, వివిధ వేషధారణలతో కళాకారులు చేసిన ప్రదర్శనలు అసెంబ్లీ ప్రాంగణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పెద్ద సంఖ్యలో అధికారులు, సిబ్బంది ఈ సంబరాల్లో పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకోగా, ఆలయ పూజారులు ప్రముఖులకు వేదాశీర్వచనాలతో తీర్థప్రసాదాలు అందజేశారు.

**ప్రజలంతా సుఖశాంతులతో విరాజిల్లాలి:**

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌లు ఉమ్మడిగా ఆకాంక్షించారు. చల్లని తల్లి బంగారు మైసమ్మ అమ్మవారి కరుణాకటాక్షాలతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో జీవించాలని కోరుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, జలాశయాలు నిండి, పంటలు పచ్చగా పండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు పేర్కొన్నా రు. ఈ ఘనమైన వేడుకల్లో శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులతో పాటు కౌన్సిల్ సెక్రటరీ డాక్టర్ వి. నరసింహా చార్యులు, అసెంబ్లీ సెక్రటరీ రేండ్ల తిరుపతి, ఇతర ఉన్నతాధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నైనీ నుంచి బొగ్గు రాక

(మొదటి పేజీ తరువాయి)

లోడు మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం పెగడపల్లిలోని సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రాని(ఎస్టీపీపీ)కి గురువారం చేరుకుంది. రైల్వేరేక్కు సంస్థ డైరెక్టర్లు తిరుమల్రావు(ఈఅండ్ఎం), సూర్యనారాయణ(ఆపరేషన్స్), ఈడీ చిరంజీవి, జీఎం నర్సింహారావు, గుర్తింపు కార్మిక సంఘం నాయకులు రాజ్కుమార్, కనీస వేతనాల అమలు కమిటీ చైర్మన్ జనకప్రసాద్ తదితరులు స్వాగతం పలికారు.

కేంద్ర బొగ్గుశాఖ 2015లో సింగరేణికి నైనీ బొగ్గుబ్లాక్ కేటాయించింది. అయితే ఏళ్ల తరబడి అటవీ, రవాణా తదితర అనుమతులకు అడ్డంకులు ఏర్పడ్డాయి. సీఎం రేవంత్రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవ తీసుకుని వాటిని అధిగమించారు

**చారిత్రక ఘట్టం : భట్టి ప్రశంసలు**

బొగ్గు ఉత్పత్తితోపాటు విద్యుదుత్పత్తి ద్వారా రాష్ట్ర ప్రగతికి తోడ్పడుతున్న సింగరేణికి ఒడిశాలోని నైనీ నుంచి బొగ్గు తీసుకురావడం చారిత్రక ఘట్టమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన వీడియో సందేశం ద్వారా సంస్థ యాజమాన్యానికి, అధికారులు, కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు.

'తెలంగాణ అవసరాలు తీర్చడమే కాకుండా దేశంలోని ఇతర రాష్ట్రాలకు నైనీ బ్లాకు నుంచి సింగరేణి బొగ్గు సరఫరా జరుగుతుంది' అని తెలిపారు. ఒడిశా నుంచి తెలంగాణకు బొగ్గు రవాణా చేయడంలో సహకరించిన ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు, రైల్వే ఇతర శాఖల అధికారులకు సింగరేణి సీఎండీ డాక్టర్ జ్యోతి బుద్ధప్రకాశ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# Ask Me Anything

## జెన్ జీ కోసం రాహుల్ గాంధీ కొత్త

**ఢిల్లీ, ఆగష్టు 7:** కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ దేశంలోని విద్యార్థులు మరియు జెన్ జీ యువత కోసం ఇన్స్టా గ్రామ్ వేదికగా 'అటజు ఖ్ అ్టజిజీజ అనే సరికొత్త ప్రోగ్రామ్ను ప్రారంభించారు. ఈ లైవ్ సెషన్లో దేశవ్యాప్తంగా ఉన్న విద్యా వ్యవస్థ లోపాలు, నిరుద్యోగం, జార్ఖండ్ సహా పలు ప్రాంతాల్లో జరుగుతున్న విద్యార్థుల నిరసనలపై రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు.

# సమాచార భవన్లో 'బోనాల' సంబరం!

- పోతరాజుల విన్యాసాలు, డప్పు వాయిద్యాల మధ్య సాగిన ఊరేగింపు

**హైదరాబాద్, ఆగష్టు 7 (మనం న్యూస్):** రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో మాసబ్ట్యాంక్‌లోని సమాచార భవన్ కార్యాలయ ప్రాంగణం ఆషాఢ మాస బోనాల సంబరాలతో, భక్తిపారవశ్యంగా మారింది. ప్రాంగణంలోని శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో శుక్రవారం బోనాల ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. సమాచార శాఖ ఉద్యోగుల కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా ఉత్సవ ఊరేగింపు, బోనాల సమర్పణ, ప్రత్యేక పూజలు కన్నులపండువగా సాగాయి. సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుంద రెడ్డి అమ్మవారిని దర్శించుకుని, రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**ఆకట్టుకున్న సాంప్రదాయ కళారూపాలు:**

అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు మహిళా ఉద్యోగులు సాంప్రదాయబద్ధంగా తరలిరాగా, అనంతరం నిర్వహించిన ఉత్సవ ఊరేగింపు నగర సంస్కృతిని ప్రతిబింబించింది. తీన్మార్ డప్పుల వాయిద్యాలు, పోతరాజుల వీరంగాలు, నృత్యాలు, వివిధ సాంప్రదాయ కళారూపాల ప్రదర్శనలు ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచి వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ ఘనమైన కార్యక్రమంలో సమాచార శాఖ సంచాలకులు ఎల్.ఎల్.ఆర్. కిషోర్ బాబు, అదనపు సంచాలకులు డి.ఎస్. జగన్, మీడియా అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వరరావులతో పాటు జాయింట్ డైరెక్టర్లు డి. శ్రీనివాస్, కె. వెంకటరమణ, సి.ఐ.ఈ. రాధాకిషన్ పాల్గొన్నారు. అలాగే డిప్యూటీ డైరెక్టర్లు సి. రాజారెడ్డి, జయ రామ్మూర్తి, సహాయ సంచాలకులు సత్యనారాయణ రెడ్డి, బిమల్ దేవ్, డీఐఈ నర్సింహా గౌడ్, అకౌంట్స్ ఆఫీసర్ పద్మ, టీఎస్జీవోస్ అధ్యక్షుడు మారం జగదీశ్వర్, టీజీఓ అధ్యక్షుడు యేలూరి శ్రీనివాసరావు, ఉద్యోగ సంఘాల నాయకులు అనిల్, జితేందర్, దుర్గాప్రసాద్ తదితర అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.

# మెడికల్ కోర్సుల ఫీజుపై నిర్ణయం తీసుకోవాలె

## టీఏఎఫ్ఆర్సీని ఆదేశించిన హైకోర్టు



**హైదరాబాద్, ఆగష్టు 7:** రాష్ట్రంలోని ప్రైవేటు వైద్య కళాశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఫీజుల సమస్యపై రాష్ట్ర ప్రవేశాలు, రుసుముల నియంత్రణ సంస్థ (టీఏఎఫ్ఆర్సీ) సరైన నిర్ణయం తీసుకొని విద్యార్థులకు తగిన న్యాయం చేయాలని హైకోర్టు ఆదేశించింది. ఎంబీబీఎస్ కోర్సు నాలుగున్నరేళ్ల కాలవ్యవధిని మించి ప్రైవేటు వైద్య కళాశాలలు ఆరు నెలలు అదనంగా ఫీజులు వసూలు చేస్తున్నాయంటూ 'పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ మెడికల్ స్టూడెంట్స్', ఇతరులు దాఖలుచేసిన పిటిషన్లపై హైకోర్టు ఈ మేరకు తీర్పును వెలువరించింది. జస్టిస్ జువ్వాడి శ్రీదేవి ధర్మాసనం ఈ కేసును విచారించింది. బాధిత విద్యార్థులు లేదా ప్రతినిధులు నేరుగా టీఏఎఫ్ఆర్సీని ఆశ్రయించి వినతులు సమర్పించవచ్చని హైకోర్టు స్పష్టం చేసింది. ఎటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఎంబీబీఎస్ కోర్సుకు ప్రైవేటు వైద్య కళాశాలలు ఐదేళ్లకు రుసుములు వసూలు చేస్తున్నాయని తెలిపారు. ప్రతివాదుల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. తాము నిర్ణీత రుసుమును ఐదు దఫాలుగా తీసుకుంటున్నామని, ఎలాంటి అదనపు ఫీజు వసూలు చేయడం లేదని తెలిపారు. డివిజన్ బెంచ్ తీర్పుపై సుప్రీంకోర్టు జారీచేసిన స్టే ఇంకా అమల్లో ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఈ అంశంపై లోతుగా విచారించడం లేదా ఉపశమనం కల్పించడం సాధ్యం కాదని హైకోర్టు స్పష్టం చేసింది.

## సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ టాప్

(మొదటి పేజీ తరువాయి)

చట్టం అమలులో అధికారుల సామర్థ్య నిర్మాణంతోపాటు సమాచారం, విద్య, ప్రచారం వంటి అంశాల్లో పనితీరు ఆధారంగా ర్యాంకుల్ని కేటాయించారు. దేశంలోనే మొదటిసారిగా ఎస్4సీ ఏర్పాటు చేయడంతోపాటు కీలక పోర్టళ్లను సమర్థంగా వినియోగించడంలో రాష్ట్ర పోలీసుల కృషిని పీఎంవో ప్రశంసించినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్బీ) డైరెక్టర్ శిఖా గోయెల్ ఒక ప్రకటనలో వెల్లడించారు.

# ఏఐ టెక్నాలజీతో జీఎస్టీ వ్యవస్థలో లోపాలకు అడ్డుకట్ట

(మొదటి పేజీ తరువాయి)

రాబడి పెంచుతూనే సులభతర వాణిజ్యంను మెరుగుపరిచేలా టెక్నాలజీ వాడకం ఉంటుందని సుబ్రమణియన్ వివరించారు. ప్రధానంగా భవన నిర్మాణ సామాగ్రి విషయంలో లీకేజీలను అరికట్టే విధంగా మున్సిపల్, రెరా, పంచాయతీ రాజ్, విద్యుత్, ఆర్థిక, వాణిజ్య పన్నుల శాఖల మధ్య ఏఐ సాయంతో సమన్వయం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. భారీ భవనాలు, కాంట్రాక్టు పనులకు సంబంధించిన అనుమతుల దరఖాస్తుల దశలోనే నిర్మాణ సామాగ్రి అవసరాలను దానికి అనుగుణంగా పన్నుల అంచనాల వివరాలను నమోదు చేయాలన్నారు. ఈ డేటాతో పాటు మీసేవ, ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్ వివరాలను సైతం సమీకృతం చేస్తే పరిపాలనలో ఉపయోగపడుతుందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు రామకృష్ణా రావు, సీఎస్ సంజయ్ జాజు, కమర్షియల్ టాక్స్, ఎక్సైజ్ సెక్రటరీ రఘునందన్ రావు, కమిషనర్ హరికిరణ్ పాల్గొన్నారు.

## త్వరలో డిజిటల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ

(మొదటి పేజీ తరువాయి)

పౌర సేవల డెలివరీ వంటి విప్లవాత్మక సంస్కరణలు ప్రవేశపెట్టామన్నారు. పౌరుల డేటా భద్రతకు పెద్దపీట వేసేలా త్వరలోనే బ్లాక్ చెయిన్ ఆధారిత సర్టిఫికెట్ల జారీకి శ్రీకారం చుడతామన్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రామీణ ప్రాంతాలకు టీ ఫైబర్ ద్వారా హై స్పీడ్ డిజిటల్ కనెక్టివిటీని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ పౌర సేవలను నేరుగా వారి ఇంటి ముంగిటకే అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. డిజిటల్ ఆఫీస్ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ పూర్తి స్థాయిలో పేపర్ లెస్ అడ్మినిస్ట్రేషన్‌ను అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

## గిరిజన సంక్షేమానికి కేంద్రం అండగా నిలవాలె

(మొదటి పేజీ తరువాయి)



కలిసి వినతిపత్రం అందజేశారు. గతంతో పోలిస్తే నిధులు గణనీయంగా తగ్గిన నేపథ్యంలో రాష్ట్ర అవసరాలను దృష్టిలో ఉంచుకుని అదనంగా రూ.70 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. గిరిజనులు అధికంగా నివసించే 428 గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం అమలవుతున్న పీఎంఏఏజీవై పథకం కింద మిగిలిన రూ.11.77 కోట్లను వెంటనే విడుదల చేయాలనీ, ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి కావడానికి ఈ నిధులు అత్యంత అవసరమని వివరించారు. తెలంగాణ ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందనీ, గిరిజన ప్రాంతాల్లో విద్య, మౌలిక సదుపాయాలు సంక్షేమ కార్యక్రమాల విస్తరణకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం విస్తృత చర్యలు చేపడుతోందని తెలిపారు. మంత్రి అడ్లూరి విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి ఓరాం పెండింగ్ నిధులను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలైన రోడ్లు ఇతర అవసరాల కోసం కేంద్రం నిధులు విడుదల చేయడానికి స్థిరంగా ఉందని ఈమేరకు రోడ్ల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించాలని కోరారు.

# బీఆర్ఎస్ సోషల్ మీడియాకు మాత్రమే పరిమితం

(మొదటి పేజీ తరువాయి)

చైర్మన్‌గా అవకాశం కల్పించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి, సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఢిల్లీలో ఏఐసీసీ అ్యక్షుడు ఖర్గే, అగ్రనేత ఎంపి ప్రియాంక గాంధీలను కలిసిన అనంతరం కిరణ్‌కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డిపై దుష్ప్రచారం చేసి శునకానందం పొందాలని బీఆర్ఎస్ చూస్తోందనీ, ఆ పార్టీ తప్పుడు ప్రచారాలను క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ కార్యకర్తలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గోదావరి-బనకచర్లపై కేంద్రం వెనక్కి తగ్గడం వెనక సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ కృషి ఉందనీ, కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎంపై బురదచల్లడమే బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీష్ లక్ష్యమని విమర్శించారు. నీళ్ల పేరుతో మరో సారి తెలంగాణ ప్రజలను రెచ్చగొట్టి సెంటిమెంట్‌ను తెరపైకి తేవాలని చూస్తున్నారనీ, బీఆర్ఎస్, బీజేపీ తప్పుడు ప్రచారాలను తిప్పికొడతామని ఈ సందర్భంగా చామల స్పష్టం చేశారు.



## మైనింగ్ కాంట్రాక్టర్లను పెనాల్టీ పేరుతో వేధించొద్దు

(మొదటి పేజీ తరువాయి)

మైనింగ్ నిబంధనల పేరుతో భారీ పెనాల్టీలు విధించడం సరికాదని స్పష్టం చేశారు. రూ.5 కోట్ల పనికి రూ.54 కోట్ల పెనాల్టీ విధించడం దుర్మార్గం. చిన్న కాంట్రాక్టర్లను ఇలాంటి భారీ పెనాల్టీతో ఇబ్బందులకు గురి చేయడం సరికాదు. అక్రమ మైనింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు, ప్రభుత్వ అభివృద్ధి పనులు చేస్తున్న చిన్న కాంట్రాక్టర్లపై దౌర్జన్యంగా వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. కాంట్రాక్టర్లు అగ్రిమెంట్ ప్రకారం ప్రభుత్వ పనులు నిర్వహిస్తున్నారనీ, అవసరమైన మెటీరియల్ విషయంలో వారిని అనవసరంగా ఇబ్బందులకు గురి చేయవద్దని సూచించారు. మైనింగ్ అధికారుల వేధింపుల నేపథ్యంలో కాంట్రాక్టర్ శ్రీనివాసరెడ్డి ఆత్మహత్యకు కారణమైన అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఇందిరమ్మ చీరలు ఎలుకల పాలవుతున్నె

మన్నె క్రిషాంక్

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా తెచ్చి, గంభీర్యంగా ప్రచారం చేసుకు(ంటొ)న్న ఇందిరమ్మ చీరలు ఎలుకల పాలువుతున్నాయని బీఆర్ఎస్ నాయకుడు మన్నె క్రిషాంక్ ఆరోపించారు.

కంటోన్మెంట్‌లోని ఈ వర్క్ షాపులో ఇందిరమ్మ చీరలు పడేశారు, అవన్నీ ఎలుకలు కొరుకుతున్నాయని తెలిపారు.

2025 నవంబర్ నెలలో కోటి ఇందిరమ్మ చీరలు పంచుతామని ప్రకటించి, ఇప్పటివరకు కూడా పంపిణీ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు చీరలు ఒద్దు అంటున్నారా లేక మీరే కావాలని పంచడంలేదా ? ప్రజాధనం ఎందుకు వృథా చేస్తున్నారు? అని ప్రశ్నించారు.

# పెరుగుతున్న యువత.. తరుగుతున్న కొలువులు

(మొదటి పేజీ తరువాయి)

- **34. దేశంలో 2030 తర్వాత పనిచేసే యువ జనాభా తగ్గడం మొదలవుతుంది. యువ జనాభాతో ఆర్థికాభివద్ధి సాధించాలంటే రానున్న పదేళ్లలో భారీగా ఉద్యోగాలు కల్పించాలి.**

- **2007-2017 మధ్య అత్యంత పేద కుటుంబాలకు చెందిన విద్యార్థుల వాటా ఉన్నతవిద్యలో 8 శాతం నుంచి 15 శాతానికి పెరిగింది. అయితే చాలామంది యువకులు కుటుంబానికి ఆసరాగా ఉండేందుకు ఉన్నత చదువులు మధ్యలో నిలిపివేస్తున్నారు. 2017లో చదువుకుంటున్న యువకుల వాటా 38 శాతం ఉంటే.. 2024 నాటికి అది 34 శాతానికి తగ్గింది.**

- **యువతకు విద్యాసంస్థల లభ్యత పెరిగినప్పటికీ.. ప్రైవేటు సంస్థలదే అధికవాటా ఉండటంతో ప్రాంతీయ వ్యత్యాసాలు పెరుగుతున్నాయి. చదువుకున్న యువతకు ఎంట్రీ లెవల్ ఉద్యోగాల సంఖ్య తగ్గింది. ఈ స్థాయి ఉద్యోగాల్లో వేతన పెరుగుదల కూడా స్వల్పంగానే ఉంది.**

**ఉద్యోగమే కఠిన పరీక్ష..**

యవతకు డిగ్రీ పూర్తిచేయడం ఒకెత్తు అయితే.. ఉద్యోగం సంపాదించడం కఠిన పరీక్షగా మారుతోంది. కోరుకున్న ఉద్యోగం రాకపోవడం, నిరుద్యోగిగా ఉండటం ఇష్టం లేక చాలీచాలని సంపాదనతో ఏదో ఒక రంగాన్ని ఎంపిక చేసుకుని చాలామంది సర్దుబాటు చేసుకుంటున్నారు.

15-25 ఏళ్ల వయసులో నిరుద్యోగం 40 శాతం ఉంటే.. 25-29 ఏళ్లవారిలో ఇది 20 శాతంగా ఉంది. డిగ్రీ పూర్తయిన ఏడాదిలో 50 శాతం మందే ఏడాదిలోగా ఏదో ఒక ఉపాధి పొందుతున్నారు. అయితే శాశ్వత వేతనం, వైట్‌కాలర్ ఉద్యోగాల్లో వీరి సంఖ్య తక్కువే. పట్టభద్రుల్లో 6.7 శాతమే పర్మినెంట్ వేతన.. 3.7 శాతం మంది వైట్‌కాలర్ ఉద్యోగాలు పొందుతున్నారు. 2004 నుంచి 2023 వరకు ఏటా దాదాపు 50 లక్షల మంది పట్టభద్రులు పెరుగుతుంటే.. వీరిలో 28 లక్షల మందికి మాత్రమే ఉపాధి లభిస్తోంది. వీరిలోనూ 17 లక్షల మంది మాత్రమే రెగ్యులర్ వేతన కార్మికులుగా మారుతున్నారు. 1983తో (13%) పోల్చితే ప్రస్తుతం యువ పట్టభద్రుల్లో నిరుద్యోగ వాటా 67 శాతానికి పెరిగింది.

**సవాల్‌గా మారుతున్న ఏఐ..**

యువతకు కృత్రిమ మేధ(ఏఐ) సవాల్‌గా నిలిచింది. ప్రారంభ ఉద్యోగాలు తగ్గిపోయాయి. గత ఐదేళ్లలో తగిన సంఖ్యలో రెగ్యులర్ వేతన ఉద్యోగాల ఉత్పత్తి జరగలేదు. కరోనా తర్వాత దేశంలో ఉద్యోగార్థుల సంఖ్య 49 కోట్ల నుంచి 57.2 కోట్లకు పెరిగింది. దేశంలో అసమానమైన ఆర్థికాభివద్ధి కారణంగా ఉపాధి పొందేందుకు యువతకు వలస వెళ్లడం ప్రధాన మార్గంగా మారుతోంది.

చదువుకున్న యువ కార్మికులు వేగంగా వ్యవసాయాన్ని వదిలిపెట్టి తయారీ, సేవా రంగాల్లోకి వస్తున్నారు. యువ మహిళలు తయారీ, ఐటీ, ఆటోమొబైల్, బిజినెస్, సపోర్ట్ సర్వీసెస్ వంటి ఆధునిక సేవల రంగాల్లో పెరుగుతున్న ఉపాధి పొందుతున్నారు. గతంలో చదువుకున్న మహిళల్లో 45.8 శాతం మంది టీచర్ ఉద్యోగాలకు వెళ్లేవారు. ఇప్పుడు ఆ వాటా 23.1 శాతానికి పడిపోయింది. తెలంగాణలో పట్టభద్రులైన మహిళల్లో నిరుద్యోగుల వాటా 52%.. పురుషుల్లో అది 28 శాతం.

# తెలంగాణ ఎస్ఐఆర్ ప్రక్రియ

## తొలగింపు జాబితాలో 56 లక్షల మంది

## పెండింగ్‌లో మరో 19 లక్షల మంది

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియలో తుది దశకు చేరుకుంది. ఇప్పటివరకు సుమారు 56 లక్షల మంది ఓటర్లను తొలగింపు కోసం గుర్తించగా.. మరో 19 లక్షల ఎన్యుమరేషన్ ఫారాలు ఇంకా డిజిటైజేషన్ కోసం పెండింగ్‌లో ఉన్నాయి. పూర్తిగా ఇతర ప్రాంతాలకు మారినవారు.. చనిపోయినవారు, రెండు చోట్ల ఓట్లు ఉన్నవారు, గుర్తించలేని ఓటర్లు.. ఈ తొలగింపు జాబితాలో ఉన్నారని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఆగస్ట్ 10లోపు పెండింగ్ ఫారాల పరిశీలన పూర్తి అయిన తర్వాత లెక్క తేలుతుందని అధికారులు తెలిపారు. తెలంగాణలో ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్) శరవేగంగా కొనసాగుతోంది. ఈ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఇప్పటివరకు సుమారు 56 లక్షల మంది ఓటర్లను తొలగింపు కోసం గుర్తించారు. రాష్ట్రంలోని మొత్తం 3.38 కోట్ల మంది ఓటర్లలో ఇది సుమారు 16.5 శాతం కావడం గమనార్హం. అయితే ఈ లెక్కలు ఇంకా ఫైనల్ కావని.. మిగిలిన 19 లక్షల ఫారాల పరిశీలన పూర్తి అయిన తర్వాత ఇందులో మరిన్ని మార్పులు చోటుచేసుకునే అవకాశముందని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ప్రస్తుతం దాదాపు 19 లక్షల ఎన్యుమరేషన్ ఫారాలు ఇంకా డిజిటైజేషన్‌కు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవి మొత్తం ఓటర్లలో సుమారు 5.6 శాతం కావడం గమనార్హం. ఈ ఫారాల డేటా నమోదు ప్రక్రియ ఆగస్ట్ 10వ తేదీ లోపు పూర్తికానుందని అధికారులు పేర్కొన్నారు. ఆ తర్వాత ఈ ఓటర్ల వివరాలను పరిశీలించి వారు ఉంటుందో లేక తొలగింపు జాబితాలో చేర్చాలో తుది నిర్ణయం తీసుకోనున్నారు. అందువల్ల తొలగింపు జాబితాలో ఉన్న వారి సంఖ్య ఇంకా పెరగవచ్చని లేదా తగ్గవచ్చని అధికారులు స్పష్టం చేశారు.

# నేడు.. గిగ్ వర్కర్ల సమ్మె




## రేవంత్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని జేపీసీ ఆరోపణ

## సంక్షేమ బోర్డు ఏర్పాటు, కనీస ఛార్జీలు ఖరారు చేయాలని డిమాండ్

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణలో యాప్ ఆధారిత వాహన, ఫుడ్ డెలివరీ సేవలకు నేటి నుంచి బ్రేక్ పడనుంది. ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి క్యాబ్ సర్వీసులతో పాటు స్విగ్గీ, జొమాటో, జెప్టో వంటి ఫుడ్ డెలివరీ సేవలు రాష్ట్రవ్యాప్తంగా నిలిచిపోనున్నాయి. అయితే, నేటి (ఆగస్టు 8) నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు గిగ్ వర్కర్ల 'జాయింట్ యాక్షన్ కమిటీ' (జేఏసీ) ప్రకటించింది. ఈ మేరకు హైదరాబాద్ నాంపల్లిలోని గిగ్ ఆఫీసులో సమావేశమైన 16 సంఘాల ప్రతినిధులు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా సరైన స్పందన లేకపోవడంతోనే సమ్మెకు దిగుతున్నట్లు జేఏసీ నేతలు స్పష్టం చేశారు. గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, తెలంగాణ గిగ్, ప్లాట్ ఫామ్ వర్కర్స్ రూల్స్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. యాప్ ఆధారిత రవాణా సేవలకు కనీస ఛార్జీ, కిలోమీటర్‌కు, నిమిషానికి న్యాయపరమైన ఛార్జీలను నోటిఫై చేయాలని కోరుతున్నారు. మోటార్ వెహికల్ అగ్రిగేటర్ మార్గదర్శకాలకు అనుగుణంగా కనీస ఛార్జీలు నిర్ణయించి, డ్రైవర్లు, డెలివరీ సిబ్బందికి స్థిరమైన ఆదాయం లభించేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమతో సమావేశమై.. పలు హామీలు ఇచ్చారని, వాటిని ఇంతవరకు నెరవేర్చలేదని జేఏసీ నేతలు గుర్తు చేస్తున్నారు. గిగ్ వర్కర్ల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు, ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ప్రత్యేక యాప్‌ను తీసుకొస్తామని నాడు సీఎం హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ, ఆ హామీలు అమలుకు నోచుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. యాప్ సంస్థలు అమలు చేస్తున్న అన్యాయమైన ఛార్జీల వల్ల తమ ఆదాయం గణనీయంగా తగ్గిపోయిందని, అందుకే సమ్మె తప్ప మరో మార్గం లేదని వారు స్పష్టం చేశారు. అయితే ఈ సమ్మెలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 16 సంఘాలు పాల్గొంటున్నాయన్నారు. తమ సమ్మెకు ప్రజలు కూడా సహకరించాలని వారు కోరుతున్నారు. ఈ సమ్మెతో ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో ప్రయాణికులు, ఫుడ్ డెలివరీ సేవలపై ఆధారపడిన వారు మాత్రం తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం లేకపోలేదు.

# పెట్టేం నవీన్కు కీలకమైన రాష్ట్ర సోషల్ మీడియా చైర్మన్ బాధ్యతలు



కరీంనగర్ ఆగస్టు 7 (మనం బ్యూరో): కరీంనగర్ పట్టణానికి చెందిన పెట్టేం నవీన్కు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సోషల్ మీడియా చైర్మన్గా కీలక బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ కేసీ వేణుగోపాల్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

గతంలో రాష్ట్ర సోషల్ మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్గా పనిచేసిన పెట్టేం నవీన్, కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో సోషల్ మీడియా వేదికగా ప్రతి జిల్లా లో నిత్యం సంబంధిత జిల్లా కార్యకర్తలతో సమావేశంలు నిర్వహిస్తూ కష్టపడి పనిచేశారు. ఈ సందర్భంగా పెట్టేం నవీన్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షులు, మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి మరింత కష్టపడి పనిచేస్తానని, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు విస్తృతంగా చేరువ చేస్తానని పేర్కొన్నారు.

## కేసులకు భయప(డ?)డేది లేదు?

- ప్రజల పక్షాన పోరాడుతాం




హైదరాబాద్, మనం ప్రతినిధి : తమపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ఏ మాత్రం భయపడేదే లేదని, ప్రజల పక్షాన ఇంకా పోరాటం గట్టిగా కొనసాగిస్తామని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల ఘటనపై నమోదైన కేసు విచారణ నిమిత్తం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి ఆయన శుక్రవారం మంచిర్యాల జిల్లా కోర్టుకు హాజరయ్యారు. కేసును విచారించిన న్యాయస్థానం తదుపరి విచారణను సెప్టెంబర్ 25కు వాయిదా వేసింది. అనంతరం మీడియాతో మాట్లాడిన బాల్క సుమన్... క్యాతనపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజారిటీ వచ్చినప్పటికీ, కాంగ్రెస్ పార్టీ అక్రమ మార్గాల్లో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను దక్కించుకోవడానికి ప్రయత్నించిందని ఆరోపించారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లకు కోట్ల రూపాయలు, బ్లాంక్ చెక్కులు చూపించినా లొంగకపోవడంతోనే తమపై కక్షపూరితంగా తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపారని విమర్శించారు. ప్రతిపక్ష నాయకులకు, బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్తలకు ఒక చట్టం, అధికార పార్టీ నేతలకు మరొక చట్టం అన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు అయ్యే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు.

## తెలంగాణ ప్రాజెక్టులకు సమీక్ష సరికాదు?

- జలశక్తి మంత్రికి హరీశ్‌రావు లేఖ
- చట్టపరమైన అంశాలను పరిశీలించాకే టెక్నికల్ అడ్వైజరీ కమిటీ ఆమోదం ఇచ్చింది

హైదరాబాద్, మనం ప్రతినిధి : కేంద్ర ప్రభుత్వం నుంచి అన్ని రకాల అనుమతులు, సాంకేతిక క్లియరెన్సులు పొందిన తెలంగాణకు చెందిన ఏడు ప్రాజెక్టులను మళ్లీ సమీక్షించే అంశాన్ని జీఆర్ఎంబీ సమావేశం ఎజెండాలో చేర్చడాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ మేరకు జలశక్తి మంత్రికి, సెక్రటరీకి రాసిన లేఖను విడుదల చేశారు. అజెండాలో పేర్కొన్న అంశాలను ఉపసంహరించుకోవాలని, పెండింగ్‌లో ఉన్న సమ్మక్క సాగర్ ప్రాజెక్ట్ అనుమతులను తక్షణమే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని పలు భారీ సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన సాంకేతిక, హైడ్రోలాజికల్, ఇంజనీరింగ్, పర్యావరణ, చట్టపరమైన అంశాలను కేంద్ర జల సంఘం, జలశక్తి మంత్రిత్వ శాఖలు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే టెక్నికల్ అడ్వైజరీ కమిటీ ఆమోదం తెలిపిందని గుర్తుచేశారు. సెంట్రల్ వాటర్ కమిషన్ నుంచి ఇప్పటికే హైడ్రోలాజికల్ అనుమతులు పొందిన సమ్మక్క సాగర్ ఎత్తిపోతల పథకానికి మిగిలిన చట్టబద్ధమైన అనుమతులను కూడా మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్రం సకాలంలో జోక్యం చేసుకుని తెలంగాణ నీటి హక్కులను కాపాడుతుందని తాను విశ్వసిస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు.

# తెలంగాణ అసెంబ్లీలో ఒడిసా స్టాండింగ్ కమిటీ అధ్యయనం!

- ఉభయ సభల పనితీరు, కమిటీల ఏర్పాటుపై సమగ్ర చర్చ
- స్వాగతం పలికిన చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్
- ఇరు రాష్ట్రాల శాసనసభల మధ్య సాంప్రదాయాలు, విధివిధానాల మార్పిడి



హైదరాబాద్, ఆగస్టు 7 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర శాసనసభ, శాసనమండలిల పనితీరును అధ్యయనం చేసేందుకు ఒడిస్సా అసెంబ్లీకి చెందిన శాఖల సంబంధిత స్టాండింగ్ కమిటీ ప్రతినిధుల బృందం శుక్రవారం హైదరాబాద్‌లో పర్యటించింది. స్టడీ టూర్లో భాగంగా శాసనసభ ప్రాంగణానికి విచ్చేసిన ఈ ఉన్నత స్థాయి కమిటీకి తెలంగాణ చట్టసభల అధిపతులు ఘనస్వాగతం పలికారు. ఒడిస్సా స్టాండింగ్ కమిటీ చైర్మన్ సుధీర్ రంజన్ పథజోషి నేతృత్వంలో వచ్చిన సభ్యులకు శాసనమండలి సమావేశ మందిరంలో తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్‌లు సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఒడిస్సా కమిటీ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను బహుకరించారు.

### కమిటీల పనితీరుపై విస్తృత చర్చ:

ఈ పర్యటనలో భాగంగా ఇరు రాష్ట్రాల శాసనసభల ప్రతినిధుల మధ్య కీలక సమావేశం జరిగింది. తెలంగాణ, ఒడిస్సా రాష్ట్రాల శాసనసభలలో కమిటీల ఏర్పాటు విధానం, అవి పనిచేసే తీరు, శాసన ప్రక్రియలో కమిటీల పాత్ర ఎంతవరకు ప్రభావవంతంగా ఉంటుందనే అంశాలపై ఇరుపక్షాలు విస్తృతంగా చర్చించాయి. చట్టసభల గౌరవాన్ని పెంపొందించడంలో, ప్రజల సమస్యలపై ప్రభుత్వాలను జవాబుదారీ చేయడంలో స్టాండింగ్ కమిటీలు పోషిస్తున్న పాత్రను ఇరు రాష్ట్రాల ప్రతినిధులు పంచుకున్నారు. తెలంగాణ అసెంబ్లీ అనుసరిస్తున్న అత్యుత్తమ విధానాలను ఒడిస్సా బృందం ఆసక్తిగా అడిగి తెలుసుకుంది. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ సెక్రటరీ డాక్టర్ వి. నరసింహా చార్యులు, అసెంబ్లీ సెక్రటరీ రేండ్ల తిరుపతితో పాటు లెజిస్లేటివ్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పద్య సాహిత్యంలో.. 'మూసీ' వైభవం!

## 'మూసీ తరంగాలు - సింహవాహిని శతకం' పుస్తకావిష్కరణ

- ప్రత్యేక కమిషనర్ ముకుందరెడ్డి, మూసీ పునర్జీవన సంస్థ ఎండీ వెంకట నరసింహారెడ్డి ఆవిష్కరణ



హైదరాబాద్, ఆగస్టు 7 (మనం న్యూస్): భాగ్యనగర జీవనాడి అయిన మూసీ నది చారిత్రక ప్రాశస్త్యాన్ని, నగర సంస్క ృతికి ప్రతీకలైన ఆషాఢ బోనాల ఉత్సవాల వైభవాన్ని సమన్వయం చేస్తూ ప్రముఖ జర్నలిస్ట్, కవి వరకాల యాదగిరి రచించిన 'మూసీ తరంగాలు - సింహవాహిని శతకం' పద్య సంకలనం ఆవిష్క ృతమైంది. మాసబ్‌ట్యాంక్‌లోని మూసీ పునర్జీవన సంస్థ కార్యాలయంలో జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుంద రెడ్డి, మూసీ పునర్జీవన సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఈ. వెంకట నరసింహారెడ్డిలు సంయుక్తంగా ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు.

### ప్రభుత్వ సంకల్పానికి సాహితీ రూపం:

ఈ సందర్భంగా మూసీ పునర్జీవన సంస్థ ఎండీ వెంకట నరసింహారెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ నది సమూల ప్రక్షాళన ప్రాధాన్యతను ఈ పుస్తకంలో పద్యాల రూపంలో ఆకట్టుకునేలా మలిచారని కొనియాడారు. చారిత్రాత్మక గోల్కొండ కోట జగదాంబిక ఆలయం, బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం, సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి, లాల్ దర్వాజా సింహవాహిని ఆలయాల్లో నెల రోజుల పాటు జరిగే బోనాల సంబరాల వైభవాన్ని, ఒకప్పటి ముచుకుందా నది ప్రవాహ వర్ణనలను ఈ శతకంలో అద్భుతంగా విశ్లేషించారని ప్రశంసించారు. ఆధునిక కాలంలో సాంప్రదాయ తెలుగు పద్య సాహిత్యంలో ఇలాంటి ఉత్క ృష్ట గ్రంథాన్ని వెలువరించడం ముదావహమన్నారు.

### నేటి తరానికి విజ్ఞానదాయకం:

సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుంద రెడ్డి మాట్లాడుతూ.. సీనియర్ జర్నలిస్ట్ వరకాల యాదగిరి కలం నుంచి కేవలం వార్తలే కాకుండా, నగర సంస్క ృతిని ప్రతిబింబించే పద్య సాహిత్యం రావడం విశేషమన్నారు. జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ యాదగిరి తన సుదీర్ఘ అనుభవంతో హైదరాబాద్ వారసత్వ సంపదపై రాసిన ఈ చారిత్రక అంశాలు నేటి తరానికి ఎంతో విజ్ఞానదాయకంగా నిలుస్తాయన్నారు. నాలుగున్నర దశాబ్దాలుగా మూసీ నది ప్రవాహాన్ని, నగర సంస్క ృతిని పరిశీలించిన అనుభవంతోనే ఈ పుస్తకానికి శ్రీకారం చుట్టానని రచయిత వరకాల యాదగిరి భావోద్వేగంతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మూసీ పునర్జీవన సంస్థ డైరెక్టర్లు విష్ణువర్ధన్ రావు, భాస్కరరావు తదితరులు పాల్గొని కవి యాదగిరిని ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

# నేతన్నపై కక్షపూరిత వైఖరి వద్దు

- రద్దు చేసిన పథకాలను తక్షణమే పునరుద్ధరించండి
- జాతీయ చేనేత దినోత్సవవేళ సీఎం రేవంత్‌కు కేటీఆర్ లేఖ

హైదరాబాద్, మనం ప్రతినిధి : జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వేలాది చేనేత కుటుంబాలకు ఆర్థిక ధీమానిచ్చిన 'నేతన్న బీమా', 'నేతన్నకు చేయూత' వంటి గొప్ప పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసి నేతన్నలను కోలుకోలేని దెబ్బతీసిందని తన లేఖలో ఆయన మండిపడ్డారు. బతుకమ్మ చీరలు, స్కూల్ యూనిఫారాల తయారీ ఆర్డర్లను పక్కనబెట్టి, కమీషన్ల కోసం ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చిన రూ.18 వేల ఆర్థిక సాయం, రూ.లక్ష వ్యక్తిగత రుణమాఫీ, 5 శాతం జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేటీఆర్ దుయ్యబట్టారు. ప్రభుత్వం ఇప్పటికైనా కక్షపూరిత వైఖరి వీడి, రద్దు చేసిన పథకాలను తక్షణమే పునరుద్ధరించి నేతన్న కుటుంబాలకు అండగా నిలవాలని ఆయన డిమాండ్ చేశారు.

# చొప్పదండి రైతాంగానికి మరో శుభవార్త..!

- ఫలించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృషి
- నారాయణపూర్ చెరువు అభివృద్ధికి రూ.20 కోట్లు విడుదల
- బండ్ విస్తరణకు ప్రభుత్వ ఆమోదం



కరీంనగర్, ఆగస్టు 7(మనం బ్యూరో): చొప్పదండి నియోజకవర్గ రైతాంగానికి తెలంగాణ ప్రభుత్వం మరో శుభవార్త అందించింది. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పరిధిలోని నారాయణపూర్ చెరువు అభివృద్ధి, బండ్ విస్తరణ పనులకు కీలకమైన భూసేకరణ కోసం ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులను విడుదల చేసింది. ఈ నిధుల విడుదలతో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న నారాయణపూర్ చెరువు అభివృద్ధి పనులు మరింత వేగవంతం కానున్నాయి. ముఖ్యంగా బండ్ విస్తరణ, గ్రావిటీ కాలువ నిర్మాణం, చెరువుల ఆధునికీకరణ పనులకు వేగం చేకూరనుంది. ఈ నిధుల మంజూరుతో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చేసిన నిరంతర కృషి ఫలించింది.



# తెలంగాణలో రూ.40,769 కోట్ల రైల్వే ప్రాజెక్టులు



## కొత్త రైల్వే లైన్లు, డబ్లింగ్ పనులు వేగవంతం

## పార్లమెంట్‌లో రైల్వే మంత్రి వెల్లడి

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణలో రూ.40,769 కోట్లతో 21 ప్రధాన రైల్వే ప్రాజెక్టులు అమలులో ఉన్నాయని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ లోక్ సభలో తెలిపారు. ఆరు కొత్త రైల్వే లైన్లు, 15 ట్రాక్ డబ్లింగ్ ప్రాజెక్టుల్లో ఇప్పటివరకు 677 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయని చెప్పారు. అయితే భూసేకరణ ప్రధాన అడ్డంకిగా మారి పలు ప్రాజెక్టులు ఆలస్యమవుతున్నాయన్నారు. రాష్ట్రంలో కొత్త రైలు సర్వీసులు, కార్గో టెర్మినళ్లు, రైల్వే ఓవర్ బ్రిడ్జిల అభివృద్ధి కూడా కొనసాగుతోందని కేంద్రం వెల్లడించింది.

తెలంగాణలో రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధి వేగంగా కొనసాగుతోందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ప్రస్తుతం 21 ప్రధాన రైల్వే ప్రాజెక్టులు వివిధ దశల్లోఅమలులో ఉన్నాయని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ లోక్సభలో లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో రైల్వే అనుసంధానం, సరకు రవాణా సామర్థ్యం, ప్రయాణికుల సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి వెల్లడించిన వివరాల ప్రకారం.. ప్రస్తుతం తెలంగాణలో ఆరు కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టులు, 15 ట్రాక్ డబ్లింగ్ ప్రాజెక్టులు కొనసాగుతున్నాయి. వీటి మొత్తం పొడవు 2,347 కిలోమీటర్లు. ఇందులో ఇప్పటివరకు 677 కిలోమీటర్ల పనులు పూర్తయ్యి ప్రారంభించగా, ఈ ఏడాది మార్చి నాటికి రూ.12,105 కోట్ల వ్యయం జరిగినట్లు కేంద్రం వెల్లడించింది. మిగిలిన పనులను కూడా దశలవారీగా పూర్తి చేసేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపింది. ప్రస్తుతం కొనసాగుతున్న కీలక ప్రాజెక్టుల్లో భద్రాచలం మీదుగా మల్కన్గిరి-పాండురంగపురం 174 కిలోమీటర్ల కొత్త రైల్వే లైన్ ముఖ్యమైనది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.3,592 కోట్లు. అలాగే సికింద్రాబాద్-వాడి మూడో, నాలుగో రైల్వే లైన్ల నిర్మాణానికి రూ.5 వేల కోట్లకు పైగా ఖర్చు చేయనున్నారు. మునిరాబాద్-మహబూబ్ నగర్ కొత్త రైల్వే లైన్ కూడా మరో కీలక ప్రాజెక్టుగా కొనసాగుతుండగా.. దీని అంచనా వ్యయం దాదాపు రూ.4 వేల కోట్లుగా ఉంది. ఈ ప్రాజెక్టులు పూర్తయితే రాష్ట్రంలో రైల్వే కనెక్టివిటీ మరింత బలోపేతం కానుంది. అయితే ఈ ప్రాజెక్టుల అమలులో భూసేకరణ ప్రధాన అడ్డంకిగా మారిందని కేంద్రం వెల్లడించింది. ప్రస్తుతం కొనసాగుతున్న పనులకు మొత్తం 2,792 హెక్టార్ల భూమి అవసరమవుతుండగా.. ఇప్పటివరకు 1,772 హెక్టార్లు మాత్రమే సేకరించగలిగారు. ఇంకా 1,020 హెక్టార్ల భూమి అందుబాటులోకి రావాల్సి ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా గుంటూరు-బీబీనగర్ డబ్లింగ్, ముద్ఖేడ్-మేడ్చల్, మహబూబ్ నగర్-డోన్ డబ్లింగ్ ప్రాజెక్టులు భూసేకరణ ఆలస్యం కారణంగా మందగించినట్లు తెలిపారు.

రైల్వే నిర్మాణ పనుల వేగం గతంతో పోలిస్తే గణనీయంగా పెరిగిందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. 2014 నుంచి 2026 వరకు తెలంగాణలో 888 కిలోమీటర్ల కొత్త రైల్వే ట్రాక్లు ప్రారంభించగా.. సగటున ప్రతి ఏడాది సుమారు 74 కిలోమీటర్ల కొత్త లైన్లు అందుబాటులోకి వచ్చాయని పేర్కొంది. అలాగే గత మూడు సంవత్సరాలు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కలిపి రాష్ట్రంలో 31 కొత్త సర్వేలకు అనుమతి ఇచ్చినట్లు వెల్లడించింది. ఇందులో 15 కొత్త రైల్వే లైన్లు, 16 ట్రాక్ డబ్లింగ్ ప్రాజెక్టులు ఉండగా.. వీటి మొత్తం పొడవు 3,902 కిలోమీటర్లు. ప్రయాణికుల సౌకర్యాల విస్తరణలో భాగంగా 2025-26 ఆర్థిక సంవత్సరం, జూన్ 30 వరకు తెలంగాణకు 21 జతల కొత్త రైలు సర్వీసులు ప్రారంభించినట్లు కేంద్రం తెలిపింది. వీటిలో చర్లపల్లి నుంచి షాలిమార్, కామాఖ్య, తిరువనంతపురం నార్త్, ముజఫర్పూర్ వంటి గమ్యస్థానాలకు నడిచే 10 అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ సర్వీసులు కూడా ఉన్నాయన్నారు. దీంతో తెలంగాణ నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు రైలు ప్రయాణ సౌకర్యం మరింత మెరుగుపడనుందని చెప్పారు. సరకు రవాణా మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూడా కేంద్రం ప్రాధాన్యం ఇస్తోంది. తెలంగాణలో సత్తుపల్లి, సుల్తానాబాద్, తిప్పర్తి, రామగుండం, చిట్యాల, విష్ణుపురం ప్రాంతాల్లో ఇప్పటికే ఆరు మల్టీ-మోడల్ కార్గో టెర్మినళ్లు ప్రారంభమయ్యాయి. మరో ఎనిమిది ప్రాంతాలకు సూత్రప్రాయ అనుమతి లభించిందన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో రూ.4,883 కోట్ల వ్యయంతో 118 రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, రైల్వే అండర్ బ్రిడ్జిలు మంజూరు చేసినట్లు కేంద్రం తెలిపింది. అయితే వీటిలో 16 ఆర్వోబీ ప్రాజెక్టులు ఆలస్యమవుతున్నాయని, అందులో 15 భూసేకరణ సమస్యల వల్ల, ఒకటి అలైన్‌మెంట్ ఖరారు కాకపోవడం వల్ల పెండింగ్లో ఉన్నట్లు వెల్లడించింది.

## వ్యవస్థీకృత నేరం!

ల్యాబ్ గడప తొక్కలేదు
పుస్తకం విప్పలేదు..కానీ వైద్య సరంజామా అంతా
వచ్చేసింది చాలా నీట్‌గా!
గుండె చప్పుడు వినే 'స్టెతస్కోప్' అడగబోయి-
లంచాలు మింగే 'సెక్షన్‌స్కోప్'లా
వ్యవస్థను వాడేవారు చాలా నీట్ గా!
బాడీ టెంపరేచర్ కొలిచే 'థర్మామీటర్' కాదిది -
పరీక్ష పేపర్ల రేటును పెంచే'టర్మినేటర్'
అని ముందే మార్చేశారు చాలా నీట్‌గా!

మందులు ఎక్కించే 'సిరంజి'తో పనిలేదు -
పేదోడి భవిష్యత్తును పిండేసే
'స్పాంజి'లా దాన్ని మార్చేశారు చాలా నీట్‌గా!
ఆపరేషన్ చేసే 'సర్జికల్ బ్లేడు' అడగబోయి -
మెరిట్ విద్యార్థుల గొంతులు
కోసే 'పొలిటికల్ బ్లేడు' తో
ప్రాక్టికల్స్ చేసేశారు చాలా నీట్ గా!
గాయాలకు కట్టే 'బ్యాండేజ్' బదులుగా -
ల్యాబ్ బయటే సాక్ష్యాలకు'బాండేజ్'
నేర్పేశారు చాలా నీట్ గా!

పేషెంట్ కు ఇచ్చే 'అనస్థీసియా' అనబోయి -
ప్రజలందరినీ మత్తులో ముంచేసే
'ఆమ్నేషియా' ఇచ్చేశారు చాలా నీట్ గా!
ఆక్సిజన్ అందించే'వెంటిలేటర్'
మీద పెట్టాల్సింది పోయి- ర్యాంకుల వ్యాపారం చేసే
'ఇన్క్యుబేటర్'లో సీట్లను పెంచేశారు చాలా నీట్ గా!
మైక్రోస్కోప్ లో బ్యాక్టీరియాని చూడటం మానేసి -
'మ్యాక్రోస్కోప్' వేసి సీట్లు రేట్లను పెద్దగా చూస్తూ
వ్యాపారం ముగించారు చాలా నీట్ గా!

బీపీ కొలిచే 'స్పిగ్మో మానోమీటర్' అనబోయి -
విద్యార్థులు రక్తాన్ని పీల్చే 'స్మగ్లర్-మానోమీటర్' తో
పోరాటాన్ని నిలిపేశారు చాలా నీట్ గా!
ఈసీజీ తీసి గుండె
లయను కనిపెట్టడం రాకపోయినా -
లీకేజీ నెట్ వర్క్ కోసం 'టెలిగ్రామ్' గ్రూపుల
లయను మాత్రం కనిపెట్టారు చాలా నీట్ గా!
ప్రిస్క్రిప్షన్ రాయడం నేర్చుకోకుండానే -
లీకేజీ వీరులతో కలిసి సీట్లు కోసం 'సబ్ స్క్రిప్షన్'
ప్లాను గీశారు చాలా నీట్ గా!
ఎండోస్కోపీ చేసి రోగి లోపలి
భాగాలను చూడటం పక్కనపెట్టి -
'విండో-స్కోపీ' (కిటికీ గుండా) పేపర్లు బయటకు
తోసేయడం నేర్చుకున్నారు చాలా నీట్ గా!
గుండె నాళాల్లో బ్లాక్స్ తొలగించే
'బైపాస్ సర్జరీ' నేర్చుకోకుండానే -
రూల్స్ అన్నిటినీ దాటేసి వెళ్ళే
'లైసెన్స్-సర్జరీ'తో సీట్లు కొట్టేశారు చాలా నీట్ గా!

నీరసించిన రోగికి
'సెలైన్ బాటిల్' ఎక్కించడం తెలియదు కానీ -
మెరిట్ విద్యార్థుల రక్తాన్ని మాత్రం 'వైన్ బాటిల్' లా
తాగేస్తున్నారు చాలా నీట్ గా!
చివరకు ...
రోగాలకు 'ట్రీట్ మెంట్'
ఇవ్వడం చేతకాకపోయినా- 'లీకేజీ బ్రోకర్లతో'
అగ్రిమెంట్' మాత్రం రాసుకున్నారు చాలా నీట్ గా!

వైద్యో నారాయణో హరిః అనే 'నినాదాన్ని' మరిచి -
నోట్ల కోట్ల కోసమే 'విధానాన్ని' మార్చేశారు
చాలా నీట్ గా!
స్టెతస్కోప్ తగిలించాల్సిన మెడలో
'సస్పెన్షన్ ఆర్డర్' పడేలా -
న్యాయం దేవత చేతిలో
'ఫైనల్ జడ్జిమెంట్' రాసి ఉంది
ఇంకా చాలా నీట్ గా!

**- సర్వేశ్వరరావు నీలం**
630 4664 725

# హీరోషిమా నాగసాకి విధ్వంసం!!

ప్రపంచంలో జరిగిన అత్యంత ప్రమాదకర మానవ ప్రేరేపిత సంఘటనలలో ముఖ్యమైనవి హిరోషిమా మరియు నాగసాకిలపై అణు బాంబుల దాడి. హిరోషిమా మరియు నాగసాకి జపాన్ లోని నగరాలు.

1945 లో ఆగస్టు 6 వ తేదీన సోమవారం ఉదయం 8.15 నిమిషాలకు రెండవ ప్రపంచ యుద్ధంలో భాగంగా ఎనోలాగే' ఆ-29 బాంబర్ విమానం ద్వారా 'లిటిల్ బాయ్' అనే పేరుతో యురేనియం అణుబాంబు అమెరికా హిరోషిమా పై ప్రయోగించడం వలన ప్రపంచం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. హీరోషిమా జపాన్ లోని పారిశ్రామిక నగరం మరియు అక్కడ సైనిక స్థావరాలు కూడా ఉన్నాయి విస్ఫోటనం వల్ల సుమారు 80 వేల మంది మరణించిన ఆ సంవత్సరం చివరికి వారి సంఖ్య లక్ష 40 వేలకు చేరింది.

1945 ఆగస్టు 9 గురువారం నాడు మధ్యాహ్నం 11 గంటల సమయంలో జపాన్ లోని నాగసాకి మీద 'ఫ్యాట్ మ్యాన్' అనే ప్లూటోనియం అణుబాంబును అమెరికా ప్రయోగించడం వల్ల సుమారు 35,000 మంది చనిపోవడం జరిగింది ఈ సంఖ్య ఆ సంవత్సరం చివరినాటికి 79000 చేరింది.

హిరోషిమాపై అణు విస్ఫోటనంజరిగినప్పుడు మేఘాలు పుట్టగొడుగు మాదిరి ఏర్పడ్డాయి అని బాంబు విస్ఫోటనం జరిగినప్పుడు పెద్ద కాంతి వచ్చిందని తర్వాత భయంకరమైన శబ్దం వినిపించదని ఆ సమయంలో ఉండి బయటపడిన వారు చెప్పిన వివరాలు. బాంబు విస్ఫోటన సమయంలో ప్రాణాలతో బయటపడిన వారిని 'శిబాకుషా' అని అంటారు.

అణువిస్ఫోటనం వలన చాలా మంది చనిపోవడంతో పాటు ఉన్నవాళ్లు శరీరం కాలిపోవడం మరియు శరీరంలో కొన్ని అవయవాలను కోల్పోవడం, రేడియేషన్ ప్రభావం వలన చాలా



మందికి క్యాన్సర్ వంటి వ్యాధులు రావడం జరిగింది. ఆ ప్రాంతంలో గాలి, నీరు, నేల కాలుష్యంతో పాటు పర్యావరణ ప్రమాదాలకు కారణమైంది. బాంబు పడిన చోట దాదాపు 75 సంవత్సరాల వరకు గడ్డి కూడా మొలవలేదంటే దాని తీవ్రత ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. ఏది ఏమైనా యుద్ధాలు అనేవి ప్రపంచ వినాశన కారకాలు ముఖ్యంగా అణు బాంబు దాడులు అనేవి చాలా భయంకరమైనవి, బాధాకరమైనవి. ఏ సమస్యకైనా పరిష్కారం ఉంటుంది అయితే దానికి కావాల్సింది కొంచెం సహనం. ప్రభుత్వాన్ని నడిపే వారికి మామూలు వారితో పోలిస్తే కొంచెం ఎక్కువే కావాలి లేదంటే అధిక వినాశనం తప్పదు అనడానికి ఇది ఒక ప్రత్యక్ష ఉదాహరణ.

ప్రతి సంవత్సరం ఆగస్టు 6 మరియు 9వ తారీకులలో హిరోషిమా మరియు నాగసాకి దినోత్సవం ప్రపంచంలో అన్ని దేశాలు జరుపుకోవడంలో ముఖ్య ఉద్దేశం ప్రపంచంలో ఏ దేశం కూడా ఇకముందు అణుబాంబుని ప్రయోగించకూడదని దాని వల్ల వచ్చే దుష్ఫలితాలు హిరోషిమా, నాగసాకి దుర్ఘటనలు మనకు కళ్ళకు కట్టినట్లు కనిపించాయి కనుక ఏ దేశం ఆ విధంగా ముందుకు పోరాదని చిన్నప్పటి నుంచే పిల్లలకు ఈ విషయాలన్నీ అవగాహన కల్పించడం ఎంతో అవసరం.

అణుబాంబు ప్రయోగం జరిగి దాదాపు 80 సంవత్సరాలు దాటుతున్న అది చేసిన గాయం ఇప్పటికీ మానకుండానే ఉన్నది! శాస్త్రం విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందిన శాస్త్రంతో కనిపెట్టిన కొత్త వస్తువులు లేదా పదార్థాలు మానవాళి మనుగడకు ఉపయోగపడాలి గానీ కనిపెట్టిన మానవ జాతిని సైతం నాశనం చేసే విధంగా ఉండకూడదు! కానీ ఇది చెప్పినంత సులువేమీ కాదు ఎందుకంటే లోకో భిన్న రుచి! ఈ లోకంలోనే ఏ వ్యక్తి ఇంకో వ్యక్తితో సమానంగా ఉండలేడు, ఉండడు కూడా కానీ ఇక్కడ ఉన్న సమస్య ఏమిటంటే ప్రతి వ్యక్తి ఇంకొక వ్యక్తితో పోల్చుకొని అలా లేనప్పుడు దాని సాధించడానికి అవలంబించే వివిధ పద్ధతులు లేదా అడ్డదారులు మనిషిని మానవ మృగంగా మారుస్తున్నాయి!

ప్రపంచంలో దేశాల అధినేతలు ఏ సమస్య అయినా కూర్చుని పరిష్కరించుకోవాలి లేదా మూడో వ్యక్తి సమక్షంలో ఒక పరిష్కారానికి రావాలి తప్పితే యుద్దాల జోలికిపోయి ఆ యుద్ధంలో అణుబాంబుల ప్రయోగం చేసి ఈ భూ మండలాన్ని నాశనం చేయడం సరైనది కాదు. కనుక అందరూ శాంతియుతంగా ఉండాలి. అలా అయితేనే ప్రపంచ శాంతి వర్ధిల్లుతుంది.

**- ఏడుకొండలు కళ్ళేపల్లి**
9490832338

# భారత జల విధానం మారాలి



1967 ఆగస్టు 4న జాతికి అంకితమైన నాగార్జునసాగర్ ప్రాజెక్టు 2026 ఆగస్టు 4తో 60వ సంవత్సరంలోకి అడుగుపెట్టింది. ఇది ఒక ఆనకట్ట వార్షికోత్సవం మాత్రమే కాదు. స్వాతంత్ర్యానంతర భారతదేశ జల విధానాన్ని సమీక్షించుకోవడానికి, జల భద్రతను పునర్నిర్వచించుకోవడానికి ఒక సందర్భం. ఆరు దశాబ్దాల క్రితం దేశం ఎదుర్కొన్న సమస్యలకు నాగార్జునసాగర్ సమాధానమైతే, నేడు దేశం ఎదుర్కొంటున్న కొత్త జల సంక్షోభాలకు అదే ప్రాజెక్టు కొత్త పాఠాలు నేర్పుతోంది.

స్వాతంత్ర్యం వచ్చినప్పుడు భారతదేశానికి ప్రధాన సవాలు ఆహార కొరత. వ్యవసాయం పూర్తిగా వర్షాలపై ఆధారపడేది. కృష్ణా వంటి మహానది ప్రవహిస్తున్నప్పటికీ, దాని నీటిలో పెద్ద భాగం వినియోగం కాకుండానే సముద్రంలో కలిసిపోయేది. అందుకే అప్పటి నాయకత్వం పెద్ద జలాశయాలు, సాగునీటి ప్రాజెక్టులను అభివృద్ధి వ్యూహానికి కేంద్రంగా పెట్టింది. నాగార్జునసాగర్ కూడా అదే ఆలోచనకు ప్రతిరూపం. ఇది కేవలం ఒక ఆనకట్ట కాదు. సాగునీరు, జలవిద్యుత్, తాగునీరు, ప్రాంతీయ అభివృద్ధిని ఒకే వేదికపైకి తీసుకొచ్చిన సమగ్ర అభివృద్ధి నమూనా.

ఆ దృష్టిలో చూస్తే నాగార్జునసాగర్ తన చారిత్రక బాధ్యతను విజయవంతంగా నిర్వర్తించింది. సాగునీటి విస్తరణతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వ్యవసాయం అభివృద్ధి చెందింది. హరిత విప్లవానికి అవసరమైన నమ్మ కమైన నీటి వనరు లభించింది. జలవిద్యుత్ ఉత్పత్తి పెరిగింది. అనేక పట్టణాలు, గ్రామాలకు తాగునీరు అందింది. ఒకప్పుడు కరువుకు ప్రతీకగా ఉన్న ప్రాంతాలు దేశ ఆహార భద్రతలో కీలక పాత్ర పోషించే స్థాయికి చేరుకున్నాయి.

అయితే నేడు దేశం ఎదుర్కొంటున్న సమస్య 1950ల



సమస్య కాదు. అప్పట్లో సవాలు ఆహార కొరత అయితే, ఇప్పుడు సవాలు నీటి కొరత. జనాభా మూడు రెట్లకు పైగా పెరిగింది. పట్టణీకరణ, పారిశ్రామికీకరణ వేగవంతమయ్యాయి. వ్యవసాయం ఇప్పటికీ దేశంలోని తీపి నీటి వినియోగంలో దాదాపు 80 శాతం వాటాను వినియోగిస్తోంది. నీతి ఆయోగ్ అంచనా ప్రకారం దాదాపు 60 కోట్ల మంది భారతీయులు తీవ్రమైన నీటి ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. అందువల్ల ఇప్పుడు జల విధానం లక్ష్యం మరిన్ని జలాశయాలు నిర్మించడం మాత్రమే కాకుండా, ఇప్పటికే నిల్వ చేసిన ప్రతి నీటి బొట్టును మరింత సమర్థంగా వినియోగించడం కావాలి. ఈ నేపథ్యంలో వాతావరణ మార్పు నాగార్జునసాగర్ వంటి ప్రాజెక్టుల పాత్రను మరింత క్లిష్టం చేసింది. ఒకవైపు దీర్ఘకాలం వర్షాభావం, మరోవైపు కొద్ది సమయంలోనే కురిసే భారీ వర్షాలు-ఈ రెండింటినీ ఒకే జలాశయం సమర్థంగా నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పూడిక పేరుకుపోవడం వల్ల నిల్వ సామర్థ్యం క్రమంగా తగ్గుతోంది. పాత కాలువల ద్వారా గణనీయమైన నీటి నష్టం జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో దశాబ్దాల క్రితం రూపొందించిన నిర్వహణ విధానాలు సరిపోవు. వాతావరణ అంచనాలు, రియల్టైమ్ జల సమాచారం, శాస్త్రీయ జలాశయ నిర్వహణ ఇప్పుడు అత్యవసరంగా మారాయి.

నాగార్జునసాగర్ మరో ముఖ్యమైన పాఠాన్ని కూడా నేర్పుతోంది. కృష్ణా జలాల పంపిణీపై రాష్ట్రాల మధ్య కొనసాగుతున్న వివాదాలు, వ్యవసాయం-పట్టణాలు-పరిశ్రమల మధ్య పెరుగుతున్న పోటీ, భూగర్భ జలాలపై అధిక ఆధారపడటం వంటి అంశాలు నీటి నిర్వహణను మరింత సంక్లిష్టం చేస్తున్నాయి. పారదర్శక సమాచారం, శాస్త్రీయ నిర్ణయాలు, సహకార సమాఖ్య స్ఫూర్తితో కూడిన నదీ పరీవాహక ప్రాంత నిర్వహణ లేకుండా భవిష్యత్తులో ఈ వివాదాలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది.

దీని అర్థం భారీ ఆనకట్టల ప్రాధాన్యం తగ్గిందని కాదు. వాటి పాత్ర మారిందన్న మాట. మొదటి తరం ప్రాజెక్టులు దేశానికి నీటి భద్రతను తీసుకొచ్చాయి. రెండో తరం సంస్కరణలు నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచాలి. కాలువల ఆధునీకరణ, సూక్ష్మ సేద్యం, భూగర్భ జలాల పునరుద్ధరణ, పంటల వైవిధ్యీకరణ, ఉపగ్రహ ఆధారిత జలాశయ పర్యవేక్షణ, కృత్రిమ మేధ ఆధారిత జలాశయ నిర్వహణ, డిజిటల్ జల గణాంక వ్యవస్థలు ఇప్పుడు జల విధానంలో అంతర్భాగం కావాలి.

నాగార్జునసాగర్ 60వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన ఈ సమయంలో దాని వారసత్వాన్ని కేవలం నిల్వ సామర్థ్యంతోనో, ఉత్పత్తి చేసిన విద్యుత్తోనో, సాగునీరు అందించిన ఎకరాలతోనో కొలవడం సరిపోదు. భారతదేశం మొదటి సవాలు ఆనకట్టలను నిర్మించడం అయితే, నేటి సవాలు వాటిని మరింత సమర్థంగా నిర్వహించడం. నీటి కొరత, వాతావరణ మార్పు, పెరుగుతున్న అవసరాల మధ్య భారత జల భద్రత భవిష్యత్తు కొత్త ప్రాజెక్టుల నిర్మాణంపై కాదు. ఇప్పటికే ఉన్న నాగార్జునసాగర్ వంటి జాతీయ ఆస్తులను శాస్త్రీయంగా, సాంకేతికంగా, సహకార సమాఖ్య స్ఫూర్తితో ఎంత సమర్థంగా నిర్వహిస్తామన్న దానిపైనే ఆధారపడి ఉంటుంది. అదే నాగార్జునసాగర్ 60 ఏళ్ల ప్రయాణం మనకు నేర్పుతున్న అత్యంత విలువైన పాఠం.

**- డి జె మోహన రావు**
8247045230

# సామాజిక జీవితాన్ని అక్షరబద్ధం చేసిన యశోదారెడ్డి

ఆమె తెలంగాణ గర్వించ దగిన సాహితీ మూర్తి. తెలంగాణ సజీవ భాషను తన రచనల్లో వాడి పలువురి మన్ననలు పొందిన సాహితీవేత్త. ఆకాశవాణిలో తెలంగాణ మాండలికంలో ప్రసంగం చేసిన తొలి రచయితగా పేరు గడించారు. తెలుగు ప్రాచీన సాహిత్యంపై ఆమె చేసిన ప్రసంగాలు బహు పండిత ప్రశంసా పాత్రాలు అయినాయి. ఆమే ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షురాలుగా పని చేసి గుర్తింపు పొందిన పాకాల యశోదారెడ్డి.

పాకాల యశోదారెడ్డి సంస్క ృతాంధ్ర భాషల్లో విదుషీ మణి, పరిశోధకురాలు, సాహిత్య విమర్శకురాలు. వచన కవిత్వం కూడా వ్రాసారు. . ఆమె వేదికలమీద అనర్గళంగా ఉపన్యసించి మంచి వక్తగా పేరు తెచ్చుకున్నారు. ఆమె వాగ్ధాటికి శ్రోతలు తన్మయులయ్యే వారు. అచ్చమైన తెలుగు, సుదీర్ఘమైన సంస్కృత సమాసాలతో కూడిన ప్రసంగాలు విన ఇంపుగా ఉండేది. 1950 దశకారంభం నుంచే ఆమె ఆలిండియా రేడియోలో 'మహాలక్ష్మి ముచ్చట్లు' అని వినిపించేది.

యశోదా రెడ్డి ప్రముఖ రచయిత్రి. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో ఆచార్యులుగా పనిచేసి, పదవీ విరమణ చేశారు. పలు సాహిత్య విమర్శనా గ్రంథాలు రాశారు. కథా సంపుటాలను వెలువరించారు. పాకాల యశోదారెడ్డి 1929, ఆగష్టు 8 న పాలమూరు జిల్లా ( నాగర్‌కర్నూల్ జిల్లా), బిజినేపల్లిలో సరస్వతమ్మ, కాశిరెడ్డి దంపతులకు ఆమె జన్మించారు. యశోదారెడ్డి మూడవ తరగతి వరకు మహబూబ్‌నగర్‌లో, ఉన్నత పాఠశాల విద్యను హైదరాబాద్, నారాయణగూడ లోని బాలికల ఉన్నత పాఠశాలలోను పూర్తి చేశారు. రాజబహద్దూర్ వెంకట్రామిరెడ్డి ప్రోత్సాహంతో కళాశాల విద్య కొనసాగించి, ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి తెలుగు, సంస్కృత భాషలలో స్నాతకోత్తర విద్య పూర్తి చేశారు. జర్మన్ భాషలో, భాష శాస్త్రంలో డిప్లొమా చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం లోనే 'తెలుగులో హరివంశాలు' అను అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా పొందారు. 1976లో అలీఘర్ విశ్వ విద్యాలయం నుండి డి.లిట్ అందుకున్నారు. యశోదారెడ్డికి హిందీ, ఉర్దూ, కన్నడ భాషల్లో ప్రావీణ్యంతో పాటు, జర్మన్ భాషతో కూడా పరిచయం ఉండేది. ఆమె భర్త ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారుడు పి. టి. రెడ్డిగా సుపరిచితులైన పాకాల తిరుమల్ రెడ్డి. జె.జె.ఆర్ట్ కళాశాలలో చదువుకుని, కొన్నాళ్ళు లాహోర్‌లో పనిచేసి హైదరాబాదు తిరిగి వచ్చిన తిరుమల రెడ్డి, ఆమె వక్తృత్వ ప్రతిభను చూసి ఆకర్షితుడై 1947లో ప్రేమ వివాహం చేసుకున్నారు. తిరుమల్ రెడ్డి గీసిన అనేక చిత్రాలకు ఆమే స్ఫూర్తి. యశోదారెడ్డి కూడా స్వతహాగా కళాపిపాసి. ఆమె రకరకాల ఇత్తడి విగ్రహాలను హాబీగా సేకరించే వారు. పి.టి రెడ్డి సాంగత్యంతో వాటిలోని కళానైపుణ్యాన్ని, వైభవాన్ని ఆమె గుర్తించ గలిగేవారు. భర్త చిత్రకళా ప్రదర్శన ఏర్పాటు చేసినపుడు ఒక కార్యకర్తగా పని చేసి అది విజయవంతం అయ్యేందుకు దోహదపడేది.

1955లో హైదరాబాద్, కోఠి మహిళా కళాశాలలో అధ్యాపకురాలిగా ఉద్యోగ జీవితం ప్రాంభించారు. ఎందరో పరిశోధకులకు మార్గదర్శిగా నిలిచారు. ఆమె ధర్మశాల, ఎచ్చమ్మ కథలు తదితర కథా సంపుటాలను వెలువరించారు. యశోదా రెడ్డి వందకు పైగా కథలు వ్రాసినా వాటిలో 63 మాత్రమే పుస్తక రూపంలో రావడం జరిగింది. ఆమె ప్రచురించిన మూడు కథా సంపుటాల్లో, మావూరి ముచ్చట్లు (1973) కథా సంపుటి 1920-40 నాటి తెలంగాణ గ్రామీణ జీవన విధానాన్ని చిత్రీకరిస్తే, ఎచ్చమ్మ కథలు (1999) 1950-70 నాటి తెలంగాణ సంస్క ృతికి ప్రతీకలు, ధర్మశాల (2000) కథా సంపుటి 1980-1990 నాటికి తెలంగాణ సమాజంలో వచ్చిన మార్పులకు దర్పణం పట్టింది. ఈ మూడు కథా సంపుటాల్లో ఈమె తెలంగాణ భాషను, యాసను, సంస్కృతిని, సామాజిక జీవితాన్నిఅక్షర బద్ధం చేశారు. మావూరి ముచ్చట్లు, ఎచ్చమ్మ కథలు, పాలమూరు జిల్లా మాండలికంలో వ్రాస్తే, ధర్మశాల కథా సంపుటిని మాత్రం వ్యవహారిక తెలుగు భాషలో లిఖించారు.

యశోదారెడ్డి కథలు తెలంగాణ జనజీవన సంస్కృతినుు, తెలంగాణా మాండలిక నుడికారానికి అద్దం పడతాయి. ఎచ్చమ కథలకు ముందుమాటలో 'ఒక జాతి సంస్కృతిలో ఆ జాతి జీవన విధానం ప్రతిఫలిస్తుంది. ఈ సంస్కృతీ సర్వస్వం ఆ జాతి భాషలో నిక్షిప్తమై జీవిస్తుంది. ఆ భాష ఆ జాతికి ప్రత్యేకమైన ఆచార వ్యవహార, ఆర్థిక, రాజకీయ, సామాజిక మూలధాతువులను జీర్ణించుకొని రససిద్ధిని పొంది జాతీయాల్లో, పలుకుబళ్లలో, సామెతల్లో పొందుపడి ప్రభుత్వాన్ని నెరుపుతుంది. ఒక భాషలో ఒక నానుడి కానీ, సామెత కానీ, జాతీయం కానీ అలవోకగా పుట్టదు. ఆయా జాతీయులు, తలలు పండినవారి అనుభవాన్ని వీడబోసి నిగ్గుదేల్చిన సారమే ఈ నుడికారపు ఇంపుసొంపులు. అందుకే అవి భాషకు జీవనాడి. ప్రాణధాతువుల వంటివి' అని అభిప్రాయడిన యశోదారెడ్డి తన కథల నిండా తెలంగాణ నుడికారపు సొంపులకు పెద్దపీట వేశారు.

యశోదారెడ్డి కథారచయిత్రిగానే కాకుండా కవయిత్రిగా కూడా ప్రసిద్ధులే. ఆమె రాసిన కవితలు అనేక పత్రికలలో ముద్రించబడ్డాయి. స్వయంగా తానే తన కవితలను 'ఉగాదికి ఉయ్యాల', 'భావిక' అనే రెండు సంపుటాలుగా వెలువరించారు. పారిజాతాపహరణం, ఉత్తర హరివంశం, తెలుగు సామెతలు, ఆంధ్ర క్రియా స్వరూపమణి దీపిక మొదలగు పుస్తకాలకు సంపాదకత్వం వహించి, విలువైన పీఠికలను రాసి, వెలువరించారు. ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ, లలిత కళా అకాడమీ, సంగీత అకాడమీలలో సభ్యురాలిగా



పని చేశారు. ఆంధ్ర సారస్వత పరిషత్, జానపద కళా సాహిత్య సంస్థలతో ఆమెకు అనుబంధం ఉండేది. బహుముఖ ప్రజ్ఞావంతురాలైన యశోదారెడ్డి, పరిశోధకురాలిగా, విమర్శకురాలిగా, కథా రచయిత్రిగా, నాటక రచయిత్రిగా, కవయిత్రిగా అనువాదకురాలిగా తెలుగు సాహితీరంగంలో ప్రసిద్ధి పొందారు. మహావక్తగా, తెలంగాణ మాండలికానికి అచ్చమైన ప్రతీక. సంస్కృత సమాస భూయిష్ఠమైన సంప్రదాయ విమర్శలోనూ, సహజ సుందరమైన జానపదుల నుడికారంలోనూ రచనలను చేసిన సవ్యసాచి. యశోదారెడ్డి 2007, అక్టోబర్ 7 న హైదరాబాదులో మరణించారు.

**ఆగస్టు 8 పాకాల యశోదారెడ్డి జయంతి**

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# నేతన్న చేనేతకు సలాం



మానవుడి కనీస అవసరాలు కూడు, గూడు, గుడ్డ అని మనకు తెలుసు. వ్యవసాయం తర్వాత అతి పెద్ద పరిశ్రమగా చేనేత హస్తకళలకు గుర్తింపు ఉన్నది. పుట్టిన నాటి నుండి గిట్టే వరకు మన శరీరం మీద వస్త్రాలు తప్పనిసరి. మనం ధరించే వస్త్రాలు మన మానసిక, శారీరక, ఆర్థిక, సామాజిక, వ్యక్తిత్వ గుణాల స్థాయిని రుజువు చేస్తాయి. పంచె కట్టులో పురుషులు, చీర కట్టులో స్త్రీలు అందంగా, హుందాగా, ఆకర్షణీయంగా, సాంప్రదాయం ఉట్టిపడే విధంగా కనుపిస్తారు. నేతన్న చేతుల్లో మాయాజాలం ఫలితంగా సప్తవర్ణ సింగిడి రంగులు వస్త్రాలకు అందాల విందులు ఆరబోస్తాయి. నేతన్న సృజన, దారం పోగును నాట్యం చేయించగల హస్తకళా నైపుణ్యం సదా అభినందనీయం. నాటి చేనేత వస్త్రాల నుంచి నేటి ఆధునిక సాంకేతిక యంత్రాల వినియోగం వరకు వస్త్ర పరిశ్రమ ఊహించనంతగా అభివృద్ధి చెందడం చూస్తున్నాం. అనాదిగా గ్రామీణ ప్రజానీకానికి జీవనో పాధిని కల్పిస్తున్నది. ఒక దారపు పోగు భారతీయ సాంస్కృతిక వారసత్వ సంపదకు నిదర్శనంగా నిలుస్తున్నది. దేశ సామాజిక-ఆర్థిక సుస్థిరాభివృద్ధికి చేనేత పరిశ్రమ ఊతం ఇస్తున్నది. స్వతంత్ర భారతంలో చేనేత హస్తకళల ప్రాధాన్యా న్ని అవగాహన పర్చడం, నేతన్నల సమస్యలకు పరిష్కారాలను వెతకడం, మన చేనేతకు అంతర్జాత గుర్తింపుకు ప్రయత్నాలు చేయడం లాంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని 2015 నుంచి భారత కేంద్ర ప్రభుత్వం చొరవతో ప్రతి ఏట 7 ఆగష్టున జాతీయ చేనేత దినోత్సవం (నేషనల్ హాండ్లూమ్ డే) పాటించడం జరుగుతున్నది. 7 ఆగష్టు 1905న బెంగాల్ విభజనను చేసిన బ్రిటీష్ నిర్ణయానికి వ్యతిరేకంగా కలకత్తాలో మొదలైన స్వదేశీ ఉద్యమం ప్రారం భానికి గుర్తుగా చేనేత దినోత్సవం నిర్వహించు కోవడం ముదావహం. నేడు మన చేనేత హస్తకళల పరిశ్రమతో పాటు దాని అనుబంధ రంగాల్లో దాదాపు 70 శాతం మంది మహిళలు శ్రమ చేయడం జరుగుతున్నది. భారత చేనేత పరిశ్రమపై 32 లక్షల కుటుంబాలు ఆధారపడడంతో పాటు 4.33 మిలియన్ల ఉద్యోగ ఉపాధులు కల్పించడం కొనసాగుతున్నది. నేతన్నల ఆదాయాన్ని మెరుగు పరచడంతో పాటు వారిని శక్తివంతులుగా మార్చ డానికి చేనేత ఉపయోగపడు తున్నది.

దేశవ్యాప్తంగా జాతీయ చేనేత దినోత్సవ వేడుకల నిర్వహణ జరుగుతుంది. ఆంధ్రలో 98, తెలంగాణలో 34 క్లస్టర్లు ఉన్నాయి. ప్రపంచ వస్త్ర పరిశ్రమ ఉత్పత్తుల్లో 6.9 శాతం భారతదేశమా ఉత్పత్తి చేస్తున్నది. చైనా మాత్రం 52 శాతానికి



పైగా సడవస్త్ర మార్కెట్ను కైవసం చేసుకున్నది. చేనేత వస్త్రాల ఉత్పత్తుల్లో 95 శాతం భారతదేశమా అందిస్తున్నది. మన దేశ ఆచారాలు, వారసత్వాలను బట్టి నేతన్న చూపిస్తున్న హస్తకళా నైపుణ్యాల ప్రదర్శన వల్ల చేనేత వస్త్రాలకు ఆదరణ పెరుగుతోంది. నేతన్న కళ్లల్లో సంతోషం వర్షించాలంటే ఆయా కుటుంబాలు ఆర్థికంగా బలపడాలి. నాటి చేనేత పరిశ్రమ తక్కువ పెట్టుబడి, స్వల్ప శక్తి వినియోగం ఉండేది. డిజిటల్ కాలంతో పాటు ఈ రంగంలో వస్తున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా తమ డిజైన్లను మార్చడం లాంటివి సానుకూల అంశాలుగా కనిపించేవి.

**- డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# పావలా వడ్డీ బంద్ చేసినోళ్లకు..
# మేం సున్నా వడ్డీ ఇస్తున్నాం



- మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతాం
- ఇందిరమ్మ క్యాంటీన్లు, ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులతో మహిళల అభివృద్ధి
- చిగురుమామిడిలో రూ.66 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం
- ఉపాధి, సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట
- రుణమాఫీ.. మహిళలకు అండ
- రాష్ట్ర రవాణా, బీ.సి.సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**చిగురుమామిడి,ఆగస్టు 7,(మనం న్యూస్):** గత పదేళ్ల పాలనలో మహిళా సంఘాలకు కనీసం పావలా పైసలు కూడా ఇవ్వనివారు ఈ రోజు మాటలు చెబుతున్నారు. కానీ, మా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సున్నా వడ్డీ రుణాలను పునరుద్ధరించి మహిళలకు కొండంత అండగా నిలుస్తోందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. శుక్రవారం చిగురుమామిడి మండలంలో రూ.66 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు కలెక్టర్ చిత్రా మిశ్రాతో కలిసి ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా బొమ్మనపల్లి గ్రామంలో రూ.30 లక్షలతో నిర్మించనున్న వెటర్నరీ సబ్ సెంటర్కు, రూ.16 లక్షలతో నిర్మించనున్న వీవో మహిళా సమాఖ్య భవనానికి భూమిపూజ చేశారు. అనంతరం మండల కేంద్రంలో రూ.20 లక్షల వ్యయంతో ప్రైమరీ వెటర్నరీ సెంటర్ అదనపు గదుల నిర్మాణం, మరమ్మతు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. గత పదేళ్ల పాలనలో మహిళా సంఘాలకు సున్నా వడ్డీ రుణాలు నిలిచిపోయాయని, తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వడ్డీ లేని రుణాలను మంజూరు చేస్తూ ఆదుకుంటున్నామని స్పష్టం చేశారు. ఇందిరమ్మ క్యాంటీన్లు, సోలార్ ప్రాజెక్టులు, ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం, పెట్రోల్ బంకుల నిర్వహణ వంటి అనేక పథకాల ద్వారా మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో వీవో భవనం, మండల కేంద్రంలో మహిళా సమాఖ్య భవనం ఏర్పాటు చేస్తామన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలో ఏళ్లుగా పెండింగ్లో ఉన్న అంతర్గత రహదారులు, వంతెనల నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.33 కోట్లు మంజూరు చేశారని, అందులో భాగమే 29 బ్రిడ్జిల నిర్మాణమని తెలిపారు. ఇందుర్తి - ములకనూరు వంతెనతో పాటు మిగిలిన రెండు బ్రిడ్జిల పనులను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. కరీంనగర్ రహదారిని ఫోర్ లైన్ రోడ్డుగా విస్తరిస్తున్నామని పేర్కొన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు కాలువల భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేశామని, రాజకీయాభిప్రాయాలకు అతీతంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, బొమ్మనపల్లి గ్రామసర్పంచ్ కొంకట మౌనిక, చిగురుమామిడి సర్పంచ్ , స్థానిక ఆకారం భవాని శివప్రసాద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గీకురు రవీందర్, చిట్టు మల్ల రవీందర్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు, పెద్ద సంఖ్యలో గ్రామీణులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత

**జగిత్యాల, ఆగష్టు 7 (మనం న్యూస్):** జగిత్యాల పట్టణంలోని పురానిపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం తరగతి గదులు, తాగునీరు, పారిశుధ్యం, వంటశాల, భోజనశాల తదితర సౌకర్యాలను పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులతో మమేకమై వారి విద్యాభ్యాసం, బోధన విధానాలపై ఆరా తీశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని విద్యారంగంలో ప్రతిభ కనబరచాలని సూచించారు. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుని కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకోవచ్చని తెలిపారు. భవిష్యత్తు లక్ష్యాలను సాధించేందుకు నిరంతరం నేర్చుకునే తపనతో ముందుకు సాగాలని విద్యార్థులను ప్రోత్సహించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంబంధిత రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## జగిత్యాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరుణ యాగం



**జగిత్యాల ఆగస్టు 07 (మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న వర్షాభావ పరిస్థితుల నుండి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని జగిత్యాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జగిత్యాల సమీపంలోని చిన్నగట్టు ఆంజనేయ స్వామి దేవాలయంలో వరుణ యాగం నిర్వహించారు. ఈ సందర్భంగా వరుణ యాగానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపల్ జిల్లా జడ్జి రత్న పద్మావతి మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండి తెలంగాణ ప్రాంత వాసులు సస్యశ్యామలంగా వర్ధిల్లాలని దేవదేవుని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి సునీత రవీందర్ రెడ్డి ప్రిన్సిపల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ లావణ్య రెండవ అదనపు జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ శ్రీమతి నికిషా పాల్గొన్నారు.బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎర్ర నర్సయ్య లక్ష్మీ దంపతులు మరియు ఉపాధ్యక్షులు మర్రిపల్లి సత్య ప్రకాష్, న్యాయవాదులు రాచకొండ శ్రీరాములు, ముదిగంటి జనార్ధన్, రాచకొండ శ్రీరాములు, శ్రీపాల్ రెడ్డి, సంత కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి




- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్ లత

**జగిత్యాల , ఆగస్టు 07 (మనం న్యూస్):** జిల్లాలో ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్ లత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో ఆగస్టు 15న నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సమన్వయ సమావేశంలో ఏర్పాట్ల పై శాఖల వారీగా సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్ లత మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహణ ఏర్పాట్ల పై ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను నిర్దేశిత గడువులో పూర్తి చేసి ఎలాంటి లోపాలకు తావులేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి శాఖ తమ విభాగం అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల ఫలితాలు ప్రతిబింబించేలా శకటాలు, ప్రదర్శనలు రూపొందించాలని తెలిపారు. అలాగే ఉత్తమ ప్రదర్శనలు, వినూత్న శకటాలు, ఆకర్షణీయమైన స్టాల్స్ ద్వారా ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల కు సమర్థవంతంగా తెలియజేసేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వేడుకల నిర్వహణలో పాల్గొనే ప్రతి శాఖ అధికారి తమ బాధ్యతలను పూర్తి నిబద్ధతతో నిర్వర్తించి స్వాతంత్ర్య దినోత్సవాన్ని జిల్లాకు ఆదర్శంగా నిలిచేలా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

- అర్హులైన వారికే తహసీల్దార్లు ధ్రువపత్రాలు జారీ చేయాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల, ఆగస్టు -07(మనం ప్రతినిధి ):** ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల స్థాయిలో ప్రభుత్వ పని దినాల్లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమంపై ప్రజలందరికీ తెలిసేలా క్షేత్ర స్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహణ, జలాశయాలు, చెరువుల పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయడం, చేయూత పెన్షన్లకు దరఖాస్తుల కోసం అవసరమైన ధ్రువపత్రాలు అర్హులైన వారికే జారీ చేయడం, వరదలు సంభవిస్తే చేపట్టాల్సిన అప్రమత్తతా చర్యలు, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీఓలతో శుక్రవారం సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం ద్వారా క్షేత్ర స్థాయిలో ప్రజల సమస్యలు తక్షణమే పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమానికి ఎంపీడీఓలు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారని, మండల స్థాయిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ శాఖలకు సంబంధించిన మండల స్థాయి అధికారులందరూ హాజరయ్యేలా ఆదేశాలు జారీ చేయాలని సూచించారు. ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను స్వీకరించి, వాటిని జాప్యం చేయకుండా పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఉన్న జలాశయాల, అన్ని చెరువులు, కుంటలు, వాగుల పరిస్థితులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ ఉండాలని నీటి పారుదల శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వర్షాల ద్వారా వరదలు వచ్చే అవకాశం ఉంటే ముందే ప్రజలను అప్రమత్తం చేయాలని, ఎలాంటి ప్రమాదాలు, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సంబంధిత విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు.

ప్రజలను అప్రమత్తం చేయడం ద్వారా ప్రమాదాలు సంభవించకుండా కట్టడి చేయవచ్చని సూచించారు. లో లెవెల్ కల్వర్టుల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. రిజర్వాయర్లు పూర్తి స్థాయిలో మత్తడి పారడం, నీటి విడుదల పరిస్థితులు ఉంటే సమీప గ్రామాల ప్రజలు, రైతులు, గొర్రెలు, మేకల, పశువులు కాపర్లు అటువైపు వెళ్లకుండా చూడాలని, రాకపోకలను నియంత్రించాలని రెవెన్యూ, పోలీస్, నీటి పారుదల శాఖ అధికారులు సమన్వయంతో సేవలు అందించాలని సూచించారు. రిజర్వాయర్లు పూర్తిస్థాయిలో నిండితే ప్రజలను అనుమతించవద్దని స్పష్టం చేశారు. పురోగతిలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేయడంలో వేగం పెంచాలని, నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా ఇండ్లు పూర్తి చేయడంపై దృష్టి పెట్టాలని ఎంపీడీఓ లను కలెక్టర్ ఆదేశించారు. లబ్ధిదారులు నిర్మాణాల పురోగతిలో వేగం పెంచేలా అవగాహన కల్పించాలని అన్నారు. చేయూత పెన్షన్ల మంజూరుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో అర్హులకు ఆదాయ, నివాస, కుల, ఇతర ధృవీకరణ పత్రాల మంజూరు ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సంబంధిత మండలాల తహసీల్దార్లు అందరూ ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించాలని, అర్హులైన వారికి మాత్రమే ధృవీకరణ పత్రాలు జారీ చేయాలని, పత్రాల మంజూరులో జాప్యం చేయవద్దని ఆదేశించారు. అలాగే యూడీఐడీ కార్డుల జారీ ప్రక్రియకు సంబంధించి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన వారికి పారదర్శకంగా కార్డులు జారీ చేయాలని సూచించారు. సమీక్షలో డీఆర్ఓ జయశ్రీ, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓ లు శ్రీధర్ బాబు, కేఎస్ బీ కుమారి, సంబంధిత ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓ లు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పనికి గడువు విధించి.. నిర్మాణాలు చేయాలి

- రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల్లో మరింత వేగం పెంచాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల, ఆగస్టు -07(మనం ప్రతినిధి ):** శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల్లో భాగంగా ప్రతి దానికి గడువు విధించి.. నిర్మాణాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్ మెంట్ అథారిటీ (వీటీఏడీఏ) పనులపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం దేవాదాయ శాఖ, మున్సిపల్, ఆర్ అండ్ బీ, ఎన్పీడీసీఎల్, నీటి పారుదల శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. శ్రీ రాజరాజేశ్వర దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనులను అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్మికుల సంఖ్యను మరింత పెంచి.. పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. రాజరాజేశ్వర ఆలయానికి చెందిన నూతన గోశాల పనులపురోగతిపై అడిగి తెలుసుకొని, అధికారులకు పలు సూచనలు చేశారు. గుడిచెరువు అభివృద్ధి, సుందరీకరణ పనుల్లో మిగతా వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. టాయిలెట్ల నిర్మాణం, నిర్వహణ తదితర అంశాలపై పర్యాటక శాఖ, వేములవాడ మున్సిపల్ శాఖ అధికారులకు సూచనలు చేశారు. బద్దిపోచమ్మ ఆలయ విస్తరణ పనులను ప్రణాళిక ప్రకారం వేగవంతంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్రధాన ఆలయం నుంచి తిప్పాపూర్ బ్రిడ్జి వరకు చేపడుతున్న 80 ఫీట్ల రహదారి విస్తరణ పనుల పురోగతిపై ఆరా తీశారు. రహదారి నిర్మాణం, ఇరువైపులా మురుగు కాలువ నిర్మాణ తుది దశ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యుత్ టవర్ల నిర్మాణ పనులను త్వరితగతిన మొదలు పెట్టాలని సూచించారు. జిల్లా వైద్య కళాశాల, బాలుర, బాలికల హాస్టళ్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. తుది దశ పనులను వేగంగా పూర్తి చేయించాలని సూచించారు. విద్యార్థులకు వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. అలాగే సిరిసిల్లలో కోర్టు సముదాయ పనులు షెడ్యూల్ ప్రకారం చేయాలని అధికారులను సూచించారు. సమావేశంలో ఆర్ అండ్ బీ ఈఈ భీమ్లానాయక్, ఆలయ ఈఈ రాజేష్, ఎన్పీడీసీఎల్ ఈఈ వేణుమాధవ్, మున్సిపల్ కమిషనర్ లోకేష్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, వీటీఏడీఏ తదితరులు ఉన్నారు.

## ఎల్నినో ప్రభావంతో
## నీటి సంక్షోభం తీవ్రం కానుంది



- వరిసాగు మానుకుని ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోండి
- జిల్లాకలెక్టర్ సత్య ప్రసాద్

**జగిత్యాల, ఆగస్టు 7(మనం ప్రతినిధి):** ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో ఎల్నినో ప్రభావం మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉందని వాతావరణ అంచనాలు సూచిస్తున్నాయి. ఈ పరిస్థితుల కారణంగా వర్షపాతం తగ్గడంతో పాటు వర్షాల మధ్య సుదీర్ఘ విరామాలు ఏర్పడి, చెరువుల్లో నీటి నిల్వలు మరియు భూగర్భ జలాల మట్టాలు గణనీయంగా తగ్గిపోయే అవకాశం ఉంది. జిల్లాలోని మొత్తం1,010 చెరువులలో కేవలం 268 చెరువులు మాత్రమే ప్రస్తుతం నిండి ఉన్నాయని, ప్రస్తుతం ఉన్ననీటి నిల్వలు కూడా మొత్తం సాగు అవసరాలను తీర్చేందుకు సరిపోవని అంచనా. అదే విధంగా, గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో భూగర్భ జలాల మట్టం ఇప్పటికే సగటున 1.12 మీటర్లు తగ్గిందని తెలిపారు . ఆగస్టు, సెప్టెంబర్నెలల్లో ఎల్నినో ప్రభావంతో వర్షపాతం మరింత తగ్గితే భూగర్భజలాల మట్టాలు ఇంకా దిగజారే అవకాశం ఉంది. అదేవిధంగా, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఖిఖఖ్క)లో అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడే అవకాశం ఉన్నందున, వరిసాగుకు నీటి సరఫరాపై పూర్తిస్థాయిలో ఆధారపడే పరిస్థితి లేదు. ఈనేపథ్యంలో రైతులు ప్రస్తుతం లేదా ఇకపై కొత్తగా వరినాట్లు వేయడం, వరి సాగువిస్తీర్ణాన్నిపెంచడం పూర్తిగా నివారించాలని రైతులకు సూచించారు. అందువల్ల రైతులు వ్యవసాయశాఖ సూచించిన తక్కువ నీటి అవసరం కలిగిన ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని కోరారు. ముఖ్యంగా కందులు, పెసర, మినుములు, ఆముదం, జొన్న, సజ్జలు, మొక్కజొన్న (తగిన తేమ ఉన్నప్రాంతాల్లో మాత్రమే)ఇతర తక్కువ నీటి అవసరం కలిగిన పంటలను ఎంచుకోవా లనిసూచించారు. ప్రత్యామ్నాయ పంటల ఎంపిక, విత్తనాల లభ్యత మరియు సాంకేతిక సూచనల కోసం రైతులు తమ పరిధిలోని వ్యవసాయ అధికారులను సంప్రదించగలరని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు.

## 89.56 శాతం సర్ ప్రక్రియ పూర్తి



- ఓటరు జాబితా నుంచి తొలగించే ప్రతి పేరును రాజకీయ పార్టీల బీ.ఎల్.ఏ.లు పరిశీలించాలి
- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**జగిత్యాల ప్రతినిధి, ఆగస్టు 07( మనం న్యూస్ ):** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఓటరు జాబితా నుంచి తొలగించే ప్రతి పేరును రాజకీయ పార్టీల బీ.ఎల్.ఏ.లు పరిశీలించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సూచించారు. శుక్రవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన ఎస్ఐఆర్ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొని పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో మొత్తం 7,21,032 మంది ఓటర్లలో ఇప్పటివరకు 6,45,737 మంది ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటలైజ్ చేయడం ద్వారా 89.56 శాతం ప్రక్రియ పూర్తయిందని తెలిపారు.డిజిటలైజేషన్ ప్రక్రియలో 13,885 మంది మరణించిన ఓటర్లు, 47,142 మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్లు, 2,482 మంది గుర్తించలేని (అన్ట్రేసబుల్) ఓటర్లు, 11,234 మంది ఇప్పటికే ఇతర ప్రాంతాల్లో నమోదైన ఓటర్లు గుర్తించినట్లు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల ప్రకారం ప్రతి పోలింగ్ స్టేషన్లో సగటున 50 నుంచి 100 మంది వరకు ఓటర్ల పేర్లు తొలగించే అవకాశం ఉన్నందున, రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు తొలగింపునకు గురవుతున్న ప్రతి పేరును పరిశీలించి సంబంధిత రికార్డులపై సంతకాలు చేయాలని సూచించారు. బీఎల్వోలు, బీఎల్ఏలు పరస్పర సమన్వయంతో పనిచేస్తే ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఖచ్చితమైన ఓటరు జాబితా సిద్ధమవుతుందని అన్నారు. జిల్లాలో సుమారు 43 వేల మంది ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించినప్పటికీ మ్యాపింగ్ లింక్ అందుబాటులో లేకపోవడంతో, వారికి నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన 12 రకాల ధ్రువీకరణ పత్రాల్లో ఏదైనా ఒకటి సమర్పిస్తే వారి పేర్లను ఓటరు జాబితాలో చేర్చేందుకు అవకాశం కల్పిస్తామని వివరించారు. భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం 1,200 మందికి పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ స్టేషన్లను విభజిస్తూ జిల్లాలో 21 కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటును ప్రతిపాదించినట్లు కలెక్టర్ తెలిపారు. ఆగస్టు 17న ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురిస్తామని, సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్లు, అభ్యంతరాలు స్వీకరిస్తామని, వాటిని అక్టోబర్ 15 నాటికి పరిష్కరించి అక్టోబర్ 19న భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు తుది ఓటరు జాబితాను విడుదల చేస్తామని జిల్లా కలెక్టర్ వెల్లడించారు.రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటరు జాబితా పరిశీలనలో చురుకుగా పాల్గొని, బీఎల్వోలతో సమన్వయం చేసుకుంటూ పారదర్శకమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా తయారీకి సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ బి.ఎస్ లత, ఆర్.డి.ఓ లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల శాఖ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## చేనేత వస్త్ర పరిశ్రమకు తగిన ప్రోత్సాహాన్ని కల్పించాలి

- చేనేత కార్మికులను సన్మానించిన భారత్ సురక్ష సమితి
- రాష్ట్ర ఉపాధ్యక్షులు , భాజపా నాయకులు



**జగిత్యాల ఆగస్టు 07(మనం న్యూస్):** పట్టణంలో ఉన్న చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో పనిచేస్తున్న చేనేత వస్త్ర కార్మికులను సంఘ భవనంలో భారత్ సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ సి ఎస్ రాజు ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు ఏసిఎస్ రాజు చిట్ల గంగాధర్ లు ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ బిజెపి నాయకులు జగిత్యాల శాసనసభ ఇంచార్జ్ ముదుగంటి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ అద్భుతమైన వస్త్రాలను మగ్గాల పై నేసి దేశ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుతున్న చేనేత కళాకారులందరికి జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. స్వాతంత్రోద్యమంలో భాగంగా ప్రారంభమైన స్వదేశీ ఉద్యమం నుంచే మన చేనేత ఉత్పత్తులకు, స్వదేశీ వస్త్రాలకు ప్రోత్సాహం ప్రారంభమైందని అన్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వస్త్రాలను నేసిన ఘనత మన చేనేత కార్మికులదని, ఆనాడు స్వాతంత్రోద్యమ కాలంలో మన వస్త్ర పరిశ్రమతో పోటీని తట్టుకోలేక ఆంగ్లేయులు మన వస్త కార్మికుల చేతి వేళ్లను కూడ నరికారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం ముద్ర లోన్ల ద్వారా హ్యాండ్లూమ్ సహకార సంఘాల ద్వారా కార్మికులకు ప్రయోజనాలు కల్పిస్తుందని వీరికి పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ముడి సరుకుల ధరలు అందుబాటులో లేకపోవడం, చేనేత వస్త్రాలకు గిట్టుబాటు ధర లభించకపోవడం, ఉపాధి అవకాశాలు తగ్గి చేనేత వస్త్ర పరిశ్రమ ఆదరణ కోల్పోతుందని బలవన్మరనాలు కూడా జరుగుతున్నాయని వీరిని ప్రభుత్వాలు ఆదుకొని చేనేత వస్త్ర పరిశ్రమకు తగిన ప్రోత్సాహాన్ని కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం బాధ్యులు ఆడెపు రాజేశ్వర్, పట్టణ పద్మశాలి సేవా సంఘం ప్రధాన కార్యదర్శి చిలుక రాజన్న, నాయకులు వేముల దేవరాజం, విటల్, గాదసు భూమన్న, నరేందుల శ్రీనివాస్, కొత్తకొండ బాలన్న, నాయని సంజీవరావు, కె ఆర్ కృష్ణ, ఆడెపు జానయ్య, ఎడమల వెంకట్ రెడ్డి, గొల్లపల్లి సత్యనారాయణ గౌడ్, చల్గల్ శంకర్, సిరిపురం గంగారం, మాదాసు మల్లేష్, అడ్డగట్ల శంకర్, బొందుకూరి శ్రీనివాస్ పాల్గొన్నారు

## వివరాల సేకరణను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

- రాష్ట్ర జనగణన సంచాలకులు భారతి హోళ్లికేరి



**ములుగు ఆగస్టు 7 మనం ప్రతినిధి:** జనగణన-2027 కార్యక్రమంలో భాగంగా జిల్లా జనగణన హ్యాండ్ బుక్ తయారీకి అవసరమైన గ్రామ డైరెక్టరీ, పట్టణ డైరెక్టరీ వివరాల సేకరణను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర జనగణన సంచాలకులు భారతి హోళ్లికేరి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుండి ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర జన గణన సంచాలకులు మాట్లాడుతూ భారత ప్రభుత్వ రిజిస్ట్రార్ జనరల్, జనగణన కమిషనర్ కార్యాలయం- న్యూఢిల్లీ, తెలంగాణ రాష్ట్ర జనగణన సంచాలకుల కార్యాలయం మార్గదర్శకాల మేరకు జిల్లాల పరిధిలో అన్ని చార్జ్ పరిధిలో ఫీల్ ఫంక్షనరీలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ఈ శిక్షణల ద్వారా సమాచార సేకరణ, నమోదు ప్రక్రియలో ఏకరూపత, ఖచ్చితత్వం, నాణ్యతను నిర్ధారించేందుకు సమగ్ర అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు.

# వెంకటేశ్వర్లుకు సన్మానం



హైదరాబాద్, ఆగష్టు 7(మనంన్యూస్): జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా టి.జి.వో నగర శాఖ అధ్యకుడు అధ్యకుడు గండూరి వెంటేశ్వర్లును మల్లేపల్లి ఐటీఐలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా బ్రాంచ్ అధ్యక్షుడు ఎం.బి కృష్ణ యాదవ్ మర్యాదపూర్వకంగా ఆహ్వానించి సన్మానించారు. తెలంగాణ్ రాష్ట్రంలో మన చేనేత సమాజం,చేనేత కార్మికుల కళానైపుణ్యాన్ని గౌరవించాలని, ఈ అమూల్యమైన సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడంలో వారి కృషికి తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం తమ పూర్తి సహకారం మద్దతు ఇస్తుందని తెలిపారు.ఈ సన్మాన కార్యక్రమంలో టి జి వో హైద్రాబాద్ జిల్లా బ్రాంచ్ సంయుక్త కార్యదర్శి డాక్టర్ క్రొత్త విద్యాసాగర్, వెంకట్ మరియు ఐటిఐ విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- అన్నిశాఖలు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేయాలి
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ




సంగారెడ్డి, ఆగస్టు 07 మనం ప్రతినిధి : జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య, ఆరోగ్య సేవలతో పాటు విద్య, తాగునీరు, వ్యవసాయం, రెవెన్యూ, మహిళా శిశు సంక్షేమం తదితర రంగాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగవంతం చేసి, వాటి ఫలాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్తో కలిసి మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్యం, విద్య, సాగునీరు, తాగునీరు, వ్యవసాయం, రెవెన్యూ, మహిళా శిశు సంక్షేమ శాఖలకు సంబంధించి జిల్లాలో అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, వాటి పురోగతి, క్షేత్రస్థాయిలో పరిస్థితులు, తదితర అంశాలపై శాఖల వారీగా మంత్రి సమగ్రంగా సమీక్షించారు. జిల్లాలో వైద్య, ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేయడానికి చేపడుతున్న చర్యలపై మంత్రి సమీక్షించారు. జోగిపేట ఏరియా ఆసుపత్రిలో విధులు నిర్వహించాల్సిన డ్యూటీ డాక్టర్ స్థానంలో మరో నకిలీ వ్యక్తి డాక్టర్గా విధులు నిర్వహించిన ఘటనపై మంత్రి దామోదర్ రాజనర్సింహ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రుల్లో వైద్యుల హాజరు, విధుల నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని డి సి హెచ్ ఎస్ , ఆసుపత్రి సూపరింటెండెంట్లను ఆదేశించారు. కంకోల్, సింగితం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని, బర్దిపూర్, సుల్తాన్పూర్, నేరడిగుంట పీహెచ్ సి భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, డెంగ్యూ, మలేరియా, చికున్గున్యా తదితర వ్యాధుల నమోదైన కేసుల వివరాలను మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, వైద్య పరికరాలు, ఇతర మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి నర్సింగ్ కళాశాల, పటాన్చెరు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, జహీరాబాద్ ఎం సి హెచ్ లనుత్వరలో ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు మంత్రి ఆదేశించారు. సంగారెడ్డి జి జి హెచ్ లో అవసరమైన ఎక్విప్మెంట్, మందులు అందుబాటులో ఉండాలని, నిరంతరం పర్యవేక్షించాలని జి జి హెచ్ సూపరింటెండెంట్ కు సూచించారు. విద్యా రంగంలో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు.కేజీబీవీ లు, మోడల్ స్కూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని మంత్రి ఆదేశించారు. పి హెచ్ సి లు,అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, కె జి బి విలు,మోడల్ స్కూళ్లు, జడ్ పి హెచ్ ఎస్ లలో త్రాగునీరు, డ్రైనేజీ, మరుగుదొడ్ల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన పనులను పూర్తి చేయాలని మంత్రి కలెక్టర్ కు సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించి విద్యార్థులు ఆహ్లాద వాతావరనంలో చదువు కునేలా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. హాస్టళ్లకు సంబంధించి ప్రస్తుతం అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొత్త రేషన్ కార్డుల జారీ అంశంపై మంత్రి సమీక్షస్తూ,ఈ నెల 15న ముఖ్యమంత్రి గౌ.రేవంత్ రెడ్డి సంగారెడ్డి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో, కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో తాగునీటి సరఫరా పరిస్థితిపై మంత్రి సమీక్షిస్తు మంజీర, సింగూరు ప్రాజెక్టుల్లో ప్రస్తుత నీటి మట్టాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. బోరంచ, భూసారెడ్డిపల్లి ఇంటెక్ వెల్ల ద్వారా జరుగుతున్న నీటి సరఫరాపై కూడా మంత్రి వివరాలు తెలుసుకున్నారు. జిల్లాలో ప్రస్తుత తాగునీటి సరఫరా పరిస్థితిని వాస్తవికంగా అంచనా వేసి, జిల్లాలో సరిపడు వర్షాలు పడని పక్షంలో రానున్న రోజుల్లో ఎదురయ్యే పరిస్థితులను ముందుగానే అంచనా వేసి సమగ్ర యాక్షన్ ప్లాన్ రూపొందించాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికతో ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు మంత్రి సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, సబ్ కలెక్టర్ ఉమా హారతి, సంబంధిత శాఖల అధికారులు,రెవెన్యూ డివిజనల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తాం

- సిద్ధాంతుల పండగలను అనుసరిస్తాం
- దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ

హనుమకొండ, ఆగస్టు 7 (మనం ప్రతినిధి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించడంతోపాటు ముఖ్యమైన పండగల విషయంలో ఒకే తేదీ ఉండేలా సిద్ధాంతుల క్రమాన్ని అనుసరించేలా చూడనున్నట్లు దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ చెప్పారు. హైదరాబాద్లో గురువారం పెద్ద ఎత్తున తెలంగాణ రాష్ట్ర పంచాంగ సిద్ధాంతకర్తల సమావేశంలో నిర్ణయించిన తీర్మానాలను నివేదిక రూపంలో శుక్రవారం దేవాదాయ శాఖ మంత్రికి అందజేశారు. తెలంగాణ అర్చక ఉద్యోగ జాక్ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో పంచాంగకర్తల రాష్ట్ర సమాఖ్య అధ్యక్షులు అవసరాల ప్రసాద్ శర్మ సిద్ధాంతి, పురోహితుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర నాగేంద్రశర్మ, దూప, దీప నైవేద్య రాష్ట్ర అధ్యకుడు పెరుంబుదురు శ్రీకాంత్ శర్మ తదితరులు శుక్రవారం హనుమకొండలోని రాంనగర్లో మంత్రిని కలిశారు. ముఖ్యంగా గ్రామస్థాయి పురోహితులకు అన్ని కులాల అర్చకులకు ప్రభుత్వం ద్వారా సిద్ధాంతులు ఖరారు చేసిన తేదీ విషయాన్ని ముందస్తుగానే తెలియజేస్తామన్నారు. దేవాదాయ, మునిసివల్, పంచాయతీరాజ్, పౌరసంబంధాల శాఖ అధికారులతో చర్చించి అందరికి సానుకూల తేదీలను ప్రకటింపజేస్తామని మంత్రి చెప్పినట్లు గంగు ఉపేంద్రశర్మ చెప్పారు. ఈ సందర్భంగా పంచాంగ సిద్ధాంకర్తలు హైదరాబాద్లో సమావేశం ఏర్పాటు చేసి ఏకపక్షంగా పర్వదిన తేదీలను ఖరారు చేసినందుకు మంత్రి నిర్వాహకులను కూడా అభినందించారు.

# పిల్లలకు తల్లి పాలే శ్రేష్ఠం




ములుగు, ఆగష్టు7(మనంన్యూస్): ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా హంస హోమియోపతి మెడికల్ కాలేజ్ హాస్పిటల్ రీసెర్చ్ సెంటర్, క్షీరసాగర్ ఆధ్వర్యంలో రిమ్మనగూడ గ్రామంలో గర్భిణీలు, బాలింతల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తల్లిపాల ప్రాముఖ్యత, శిశువుకు పుట్టిన వెంటనే తల్లిపాలు ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలు, మొదటి ఆరు నెలల పాటు పూర్తిగా తల్లిపాలు మాత్రమే ఇవ్వాల్సిన అవసరం, తల్లి మరియు శిశువు ఆరోగ్యానికి తల్లిపాలు అందించే రక్షణ, అలాగే సంప్రదాయ అపోహలను తొలగించే అంశాలపై అవగాహన కల్పించారు. మూడవ సంవత్సరం బీహెచ్ఎంఎస్ విద్యార్థులు సరైన తల్లిపాల పట్టింపు , శిశువును సరైన స్థితిలో ఉంచే విధానం మరియు కంగారూ మదర్ కేర్పద్ధతిని ప్రదర్శించి వివరించారు. కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ మల్కగళ్ల కరుణాకర్ ముఖ్య అతిథిగా హాజరై తల్లిపాల ప్రాముఖ్యతను కొనియాడుతూ ప్రతి తల్లి ఈ అవగాహనను సద్వినియోగం




చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఉపాధ్యాయులు జి. మాణెమ్మ, పి. రజిని, ఏఎన్ఎం నర్స్ డి. మంజుల, ఆశా కార్యకర్తలు ఎం. దర్గమ్మ, డి. హేమలత పాల్గొని గర్భిణీలు, బాలింతలకు ఆరోగ్య సూచనలు అందించారు.హంస హోమియోపతి మెడికల్ కాలేజ్ అధ్యాపకులు డా. వై. ఆశ, హెచ్ఓడీ ప్రొఫెసర్, డా. నూరుస్ సహెర్ ఖాన్, అలాగే తృతీయ సంవత్సరం బీహెచ్ఎంఎస్ విద్యార్థులు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి ఆరోగ్య విద్యను అందించారు.గ్రామంలోని గర్భిణీలు, బాలింతలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని ఆసక్తిగా వీక్షించారు. చివరగా నిర్వాహకులు గ్రామ ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆరోగ్య శాఖ సిబ్బందికి సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

# బిడ్డకు తల్లి పాలుతోనే సంపూర్ణ ఆరోగ్యం

- డాక్టర్ సుశీల రత్నం



గజ్వేల్ ఆగస్టు 7 మనం న్యూస్: గజ్వేల్ మాతా శిశు సంరక్షణ కేంద్రం గజ్వేల్ లో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాత శిశు సంరక్షణ కేంద్రం హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుశీల రత్నం హాజరైనారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు సంపూర్ణ ఆహారం అని పాపకు కావలసిన పోషక పదార్థాలు విటమిన్స్ ఉంటాయని, శిశువు ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తల్లిపాలు అమృతంగా పనిచేస్తాయని పుట్టిన అరగంట లోపు తల్లిపాలు ఇవ్వాలని, పుట్టగానే వచ్చేపాలు మురుపాలు ఒక యాంటీబయటిక్ టీకాగా పనిచేస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ త్రివేణి, డాక్టర్ మాధవి, పీడియాట్రిషన్ శాంతం రెడ్డి, డాక్టర్ వినోద్. మాతా శిశు సంరక్షణ కేంద్రం నర్సింగ్ సూపరింటిండెంట్ సువర్ణ, హెడ్నెస్ జగదాంబ, వీణ,సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ వకులాదేవి,ఇన్ఫెక్షన్ కంట్రోల్ నర్సింగ్ ఆఫీసర్ రజిత, నర్సింగ్ ఆఫీసర్స్ సరళ ,నాగేశ్వరి, జ్యోతి, హెల్త్ అసిస్టెంట్ దేవసాని వాసుదేవ్ నేత, బి.స్వప్న ,లత, దేవి, రేణుక, ఆంజనేయులు,ఈశ్వరి భాయ్ మెమోరియల్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ చైనీ, కళాశాల అధ్యాపకులు, లైన్స్ క్లబ్ స్నేహ చైర్మన్ డాక్టర్ కుమారస్వామి, నంగునూరి సత్యనారాయణ, లచ్చాలు సేటు, విద్యార్థిని, విద్యార్థులచే పాలిచ్చే విధానం కంగారు పద్ధతిలో ఏ విధంగా పాలు ఇవ్వాలని కనులకు కట్టినట్టుగా నాటకా రూపంలో కళ ప్రదర్శన ద్వారా తల్లిపాల ప్రాముఖ్యతను వివరించడం జరిగింది.

ఇంకా ఈ కార్యక్రమంలో బాలింతలు గర్భవతులు పేరెంట్స్ పారామెడికల్ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది, అధిక సంఖ్యలో పాల్గొన్న కార్యక్రమం విజయవంతం చేశారు.

# పరిపూర్ణమైన ఓటర్ జాబితా కోసమే సర్

**జిల్లాలో 100% ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా పునః పరిశీలన**

**87.97% ఓటర్ల ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్**

**12.3% ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్ ఓటర్లు**

**ఉమ్మడి మెదక్ జిల్లా సర్ ప్రత్యేక అబ్జర్వర్ గౌరవ్ ఉప్పల్**



సిద్దిపేట, ఆగస్టు 7 మనం ప్రతినిధి : నాణ్యమైన ఓటర్ జాబితా తయారీ కోసమే ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా పునః పరిశీలన కొనసాగుతుందని ఉమ్మడి మెదక్ జిల్లా స్పెషల్ అబ్జర్వర్ గౌరవ్ ఉప్పల్ అన్నారు. శుక్రవారం జిల్లాలో పర్యటించి ఐడిఓసిలో జరిగిన మినీ సమావేశంలో జిల్లా కలెక్టర్ కె హైమావతి, జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారులు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు బిఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవ్ ఉప్పల్ మాట్లాడుతూ సర్ ప్రక్రియ ముఖ్య ఉద్దేశం నాణ్యమైన ఓటర్ జాబితా తయారు చేయడం అని ప్రజాస్వామ్యంలో ఓటరు అతి ముఖ్యమైన పాత్ర వహిస్తారన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం సర్ ను చేపట్టి బోగస్ ఓటర్లు లేకుండా పరిపూర్ణమైన ఓటర్ జాబితాను సిద్ధం చేస్తుందని తెలిపారు. షిఫ్టెడ్ ఓటర్లు, డెత్ ఓటర్లు, ఆబ్సెంట్ ఓటర్లను గుర్తించేటప్పుడు జాగ్రత్తలు తీసుకొని క్షేత్రస్థాయిలో రెండు, మూడు సార్లు పరిశీలించి పక్కింటి వారి సంతకం తీసుకొని నిర్ణయానికి రావాలని అన్నారు. అదేవిధంగా సేకరించిన డాటా ఆన్లైన్లో పొందుపరిచేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, డ్రాఫ్ట్ ఓటర్ జాబితా నమోదు అనంతరం స్వీకరించే అభ్యంతరాలను మరొకసారి క్షేత్రస్థాయిలో పరిశీలించి తప్పులు లేకుండా ఏ ఒక్క ఓటరు మిస్ కాకుండా ఓటర్ జాబితా తయారీకి అధికారులు కృషి చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ కె హైమావతి మాట్లాడుతూ జిల్లాలో జూన్ 5 నుండి ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా పునః పరిశీలన కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు, బూత్ లెవల్ ఆఫీసర్స్ ద్వారా ఇంటింటికి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసి ఆ ఫారాల ద్వారా ఓటర్ల వివరాలను సేకరించడం జరిగిందన్నారు. జిల్లాలో 100% ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా పునః పరిశీలన పూర్తయిందని 87.97% ఓటర్ల ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ కూడా పూర్తయిందన్నారు. మిగతా 12.3% ఆబ్సెంట్ ఓటర్లు, షిఫ్టెడ్ ఓటర్లు, ఉన్నారని ప్రొజెక్టర్ ద్వారా కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, బిఎల్ఓ లు పాల్గొన్నారు.

# సన్నవరి విత్తనాల ఆన్లైన్ నమోదుకు 10న చివరి గడువు

- నమోదు చేసుకోకపోతే బోనస్కు దూరమయ్యే అవకాశం
- రైతులు వెంటనే నమోదు చేసుకోవాలి

కన్నాయిగూడెం, ఆగస్టు 7(మనం న్యూస్): మండలంలోని రైతులు వ్యవసాయ శాఖ ద్వారా ఎంపిక చేసిన ఏడు సన్న వరి రకాల విత్తనాల వివరాలను తప్పనిసరిగా ఆన్లైన్లో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ముంజ మహేష్ సూచించారు. విత్తనాల ఆన్లైన్ నమోదుకు ఆగస్టు 10వ తేదీనే చివరి గడువు అని స్పష్టం చేశారు. వ్యవసాయ శాఖ ఎంపిక చేసిన ఏడు సన్న వరి రకాల విత్తనాలను ఇప్పటికే కొనుగోలు చేసిన రైతులు, తాము విత్తనాలు కొనుగోలు చేసిన అధీకృత విత్తన డీలర్ను సంప్రదించి వెంటనే ఆన్లైన్ నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని అధికారులు కోరారు. నిర్దేశించిన గడువులోగా విత్తనాల వివరాలను ఆన్లైన్లో నమోదు చేయించుకోని రైతులు రాష్ట్ర ప్రభుత్వం అందించే సన్న వరి బోనస్కు అనర్హులయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. చివరి గడువు సమీపిస్తున్నందున రైతులు నిర్లక్ష్యం చేయకుండా, తాము విత్తనాలు కొనుగోలు చేసిన డీలర్ను సంప్రదించి నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న బోనస్ పథకానికి సంబంధించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి రైతు ఆగస్టు 10వ తేదీలోపు ఆన్లైన్ నమోదు పూర్తి చేసుకోవాలని కన్నాయిగూడెం మండల వ్యవసాయ శాఖ అధికారి ముంజ మహేష్ కోరారు.

# విజ్ఞానం-యువశక్తితోనే వికసిత భారత్ సాధ్యం..

**పాలమూరు వర్సిటీ ఆధ్వర్యంలో 'విజన్ ఇండియా-2047' జాతీయ సదస్సు ప్రారంభం**

**కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, పరిశ్రమల సమన్వయంతో లక్ష్య సాధన**

**మంత్రి జూపల్లి కృష్ణారావు**



మహబూబ్నగర్ , ఆగస్టు 7 (మనం న్యూస్ ): విజ్ఞానం, పరిశోధన, సాంకేతికత, ఆవిష్కరణలు, యువశక్తి సమన్వయంతోనే వికసిత భారత్-2047 లక్ష్యాన్ని సాధించవచ్చని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, మద్యనిషేధ, ఎక్సైజ్ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పాలమూరు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో, కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆర్థిక సహకారంతో కన్హా శాంతివనంలో నిర్వహిస్తున్న విజన్ ఇండియా 2047: విజ్ఞానం, ఆవిష్కరణలు మరియు యువశక్తి సాధికారత సమన్వయం ద్విదిన జాతీయ సదస్సును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య శతాబ్ది నాటికి భారత్ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, విశ్వ విద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, పరిశ్రమలు, విధాన రూపకర్తలు, యువత సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కృత్రిమ మేధస్సు, డేటా సైన్స్, బయోటెక్నాలజీ, సెమీకండక్టర్లు, అంతరిక్ష సాంకేతికత, పునరుత్పాదక ఇంధన రంగాల్లో యువతకు మరిన్ని అవకాశాలు కల్పించాలని సూచించారు.రెండు రోజుల పాటు జరిగే సదస్సులో దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, రిజిస్ట్రార్లు, శాస్త్రవేత్తలు, విధాన రూపకర్తలు, పరిశ్రమల ప్రతినిధులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొంటున్నారు. విజ్ఞానం, సాంకేతికత, పరిశోధన, ఆవిష్కరణలు, పరిశ్రమ-విద్యా భాగస్వామ్యం, యువత సాధికారత, స్థిరమైన అభివృద్ధి, భవిష్యత్ నైపుణ్యాలపై సాంకేతిక సమావేశాలు, నిపుణుల చర్చలు, పరిశోధనా పత్రాల సమర్పణలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో పాలమూరు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పూస రమేష్ బాబు, సదస్సు కన్వీనర్లు ప్రొఫెసర్ మధుసూదన్ రెడ్డి, డా. కె. ప్రవీణ, కమిటీ చైర్మన్లు ప్రొఫెసర్ నూర్జహాన్, ప్రొఫెసర్ చంద్రకిరణ్, ప్రొఫెసర్ కిషోర్, పీజీ కేంద్రాల ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లాలో 30 నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ప్రతిపాదనలు



- ప్రస్తుతం 880 పోలింగ్ కేంద్రాలు
- ప్రతిపాదనలు అమలైతే 910కు పెరగనున్న సంఖ్య
- జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్

ఉమ్మడి మహబూబ్ నగర్ ఆగస్టు 07 (మనం బ్యూరో): నాగర్కర్నూల్ జిల్లాలో ఎన్నికల నిర్వహణను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా చేపట్టడంతో పాటు ప్రతి ఓటరు తన ఓటు హక్కును సులభంగా వినియోగి ంచుకునేలా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణకు చర్యలు చేపడుతున్నట్లు నాగర్ కర్నూల్ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ తెలిపారు. ఈ మేరకు నాగర్కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ప్రతిపాదించిన నూతన పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాల మార్పులు, పేర్ల సవరణలకు సంబంధించిన అంశాలపై నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...., ప్రస్తుతం జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 880 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. భారత ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు ఓటర్ల సంఖ్య, భౌగోళిక పరిస్థితులు, పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు చేరుకోవాల్సిన దూరం, గ్రామాల విస్తీర్ణం, ప్రజల సౌకర్యం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం మరో 30 కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వెల్లడించారు.

# జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు

- ఎమ్మెల్సీ యాదవ్ రెడ్డి



గజ్వేల్ ఆగస్టు 8 మనం న్యూస్: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కార్మికులకు మెదక్ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం నాడు స్థానిక ఢిల్లీ వాలా హోటల్ సమీపంలో గల చేనేత మగ్గం విగ్రహానికి పూలమాలలు వేయడం జరిగింది.ఈ సందర్భంగ మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వంలో చేనేత రంగ అభివృద్ధికి విశేష ప్రాధాన్యత ఇచ్చిందని అన్నారు. నేతన్నల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను చేయూత నూలు సబ్సిడీ బతుకమ్మ చీరలు వర్కర్ టు ఓనర్ వంటి పథకాలతో చేనేతరంగానికి ఊపిరి పోశారన్నారు. అమలు చేసి, వారికి ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు అప్పుల భారాన్ని తగ్గించేలా చర్యలు చేపట్టిందన్నారు. చేనేత కార్మికుల శ్రమకు తగిన గౌరవం, వేతనాలకు పెద్దపీట వేస్తూ వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కృషి చేసిందని పేర్కొన్నారు. అనంతరం గజ్వేల్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ అబద్దాల పునాదుల మీద ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను మరిచి పథకాలను నిలిపివేసి నూతనల జీవితాలను సంక్షోభంలోనిటిందని మండిపడ్డారు, కాంగ్రెస్ ప్రభుత్వంలో మగ్గాలు మూగబోతున్నాయని వలసలప్పులు ఆత్మహత్యలు పెరుగుతున్నాయని అన్నారు, జాతికి బట్టనేసి చేనేతలను కాపాడడం ప్రభుత్వాల బాధ్యత అని అన్నారు అయితే నేడు కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత కార్మికుల సమస్యలను పూర్తిగా విస్మరించి, వారి జీవితాలతో చెలగాటమాడుతోందని విమర్శించారు. ఎన్నికల సమయంలో నేతన్నలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని, చేనేత రంగానికి అవసరమైన ప్రోత్సాహం అందించడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. నేతన్నల హక్కులను పరిరక్షించాల్సిన ప్రభుత్వం వాటిని కాలరాస్తూ చేనేత కుటుంబాలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికుల పొట్టగొడుతున్న కార్పొరేట్ సంస్థలు

- ముడిసరుకుకు కేంద్రం జీఎస్టీ మినహాయించాలి
- సంక్షేమ పథకాల్లో చేనేత కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత
- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తూంకుంట అంక్షారెడ్డి



గజ్వేల్, ఆగస్టు 7 మనం న్యూస్: చేనేత కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత ఇస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తూంకుంట అంక్షారెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం గజ్వేల్ లోని మగ్గం చౌరస్తాలో జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమానికి హాజరై ఆమె మాట్లాడారు. కార్పొరేట్ సంస్థల ప్రవేశంతో కార్మికుల పూట గడవడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే కార్పొరేట్ సంస్థల ప్రమేయాన్ని తగ్గించి కేంద్రం చేనేతకు అవసరమయ్యే ముడి సరుకుకు జిఎస్టి మినహాయించాలని డిమాండ్ చేశారు. కాగా పండగ పర్వదినాల్లో సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు చీరల పంపిణీ చేస్తుండగా, నేరుగా చేనేత కార్మికుల నుండి కొనుగోలు చేస్తూ వారిని ఆర్థికంగా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. అలాగే వివిధ రకాల పెన్షన్లు, వివిధ రాయితీలను కల్పిస్తూ సహకరిస్తుండగా, చేనేత కార్మికుల వస్త్రాలను కొనుగోలు చేస్తూ ఆర్థిక చేయూతనివ్వాలని ఆకాంక్షించారు. ప్రతి ఏటా ప్రభుత్వం చేనేత కార్మికుడికి ఆర్థిక సహాయం అందిస్తుండగా, ఉచిత విద్యుత్ వర్తింపజేస్తూ పాత బకాయాలను రద్దు చేసినట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు రాజేశం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, పిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి, మజీద్ కమిటీ అధ్యక్షులు సయ్యద్ మతిన్, మాజీ కో ఆప్షన్ సభ్యులు షరీఫ్, పద్మశాలి యువజన జిల్లా విభాగం అధ్యక్షులు ప్రేమ్ కుమార్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొండల్ రెడ్డి, నేతలు ఉడో సారిక శ్రీనివాస్ రెడ్డి, నేత నాగరాజు, గాడిపల్లి శ్రీనివాస్, రమేష్ గౌడ్, జగ్గయ్య గారి శేఖర్, రాములు గౌడ్, సమీర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# త్రివేణి పాఠశాలల్లో ఘనంగా బోనాల ఉత్సవం



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 07 (మనంప్రతినిధి):** కొత్తగూడెం త్రివేణి పాఠశాల్లో శుక్రవారం ఘనంగా బోనాల ఉత్సవాలను నిర్వహించారు. తెలంగాణ సంస్క ృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను పురస్కరించుకుని ఈ నెల 9వ తేదీన జరిగే బోనాలను ముందస్తుగా త్రివేణి పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి, బోనాలను అలంకరించి ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. త్రివేణి-కృష్ణవేణి సంస్థల డైరెక్టర్స్ గొల్లపూడి జగదీశ్ మాట్లాడుతూ, బోనాల పండుగ విశిష్టత, తెలంగాణ సంస్క ృతిలో దాని ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేస్తూ, బోనాల పండుగ ద్వారా మన సంస్క ృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయడమే ప్రధాన ఉద్దేశమని తెలిపారు. అనంతరం సాంస్క ృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తెలంగాణ జానపద కళలు, సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని బోనాల పండుగను ఆనందోత్సాహాలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిని త్రివేణి-కృష్ణవేణి సంస్థల డైరెక్టర్స్ గొల్లపూడి జగదీశ్ , గొల్లపూడి వీరేంద్రచౌదరి , సి.ఆర్. ఓ కాట్రగడ్డ మురళీ క్రిష్ణ , ప్రిన్సిపాల్స్ సూర్యనారాయణ మూర్తి, శ్రీనివాస్ సింగ్, నేతాజీ, వైస్ ప్రిన్సిపాల్ సౌజన్య శుభాకాంక్షలు తెలియజేశారు.

## పుట్టగొడుగుల్లా ఆర్ఎంపీ క్లినిక్లు..

# పర్యవేక్షణ ఏదీ?



### సుజాతనగర్‌లో బాలిక మృతి ఘటనపై సమగ్ర విచారణకు డిమాండ్

**సుజాతనగర్, ఆగస్టు 7: (మనం న్యూస్):** సుజాతనగర్ ప్రాంతంలో ఆర్ఎంపీ పేరుతో నిర్వహిస్తున్న క్లినిక్లపై పర్యవేక్షణ ఏ మేరకు ఉందన్న ప్రశ్నలు తాజాగా తలెత్తుతున్నాయి. ఇటీవల ఆర్ఎంపీ వద్ద వైద్యం పొందిన ఓ బాలిక మృతి చెందిన ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. బాలికకు 'మంతాజ్ 250 ఎంజీ' ఇంజక్షన్ ఇచ్చినట్లు సమాచారం. అయితే ఇంజక్షన్ ఏ మోతాదులో ఇచ్చారు? ఎవరి సూచనలతో ఇచ్చారు? బాలికకు ఉన్న ఆరోగ్య పరిస్థితి ఏమిటి? వైద్యం అందించిన వ్యక్తికి సంబంధిత అర్హతలు ఉన్నాయా? అన్న విషయాలపై అధికారుల సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉంది.

**అధికారులకు పలు ప్రశ్నలు...**

**ఆర్ఎంపీ పేరుతో వైద్యం చేస్తున్న వ్యక్తులకు చట్టబద్ధమైన అర్హతలు, అనుమతులు ఉన్నాయా?**
**క్లినిక్లను సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ అధికారులు క్రమం తప్పకుండా తనిఖీ చేస్తున్నారా?**
**బాలికకు ఇచ్చిన ఇంజక్షన్ ఎవరి ప్రిస్క్రిప్షన్, ఎంత మోతాదులో ఇచ్చారు?**
**ఇంజక్షన్కు సంబంధించిన బ్యాచ్ నంబర్, ఎక్స్పైరీ తేదీ, నిల్వ విధానం సక్రమంగా ఉన్నాయా?**
**ఆర్ఎంపీలు సూచించే మందులు కొన్ని మెడికల్ షాపుల్లోనే లభిస్తున్నాయన్న ఆరోపణలపై అధికారులు విచారణ చేశారా?**
**ఆర్ఎంపీలు, మెడికల్ షాపుల మధ్య కమిషన్ల వ్యవహారం ఏమైనా ఉందా?**
**ఘటన అనంతరం సంబంధిత వ్యక్తుల నుంచి అధికారులు పూర్తి వివరాలు సేకరించారా?**

ఇదిలా ఉండగా, ఘటనపై వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించిన సమయంలో సంబంధిత క్లినిక్ మూసివేసి ఉండటం, ఫోన్లో సంప్రదించేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అయితే దీనిపై సంబంధిత వ్యక్తుల వివరణ కూడా వెలుగులోకి రావాల్సి ఉంది.

వాతావరణ మార్పులతో జ్వరాలు, దగ్గు తదితర అనారోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు సమీపంలోని క్లినిక్లను ఆశ్రయిస్తున్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అర్హత లేని వ్యక్తులు వైద్యం చేస్తున్నారా? క్లినిక్లలో మందుల వినియోగం, ఇంజక్షన్ల నిర్వహణ సక్రమంగా ఉందా? అనే అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. బాలిక మృతి ఘటనకు అసలు కారణం ఏమిటో వైద్యపరమైన విచారణ ద్వారా స్పష్టం చేయాలని, బాధ్యత ఎవరిదైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# 11 లోపు పంపులు ఆన్ చేయ్?

### లేదంటే నార్లాపూర్‌ను ముట్టడిస్తం
### మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** జూరాల ప్రాజెక్టు పరిధిలోని భీమా ఫేజ్-1, 2, నెట్టెంపాడు, కోయిల్ సాగర్ లిఫ్ట్‌తో పాటు కేఎల్ఐ కింద ఉన్న పంపులను తక్షణమే ప్రారంభించి పాలమూరు రైతాంగాన్ని ఆదుకోవాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ... ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ నెల 11వ తేదీలోపు పంపులను ఆన్ చేయకపోతే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి భారీ సంఖ్యలో రైతులతో నార్లాపూర్ ప్రాజెక్టును ముట్టడిస్తామని హెచ్చరించారు. కృష్ణా నదికి ఎగువ నుంచి భారీగా వరద నీరు వస్తున్నప్పటికీ, నీళ్లు లేవంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేస్తున్నారని సింగిరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పాలమూరు బిడ్డనని చెప్పుకుంటూనే ఏపీకి నీళ్లు తరలించేందుకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు రేవంత్ సహకరిస్తున్నారని ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులను పూర్తిగా పక్కన పెట్టేశారని విమర్శించిన ఆయన... కర్ణాటక నుంచి వచ్చే వృథా నీటితోనే డిసెంబర్ వరకు జూరాలకు పుష్కలంగా నీరు అందుతుందని, వెంటనే ఎత్తిపోతల పంపులు ప్రారంభించి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

# రీ సర్వేతో భూ సమస్యలు చెక్



**వైరా, ఆగస్టు 07 (మనం న్యూస్ ):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సంసిద్ధమైంది. అందులో భాగంగానే ఇప్పటికే భూభారతి చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో తరుచూ సరిహద్దు వివాదాలు, సర్వేనెంబర్ వివాదాలు పెరుగుతుండడంతో ప్రభుత్వం కొత్త ప్రణాళిక చేపట్టింది. భూములను డిజిటల్ పద్ధతిన రీసర్వే చేపట్టి ఆన్ లైన్ చేసి భూ యజమానుల రికార్డు పక్కాగా నమోదు చేయనున్నారు. ఇందుకోసం ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి మండలానికి రూ.9లక్షల విలువ చేసే సర్వే యంత్రాలను కొనుగోలు చేసి అందించారు. సర్వే యంత్రాల ద్వారా భూ సరిహద్దులను పక్కాగా నమోదు చేసి నూతన డిజిటల్ పట్టాలను అందజేయనున్నారు. ఇందుకోసం మండలంలోని పలు గ్రామాల్లో మొదటి విడతగా భూముల నమోదు ప్రక్రియ ప్రారంభించారు. దశల వారీగా రెవెన్యూ గ్రామాల వారీగా భూ వివరాలు నమోదు చేసి గ్రామ సభల ద్వారా రైతులకు, అధికారులకు సర్వే అభ్యంతరాలు, సందేహాలు నివృత్తి చేయనున్నారు.

**గ్రామీణ ప్రాంతాల్లో రీ సర్వే..**

గ్రామీణ ప్రాంతాల్లో భూముల రీ-సర్వేను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేపట్టేందుకు ప్రభుత్వం కార్యాచరణను వేగవంతం చేసింది. భూముల సరిహద్దులను ఖచ్చితంగా నిర్ధారించడం, డిజిటల్ భూ రికార్డులను రూపొందించడం, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. ఇందులో భాగంగానే వైరా మండలంలో నారపనేని పల్లి, అష్ణగుర్తి, బ్రాహ్మణ పల్లి, దాచపురం, మేడిబండ, పాలడుగు, గ్రామ రెవెన్యూ లో రీ సర్వే పై మొదటి విడతగా ఎంపిక చేశారు. రీ-సర్వే పూర్తయిన అనంతరం ప్రతి భూ కమతానికి ప్రత్యేక ల్యాండ్ పార్సిల్ మ్యాప్ ఎల్పీఎం సిద్ధం చేసి, భూదార్ గుర్తింపు సంఖ్య కేటాయించనున్నారు. దీంతో పాటు ఖచ్చితమైన ల్యాండ్ పార్సిల్ మ్యాప్ డిజిటల్ రూపంలో అందుబాటులో ఉంటుంది. భూమి కొనుగోలు, విక్రయం, వారసత్వ మార్పులు, బ్యాంకు రుణాలు, ప్రభుత్వ పథకాల అమలులో ఈ వివరాలు కీలకంగా ఉపయోగపడనున్నాయి.

**గ్రామ సభలతో అవగాహన..**

రీ-సర్వే ప్రారంభానికి ముందు ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తారు. సర్వే ప్రక్రియ, భూముల కొలతలు, రైతుల హక్కులు, అభ్యంతరాల నమోదు విధానం, సర్వే సమయంలో పాటించాల్సిన నిబంధనలను అధికారులు వివరిస్తారు. ప్రతి రెవెన్యూ గ్రామంలో సర్వే ప్రారంభానికి ముందు గ్రామ సర్పంచ్, గ్రామ కార్యదర్శి, గ్రామ పరిపాలన అధికారి (జీపీవో), రెవెన్యూ అధికారులు, సంబంధిత రైతులకు అధికారిక నోటీసులు అందజేస్తారు. కుంటలు, చెరువులు, వాగులు లేదా ఇతర జలవనరుల సర్వే సమయంలో వాటికి ఆనుకుని ఉన్న భూ యజమానులకు ప్రత్యేకంగా సమాచారం ఇస్తారు.

**నాలుగు దశల్లో రీ-సర్వే**

మొదటి దశలో గ్రామ సరిహద్దుల నిర్ధారణ అనంతరం గ్రామ రెవెన్యూ సరిహద్దులను గుర్తించి, పొరుగు గ్రామాలతో ఉన్న హద్దులను ఖరారు చేస్తారు. భవిష్యత్తులో గ్రామాల మధ్య సరిహద్దు వివాదాలు లేకుండా ఈ ప్రక్రియను పూర్తి చేస్తారు. రెండో దశలో గ్రామకంఠం(ఆబాది)పరిధిలోని వ్యవసాయేతర భూములు, ఇళ్ల స్థలాలు, వాణిజ్య స్థలాలు, ఇతర నాన్-అగ్రికల్చర్ భూములను సర్వే చేసి మ్యాపింగ్ చేస్తారు. మూడో దశలో ప్రభుత్వ ఆస్తులు శిఖం భూములు, వక్ఫ్ భూములు, ఎండోమెంట్స్ భూములు, ఆర్ అండ్ బీ శాఖ, ఎస్సారెస్పీ కాలువలు, గ్రామీణ,జిల్లా రహదారులు, జాతీయ రహదారులు,ఇతర ప్రభుత్వ సంస్థల భూములు ప్రభుత్వానికి చెందిన అన్ని భూములను సర్వే చేసి నమోదు చేస్తారు. నాలుగో దశలో చివరిదశలో వ్యవసాయ భూములను శాస్త్రీయ పద్ధతిలో కొలుస్తారు. ప్రతి కమతానికి ప్రత్యేక ల్యాండ్ పార్సిల్ మ్యాప్ రూపొందించి భూ యజమానుల సమక్షంలో హద్దులను నిర్ధారిస్తారు.

**డ్రాఫ్ట్-ఫైనల్ ప్రక్రియ..**

సర్వే పూర్తయిన అనంతరం రూపొందించిన మ్యాపులు, రికార్డులను ముందుగా డ్రాఫ్ట్ రూపంలో గ్రామంలో ప్రదర్శిస్తారు. రైతులు అభ్యంతరాలు, సవరణల కోసం 50 రోజుల గడువులో జిల్లా అధికారికి దరఖాస్తు చేసుకోవచ్చు. పరిశీలన అనంతరం సవరణలు చేసి ఫైనల్ రికార్డులు విడుదల చేస్తారు. దీంతో భూ రికార్డులకు చట్టబద్ధత,పారదర్శకత మరింత పెరుగుతుంది.

**రైతులు గ్రామ సభలకు హాజరు కావాలి..**

వైరా తహసిల్దార్ సురేష్ బాబు గ్రామీణ ప్రాంతాల్లో రైతుల సమస్యలు పరిష్కరించేందుకు చేపడుతున్న ఈ సర్వేకు రైతులు తప్పనిసరిగా హాజరుకావాలని అధికారులు కోరుతున్నారు. సర్వే సమయంలో భూమి వద్ద ఉండి హద్దులను చూపిస్తూ పట్టాదారు పాస్బుక్, రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇతర ఆధారాలు సిద్ధంగా ఉంచుకోవాలి. డ్రాఫ్ట్ మ్యాప్ను పరిశీలించి తప్పులు ఉంటే నిర్ణీత గడువులో అభ్యంతరం తెలియజేయాలి. తుది రికార్డులను పరిశీలించి భద్రపరచుకోవాలి.

# ప్రజా అవసరాలే ప్రాధాన్యంగా అభివృద్ధి పనులు

- **కొత్తూరులో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన**
- **దమ్మపేట తహశీల్దార్ కార్యాలయంలో బోర్వెల్, మరుగుదొడ్ల బ్లాక్ ప్రారంభ పనులకు శ్రీకారం**



**దమ్మపేట,ఆగష్టు 7(మనం న్యూస్):** ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సారధ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను గ్రామస్థాయిలో అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, మండలంలో పర్యటించి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**పేద కుటుంబాలకు సొంతింటి కల సాకారం...**

దమ్మపేట మండలం పార్కలగండి పంచాయతీ పరిధిలోని కొత్తూరు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సొంత ఇల్లు లేని అనేక కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా కృషి చేస్తానని పేర్కొన్నారు.

**ప్రజల సౌకర్యం కోసం తాహశీల్దార్ కార్యాలయంలో వసతులు...**

దమ్మపేట తహశీల్దార్ కార్యాలయంలో బోర్వెల్ను ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు.వివిధ పనుల కోసం ప్రతిరోజూ కార్యాలయానికి వచ్చే ప్రజలకు మంచినీటి అవసరాలు తీరనున్నయాన్నారు.అదేవిధంగా కార్యాలయానికి వచ్చే ప్రజలు సందర్శకుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని మహిళాశక్తి క్యాంటీను,మరుగుదొడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే సామాన్య ప్రజలకు కనీస సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

**పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి...**

వనమహోత్సవంలో భాగంగా పలు చోట్ల మొక్కలు నాటారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. వనమహోత్సవం లాంటి కార్యక్రమాల ద్వారా గ్రామాలు పట్టణాల్లో పచ్చదనం పెంచడం పర్యావరణాన్ని కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి వాటిని దశలవారీగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు అధికారులు ప్రజల సహకారంతో ముందుకు సాగుతామని అన్నారు. ఈ కార్యక్రమాల్లో ట్రైనింగ్ కలెక్టరు(తహశీల్దార్ దమ్మపేట ఎం మురళి ,స్థానిక సర్పంచ్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా,మండల నాయుకులు,సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ఎడ్యుకేషన్ జిఎంని సన్మానించిన జిఎం(పర్సనల్)లు



**కొత్తగూడెం సింగరేణి, ఆగస్టు 7(మనం న్యూస్):** కార్పొరేట్ పర్సనల్ డిపార్ట్మెంట్ లోని పిఎంవింగ్ నందు ఏజిఎం(పర్సనల్)గా పనిచేస్తూ పదోన్నతిపై సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీగా నియామకమై బాధ్యతలు చేపట్టిన జి.రాజేంద్ర ప్రసాద్ ని శుక్రవారం సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యాలయంలో జిఎం(పర్సనల్) ఐఆర్ అండ్ పిఎం జి.వి.కిరణ్ కుమార్, జిఎం(పర్సనల్) ఈఈ అండ్ ఆర్సి ఏజీఎం మురళీధరరావు, జిఎం(పర్సనల్) వెల్ఫేర్ సిఎస్ఆర్ అండ్ సెక్యూరిటీ కే.అజయ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

# ముగిసిన సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది శిక్షణ తరగతులు



**కొత్తగూడెం సింగరేణి, ఆగస్టు 7(మనం న్యూస్):** కొత్తగూడెంలోని సింగరేణి ఎస్ అండ్ పిసి ట్రైనింగ్ సెంటర్లో నాలుగు రోజులపాటు నిర్వహించిన శిక్షణ తరగతులు శుక్రవారంతో విజయవంతంగా ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ఏరియా సెక్యూరిటీ ట్రైనింగ్ అధికారి జాకీర్ హుస్సేన్ పాల్గొని ప్రసంగించారు. సెక్యూరిటీ సిబ్బంది అందరికీ క్రమశిక్షణ అనేది ముఖ్యమన్నారు. క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తున్నప్పుడే మనకు గుర్తింపు వస్తుందని ట్రాఫిక్ కంట్రోల్ శిక్షణ సెక్యూరిటీ సిబ్బంది అందరికీ అవసరం అని పేర్కొన్నారు. ఈ శిక్షణ వలన డ్యూటీ జీవితంలోనే కాకుండా వ్యక్తిగతంగా కూడా ఉపయోగకరమైనదని చెప్పారు. అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీచే పూర్తి అవగాహన కలిగించడం జరిగిందన్నారు. ఈ శిక్షణ వలన ఎటువంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా మెయిన్ గేటు వద్ద చెక్ పోస్ట్ ల వద్ద రద్దీ లేకుండా సాఫీగా అందరు తమ విధులను సక్రమంగా నిర్వహించేందుకు దోహదం చేస్తుందని తెలిపారు. ఎస్ అండ్ పిసి విభాగాన్ని పటిష్టంగా ఉండేందుకు కావలసిన అన్ని రకాల చర్యలు ట్రైనింగ్ సెంటర్ అభివృద్ధికి సహాయ సహకారాలు యాజమాన్యం అందిస్తుందని సెక్యూరిటీ సిబ్బంది అందరు మెరుగైన వృత్తి నైపుణ్యంతో అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ సింగరేణి ఆస్తులు స్థలాలను పరిరక్షించాలని సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని తెలిపారు. అనంతరం ఉత్తమ ట్రైనీలుగా ఎంపిక అయిన సందీప్ కుమార్, కె.సతీష్ లకు బహుమతి ప్రదానం గావించారు.

శ్రీ జ్యోతి అనాథ వృద్ధుల శరణాలయ నిర్వాహకులకు నిత్యావసరాలు వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఇన్స్పెక్టర్ డి.నారాయణరెడ్డి, జూనియర్ ఇన్స్పెక్టర్ కె.రాజనర్సు, ట్రైనింగ్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

# కొత్త పింఛన్లకు దరఖాస్తు చేసుకోండి

### ఎంపీడీవో రవీందర్ రెడ్డి



**దమ్మపేట,ఆగష్టు 07 (మనం న్యూస్):** వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, గీత కార్మికులు, నేత కార్మికులు, ఫైలేరియా వ్యాధి గ్రస్తులు లకు పింఛను దరఖాస్తులు పంచాయతీ కార్యదర్శి ద్వారా స్వీకరించబడును.

అర్హతలు: వితంతువు పింఛను:

18 సంవత్సరాలు వయసు, భర్త మరణ ధృవీకరణ,150000 సంవత్సర ఆదాయం

1) ఒంటరి మహిళ:18 సంవత్సరములు వయసు

2) విడాకుల పత్రం లేదా తహశీల్దార్ ధృవీకరణ,150000 ఆదాయం

3) వికలాంగుల పింఛన్లు: వయసుతో సంబంధం లేదు, 40శాతం వికలాంగత్వం, చెవిటి 50శాతం

4)గీత కార్మికులు:50సంవత్సరములు, గీత కార్మిక సొసైటీ సర్టిఫికెట్ ఉండాలి

5) నేత కార్మికులు:50 సంవత్సరములు, హ్యాండ్లూమ్ డిపార్ట్మెంట్ సర్టిఫికెట్ ఉండాలి.

అందరు పింఛన్ దరఖాస్తుదారులకు ఆదాయం 150000 రూపాయలు, భూమి: 3ఎకరాలు తరి, మెరక7.5 ఎకరాలు, దరఖాస్తు నమూనా పంచాయతీ కార్యదర్శి నీ సంప్రదించగలరు, దరఖాస్తు ఫామ్ ఆన్లైన్ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి ద్వారా చేయబడును ఫీల్ వెరిఫికేషన్ తర్వాత అర్హులకు పింఛన్లు మంజూరు చేయటం జరుగుతోందని ఎంపీడీవో రవీందర్ రెడ్డి, తెలియజేశారు.

# సుస్థిర అభివృద్ధి లక్ష్యాల అమలులో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు కీలకం

### జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 07 (మనంప్రతినిధి):** 2026-27 ఆర్థిక సంవత్సరానికి జిల్లా పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక , మండల పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనపై జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన శుక్రవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా స్థాయి కార్యాచరణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, గ్రామీణాభివృద్ధిని మరింత వేగవంతం చేయడంతో పాటు గ్రామస్థాయిలో సమగ్ర అభివృద్ధిని సాధించేందుకు పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు సమర్థవంతమైన సాధనమని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధనలో జిల్లా, మండల పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. భారత ప్రభుత్వం నిర్దేశించిన 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో ప్రతి మండలం రెండు లక్ష్యాలను ప్రాధాన్యత అంశాలుగా ఎంపిక చేసి, ఆయా లక్ష్యాలకు సంబంధించిన కనీసం 25 శాతం ప్రాజెక్టు ఆధారిత కార్యకలాపాలను మండల పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో తప్పనిసరిగా పొందుపరచాలని అధికారులను ఆదేశించారు. ఎంపిక చేసిన లక్ష్యాలు గ్రామాల అవసరాలు, స్థానిక పరిస్థితులు, అందుబాటులో ఉన్న వనరులు, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు దోహదపడేలా ఉండాలని సూచించారు.

మండల పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు ఎంపీడీవోలు నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని, జిల్లా పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనకు జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి నోడల్ అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తారని తెలిపారు. సంబంధిత అన్ని శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన గణాంకాలు, భౌతిక, ఆర్థిక ప్రగతి, అవసరాల వివరాలను సకాలంలో అందించి ప్రణాళికల రూపకల్పనకు సహకరించాలని ఆదేశించారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు గ్రామాల వాస్తవ అవసరాలను ప్రతిబింబించేలా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పేదరిక నిర్మూలన, జీవనోపాధి మెరుగుదల, ఆరోగ్యవంతమైన గ్రామాలు, బాలలకు అనుకూల వాతావరణం, నాణ్యమైన విద్య, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, పచ్చదనం, స్వయం సమృద్ధి మౌలిక సదుపాయాలు, సామాజిక న్యాయం, సుపరిపాలన, మహిళా సాధికారత వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, ఆదాయ వనరుల పెంపు కోసం గ్రామీణ పర్యాటకం, ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు, విలువ ఆధారిత వ్యవసాయ ఉత్పత్తులు, పౌల్ట్రీ, పశుసంవర్ధక అభివృద్ధి, సేంద్రీయ వ్యవసాయం, గ్రామ ఉత్పత్తుల జియో ట్యాగింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్, మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా ఆదాయ వృద్ధి కార్యక్రమాలు వంటి ప్రాజెక్టులను ప్రణాళికల్లో చేర్చాలని సూచించారు.

అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి తమ శాఖల పథకాలు, నిధులు, వనరులను సమీకరిస్తూ ఫండ్ కన్వర్జెన్స్ ద్వారా గ్రామాల అవసరాలకు అనుగుణంగా సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలు రూపొందించాలని ఆదేశించారు. గ్రామసభల ద్వారా ప్రజల అభిప్రాయాలను సేకరించి, గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో గుర్తించాలని తెలిపారు.

ప్రతి ప్రాజెక్టుకు లక్ష్యం, అంచనా వ్యయం, నిధుల వనరు, అమలు చేసే శాఖ, కాలపట్టిక, ఆశించిన ఫలితాలను స్పష్టంగా తెలుపుతూ కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. రూపొందించే ప్రణాళికలు గ్రామాల సమగ్రాభివృద్ధికి దోహదపడటంతో పాటు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో ఆదర్శంగా నిలవాలని అన్నారు. ప్రతి శాఖ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి నిర్దేశిత గడువులోగా ప్రతిపాదనలు సమర్పించాలని, శాఖల మధ్య సమన్వయంతో నాణ్యమైన జిల్లా, మండల పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు.

ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జెడ్పి సీఈవో నాగలక్ష్మి, జిల్లా ప్రణాళిక అధికారి సునీత, జిల్లా పంచాయతీ అధికారి అనూష, మిషన్ భగీరథ ఈ ఈ తిరుమలేష్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఖచ్చితమైన గణాంకాల సేకరణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలి



- జనగణన హ్యాండ్బుక్-2027 సమాచార సేకరణను గడువులోగా పూర్తి చేయాలి
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

ఉమ్మడి మహబూబ్ నగర్ ఆగస్టు 07 (మనం బ్యూరో): దేశ జనగణన కార్యక్రమంలో భాగంగా రూపొందిస్తున్న జిల్లా జనగణన హ్యాండ్బుక్ కోసం జిల్లాలోని ప్రతి గ్రామం, పట్టణానికి సంబంధించిన సామాజిక, ఆర్థిక, మౌలిక వసతులు, జనాభా వివరాలను నిర్దేశిత గడువులోగా సేకరించాలని తెలంగాణ రాష్ట్ర జనగణన కార్యకలాపాల డైరెక్టర్ (డీసీఓ) భారతి హొల్లికేరి ఆదేశించారు. శుక్రవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, జీహెచ్ఎంసీ కమిషనర్లు, జిల్లా అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో నాగర్కర్నూల్ జిల్లా వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుండి జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, అదనపు కలెక్టర్లు చెన్నయ్య, దేవ సహాయం, సిపిఓ సుజాత, సంబంధిత శాఖల అధికారులు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారతి హోళికేరి మాట్లాడుతూ, .. తెలంగాణలోని అన్ని జిల్లాలు,జీహెచ్ఎంసీలకు తొలి సరిగా జనగణన హ్యాండ్బుక్లు రూపొందిస్తున్నామని తెలిపారు. గ్రామ,పట్టణ స్థాయిలో సమగ్ర సమాచారాన్ని అందించే ఈ హ్యాండ్బుక్లు ప్రభుత్వ విధానాల రూపకల్పన, అభివృద్ధి ప్రణాళికలు, సంక్షేమ కార్యక్రమాల అమలుకు కీలక ఆధారంగా నిలుస్తాయని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో సమావేశమైన కలెక్టర్ మాట్లాడుతూ, .. తెలంగాణలో తొలిసారిగా ప్రతి జిల్లాకు ప్రత్యేకంగా జిల్లా జనగణన హ్యాండ్బుక్ రూపొందిస్తున్నామన్నారు. జిల్లాకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఒకే గ్రంథంలో పొందుపరచడం ద్వారా ప్రభుత్వ విధానాల రూపకల్పనకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

అందువల్ల అన్ని శాఖలు సమన్వయంతో సమాచారాన్ని ఖచ్చితత్వంతో సేకరించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఆన్లైన్ పోర్టల్లో నమోదు చేయాలని సూచించారు. జనగణన హ్యాండ్బుక్-2027కు సంబంధించిన సమాచారాన్ని ఖచ్చితత్వంతో సేకరించి నిర్ణీత గడువులోగా సమర్పించాలని ఆదేశించారు. సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.

# ఎన్సిసి ప్రవేశాలు పూర్తి



హనుమకొండ, ఆగస్టు 7(మనం న్యూస్): స్థానిక లాల్ బాహదూర్ కళాశాల క్రీడామైదానంలో 10 వ తెలంగాణ ఎన్సిసి బెటాలియన్ యూనిట్లో 2026- 27 ఎన్సిసి ప్రవేశాలు జరిగాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డిహెచ్ రావు తెలిపారు. ఎన్సిసి ఫోర్స్ పూర్తి చేసుకుంటే భారత ఆర్మీలో మంచి ఉద్యోగ అవకాశాలు ఉంటాయని దేశ సేవ కోసం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఎన్సిసి అడ్మిషన్ పొందిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. కఠోరమైన ఎంపిక విధానం లో జరిగిందని ప్రిన్సిపాల్ తెలిపారూ.

ఈ ఎంపికల కోసం 10 తెలంగాణ బెటాలియన్ జూనియర్ కమిషన్ ఆఫీసర్ మారుతి ముగ్ధమ్, పి.నిషాద్ ఎన్ సి ఓ మరియు కెప్టెన్ డాక్టర్ ఎం సదానందం, హరి లోకేష్, రవళి,గోకుల్, షాహీల్, యాసారు,నిఖిలూ, పాలుగోన్నారు.

# రోడ్లపై వరి నాట్లు

- వినూత్న రీతిలో నిరసన



భూపాలపల్లి ఆగస్టు 7 మనం న్యూస్: పాలకులు అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు శాంతియుత పద్ధతిలో వినూత్నంగా తమ నిరసనలు తెలిపారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో వ్యాపారస్తులు రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తూ, రోడ్డుపైనే వరి నాట్లు వేసి తమ నిరసనను తెలిపారు. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని వ్యాపారస్తులు ఆరోపించారు. భూపాలపల్లి అంబేద్కర్ సెంటర్లో ప్రతి వర్షానికి రోడ్లపై నీరు నిలిచిపోవడం సాధారణంగా మారిందని వ్యాపారస్తులు చెబుతున్నారు. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు రహదారులపై రోజుల తరబడి నిల్వ ఉండి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వ్యాపారస్తులు రోడ్డుపైనే వరి నాట్లు వేసి వినూత్న నిరసన చేపట్టారు. ఇది రహదారేనా? లేక వరి పొలమా? అని ప్రశ్నిస్తూ అధికారులు ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షపు నీరు నిల్వ ఉండటంతో దుకాణాలకు వినియోగదారులు రావడం తగ్గిపోయిందని, వ్యాపారాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని వారు తెలిపారు. ఎన్నిసార్లు మున్సిపల్ అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# జనగణన హ్యాండ్బుక్ నిర్ణీత గడువులోగా రూపొందించాలని



ఉమ్మడి మహబూబ్ నగర్ ఆగస్టు 07 (మనం బ్యూరో): డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్ ఆధ్వర్యంలో జనగణన హ్యాండ్బుక్-2027పై జిల్లా కలెక్టర్లు, జీహెచ్ఎంసీ కమిషనర్లు,జిల్లా అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జనగణన హ్యాండ్బుక్ నిర్వహణ, కార్యాచరణ అధికారుల బాధ్యతలు, అమలు షెడ్యూల్ పవర్పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,... తెలంగాణలోని అన్ని జిల్లాలు,జీహెచ్ఎంసీలకు తొలి సరిగా జనగణన హ్యాండ్బుక్లు రూపొందిస్తున్నామని తెలిపారు. గ్రామ,పట్టణ స్థాయిలో సమగ్ర సమాచారాన్ని అందించే ఈ హ్యాండ్బుక్లు ప్రభుత్వ విధానాల రూపకల్పన, అభివృద్ధి ప్రణాళికలు, సంక్షేమ కార్యక్రమాల అమలుకు కీలక ఆధారంగా నిలుస్తాయని పేర్కొన్నారు. జనగణన హ్యాండ్బుక్ రెండు భాగాలుగా ఉంటుందని తెలిపారు. పార్ట్-ఏలో గ్రామాలు, పట్టణాల మౌలిక సదుపాయాల వివరాలు,పార్ట్-బిలో జనగణన -2027 అనంతరం జనాభా గణాంకాలు పొందుపరుస్తారని వివరించారు. రెవెన్యూ గ్రామాలు, పట్టణాలకు సంబంధించిన వివరాలను 31 డిసెంబర్ 2025 నాటి సమాచారం ఆధారంగా నమోదు చేయాలని సూచించారు. డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్ రాష్ట్ర స్థాయిలో జిల్లా జనగణన హ్యాండ్బుక్ ప్రక్రియను పర్యవేక్షిస్తారని తెలిపారు. జిల్లా కలెక్టర్లు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని సమాచార సేకరణ,జిల్లా ప్రొఫైల్, మోటిఫ్ను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, సీపీఓ పాపయ్య, సంక్షేమ అధికారి సునంద, పరిశ్రమల శాఖ అధికారి రామ లింగేశ్వర్ గౌడ్, డీ.ఎం.హెచ్.ఓ సంధ్య కిరణ్మయి, ఉద్యాన శాఖ అధికారి రాజ్ కుమార్, పాల్గొన్నారు.

# ప్రజా నాయకుడు రాకేష్ రెడ్డిపై అక్రమ కేసులా?

- లావుడ్య రవి నాయక్



హనుమకొండ జిల్లా ఆగస్టు 7 న్యూస్: మన ప్రాంతం నుండి ప్రజా నాయకుడిగా ఎదిగి రాష్ట్రవ్యాప్తంగా మన పేరు నిలపెడుతున్న మన వరంగల్ బిడ్డపై రాజకీయ ప్రోద్బలంతో రాజకీయ విమర్శలు చేసే ముందు కాంగ్రెస్ నాయకులు ఒకసారి ఆత్మ విమర్శ చేసుకోవాలని తాజా మాజీ కార్పొరేటర్ లావుడ్య రవినాయక్ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు రేవంత్ రెడ్డి ఆదేశాలతోనే తమ కార్యకర్తలను రెచ్చగొట్టి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి పై కుట్రలు చేస్తున్నారన్నారు. మీడియాలో సమస్య తీవ్రతను వివరించడానికి అన్న మాటలకు కేసులు నమోదు చేయాలంటే రేవంత్ రెడ్డిపై ఇప్పటికే లక్ష కేసులు నమోదు చేయాలన్నారు. రాకేష్ రెడ్డి ఏది మాట్లాడినా ప్రజల శ్రేయస్సు కోసం మాత్రమే పరితపించి మాట్లాడుతారన్నారు.

# గద్వాల చేనేత బ్రాండ్ను కాపాడుకోవాలి

- చేనేత కార్మికుల సంక్షేమానికి పథకాల వర్తింపు
- చేనేత సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రత్యేక చర్యలు
- బ్యాంకుల ద్వారా కార్మికులకు రుణాలు ఇప్పించేందుకు కృషి
- గద్వాలలో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు
- పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుండి కలెక్టరేట్ వరకు చేనేత దినోత్సవ ర్యాలీ
- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



ఉమ్మడి మహబూబ్ నగర్ ఆగస్టు 07 (మనం బ్యూరో): పట్టు, కాటన్ సమ్మిళితం చేస్తూ గద్వాల చేనేత జరీ చీరలను నేస్తుంటారని, భౌగోళిక గుర్తింపును పొందిన ఈ బ్రాండ్ ను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని గద్వాల శాసనసభ్యుడు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో ఐడిఓసి సమావేశపు మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన చేనేత సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే సంఘాల ప్రతినిధులు బ్యాంకర్లతో సమావేశాలు నిర్వహించి కార్మికులకు రుణాలు ఇప్పించేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రవేశపెట్టిన వివిధ పథకాలను అర్హులైన కార్మికులందరూ సద్వినియోగం చేసుకునేలా జియో టాగ్ నెంబర్లను ఇప్పించడం జరుగుతుందన్నారు. భవిష్యత్తు తరాలు కూడా చేనేత వృత్తిలో ఆర్థిక పురోగతి సాధించేలా గద్వాల చేనేత రంగాన్ని పటిష్టం చేసేందుకు తన శాయశక్తుల కృషి చేస్తానన్నారు. వ్యవసాయం తర్వాత దేశంలో అత్యధిక జనాభా చేనేత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తోందన్నారు. స్వాతంత్ర ఉద్యమంలోనూ గాంధీజీ విదేశీ వస్త్రాలను బహిష్కరించి స్వదేశీ చేనేత రంగాన్ని బలోపేతం చేసేందుకు కృషిచేసిన విషయాన్ని గుర్తు చేశారు. గద్వాల సంస్థానాధీశులు వందేళ్ళ కిందటే ఇక్కడి కొంతమంది చేనేత కళాకారులను బెనారస్ పంపించి వృత్తిలో నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు ప్రోత్సహించారన్నారు. అదనపు కలెక్టర్ నర్సింగరావు మాట్లాడుతూ... నేతన్నకు భరోసా, చేయూత, త్రిఫ్ట్ ఫండ్, భీమా, తదితర పథకాలతో ప్రభుత్వం చేనేత కార్మికుల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు.

నూతనంగా ఎన్నికైన చేనేత సహకార సంఘాలు బాధ్యతగా పనిచేసి ఇక్కడి కార్మికుల సంక్షేమానికి పాటు పడాల్సిన అవసరం ఉందన్నారు.

# వాడివేడిగా సర్వసభ్య సమావేశం




దుగ్గొండి. ఆగస్టు 7 మనం ప్రతినిధి: దుగ్గొండి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ డాక్టర్ లెక్కల అరుంధతి ఆధ్వర్యంలో, మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి శ్రీనివాస్రావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రామ్ రెడ్డి హాజరయ్యారు.సమావేశంలో ముందు నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్రెడ్డి మృతి పట్ల సభ్యులు సంతాపం వ్యక్తం చేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలను వచ్చే రెండు నెలల పాటు మరింత కట్టుదిట్టంగా అమలు చేయాలని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు జడ్పీ సీఈఓ సూచించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, ఇంకుడు గుంతలను వినియోగంలోకి తీసుకురావాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఎరువుల అక్రమ విక్రయాలపై ప్రశ్నలు.. డీఏపీ ఎరువులను బ్లాక్ మార్కెట్లో విక్రయించడం, యూరియాకు ఇతర పురుగుమందులను తప్పనిసరిగా లింక్ చేయడం వంటి అంశాలను బొబ్బరోనిపల్లి సర్పంచ్ శెంకషు కమలాకర్ సమావేశంలో ప్రస్తావించారు. దీనిపై వ్యవసాయ శాఖ అధికారి గాజుల శ్యామ్ స్పందిస్తూ, అక్రమాలకు పాల్పడుతున్న ఎరువుల దుకాణాల వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అయితే, మండల వ్యవసాయ అధికారిగా ప్రత్యక్ష చర్యలు చేపట్టకుండా కేవలం ఉన్నతాధికారులకు నివేదిస్తానని చెప్పడంపై పలువురు ప్రజా ప్రతినిధులు, రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

# విద్యుత్ షాక్తో మహిళ మృతి

పర్వతగిరి, ఆగస్టు 7: (మనం న్యూస్ ): పర్వతగిరి మండలం, తురకల సోమవారం గ్రామంలో శుక్రవారం విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన షేక్ సలీమా (సుమారు 35) ఈరోజు మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంటి వద్ద విద్యుత్ హీటర్ను తొలగిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్కు గురైనట్లు సమాచారం.

కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు తెలిసింది.

# ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



పరకాల, ఆగస్టు 7 (మనం న్యూస్ ): ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్రెడ్డి అన్నారు. పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పరకాల టౌన్, పరకాల, నడికూడ, దామెర, ఆత్మకూరు మండలాల పరిధిలోని 56 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కులను టీపీసీసీ మాజీ ఉపాధ్యక్షులు దొమ్మాటి సాంబయ్యతో కలిసి రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్నామని అన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలకులు ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని తెలిపారు.

# సైబర్ క్రైమ్లపై విద్యార్థులకు అవగాహన సదస్సు

పరకాల, ఆగస్టు 7 (మనం న్యూస్ ): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పరకాల ఎస్ఐ సిహెచ్. రఘుపతి సూచించారు. విద్యార్థుల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించేందుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సురక్షా తిరంగా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సైబర్ క్రైమ్ ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పరకాల ఎస్ఐ రఘుపతి మాట్లాడుతూ నేటి డిజిటల్ యగంలో సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా డిజిటల్ అరెస్ట్, నకిలీ లింకులు, ఓటీపీ మోసాలు, సోషల్ మీడియా మోసాలు, ఆన్లైన్ బ్యాంకింగ్ మోసాలు వంటి వివిధ రకాల సైబర్ నేరాల గురించి విద్యార్థులకు సమగ్రంగా వివరించారు. వ్యక్తిగత బ్యాంకు వివరాలు, ఓటీపీలు ఎవరికీ వెల్లడించరాదని సూచించారు. ఏదైనా సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నంబర్కు ఫిర్యాదు చేయాలని, వెంటనే పోలీసులను సంప్రదించాలని ఎస్ఐఐ సూచించారు. అనం తరం కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి.సంతోష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు డిజిటల్ సాంకేతికతను బాధ్యతాయుతంగా వినియోగించాలని, సైబర్ నేరాలపై పూర్తి అవగాహన కలిగి ఉండటం ద్వారా మోసాలను నివారించవచ్చని తెలిపారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల్లో చైతన్యం పెంపొందించడంలో ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మంజుల, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 15 నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



- పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి
- హనుమకొండ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎన్. రవి

హనుమకొండ, ఆగస్టు 7 (మనం ప్రతినిధి ): జిల్లాలో ఈ నెల 15వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ప్రారంభం కానుందని హనుమకొండ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎన్. రవి తెలిపారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్లోని జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయానికి చేరుకున్న స్మార్ట్ రేషన్ కార్డులను ఇన్చార్జి కలెక్టర్ పరిశీలించారు. అనంతరం జిల్లాలో కార్డుల పంపిణీకి చేపట్టాల్సిన ఏర్పాట్లపై పౌరసరఫరాల శాఖ అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని 14 మండలాలకు మొత్తం 2,56,838 స్మార్ట్ రేషన్ కార్డులు అందినట్లు అధికారులు తెలిపారు. మండలాల వారీగా ఆత్మకూరు 11,641, భీమదేవరపల్లి 15,783, దామెర 9,264, ధర్మసాగర్ 17,069, ఎల్కతుర్తి 14,055, హనుమకొండ 44,283, హసన్పర్తి 26,220, ఐనవోలు 15,389, కమలాపూర్ 22,095, కాజీపేట 30,959, నడికూడ 11,658, పరకాల 14,714, శాయంపేట 14,884, వేలేరు 8,824 కార్డులు వచ్చినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి కలెక్టర్ రవి మాట్లాడుతూ, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి ముందస్తు ప్రణాళికతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రేషన్ షాపు పరిధిలోని లబ్ధిదారులకు కార్డులు సులభంగా, పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పంపిణీ ప్రక్రియను సమన్వయం చేసేందుకు ప్రతి మండలానికి నోడల్ అధికారులను నియమించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మహేందర్, పౌరసరఫరాల శాఖ డీటీలు, సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలో పశుసంవర్ధక రంగం అభివృద్ధికి కార్యాచరణ చేపట్టాలి



- పశుపోషక రైతుల ఆధార్ నమోదు వంద శాతం పూర్తి చేయాలి
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

ఉమ్మడి మహబూబ్ నగర్, ఆగస్టు 07 (మనం బ్యూరో): నాగర్ కర్నూల్ జిల్లాలో పశుసంవర్ధక రంగాన్ని మరింత బలోపేతం చేసి పశుపోషక రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పశుసంవర్ధక, పశుసంక్షేమ పథకాలు జిల్లాలోని ప్రతి అర్హులైన పశుపోషక రైతుకు పారదర్శకంగా, సకాలంలో అందేలా క్షేత్రస్థాయిలో ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా పశుసంవర్ధక, పశువైద్య శాఖ పనితీరుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులతో విస్తృతంగా సమీక్ష నిర్వహించారు. శాఖ అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాల పురోగతిని పరిశీలించి, మండలాల వారీగా అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని పశుసంపద గణాంకాలు, పశుపోషణ పరిస్థితులు, పశువైద్యశాలల పనితీరు, మొబైల్ పశువైద్య సేవలు, పశువులకు అందిస్తున్న వ్యాధి నిరోధక టీకాలు, కృత్రిమ గర్భధారణ కార్యక్రమం, పాల ఉత్పత్తి పెంపు, గొర్రెలు, మేకలు, గేదెలు, ఆవుల పెంపకం, పశుగ్రాసం లభ్యత, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. చెన్నయ్య, దేవసహాయం, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జ్ఞానశేఖర్, జిల్లా పశువైద్యాధికారులు, మండల పశువైద్యాధికారులు, శాఖ అధికారులు, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో వసతులు కల్పించాలి

- హనుమకొండ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎన్. రవి

హనుమకొండ, ఆగస్టు 7(మనం ప్రతినిధి ): కమలాపూర్ మండలంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని హనుమకొండ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎన్. రవి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూడూరు, కమలాపూర్, మర్రిపల్లిగూడెం గ్రామాలలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను జిల్లా ఇన్చార్జి కలెక్టర్ పరిశీలించారు. ఇళ్ల సముదాయంలో ప్రస్తుతం ఉన్న వసతులు, ఇళ్ల పరిస్థితిని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఇళ్ల ప్రారంభోత్సవం, అర్హులైన లబ్ధిదారులకు కేటాయింపు, ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు ఇన్చార్జి కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి కలెక్టర్ రవి మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు ర్యాండమైజేషన్ ద్వారా ఇళ్ల కేటాయింపు చేయనున్నట్లు తెలిపారు. గూడూరు, కమలాపూర్, మర్రిపల్లిగూడెం గ్రామాల్లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించనున్న దృష్ట్యా సదుపాయాలను వేగవంతంగా కల్పించాలని గృహ నిర్మాణ, ఆర్ అండ్ బీ, ఎంపీడీవోలను ఆదేశించారు. గూడూరులో 50, మర్రిపల్లి గూడెంలో 50, కమలాపూర్ లో 302 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఇళ్ల సముదాయంలో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలన్నారు. ఈ సందర్భంగా గూడూరు, కమలాపూర్, మర్రిపల్లిగూడెం గ్రామాల సర్పంచులు బండి వనజ, పబ్బు సతీష్, కదురు కవిత, కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఝాన్సీ, గృహ నిర్మాణ శాఖ పిడి సిద్ధార్థ నాయక్, ఆర్ అండ్ బి ఈఈ దేవిక,తహసిల్దార్ సురేష్ కుమార్, ఎంపీడీవో గుండె బాబు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# భారత విద్యార్థుల అమెరికా డ్రీమ్‌కు కత్తెర..

## 62 శాతం తగ్గిన వీసా అనుమతులు




వాషింగ్టన్, ఆగస్టు 7: అమెరికాలో చదువుకోవాలని కలలు కంటున్న భారతీయ విద్యార్థులకు నిరాశే ఎదురవుతోంది. 2025 బిజీ అడ్మిషన్ సీజన్‌లో మన విద్యార్థులకు వీసా అనుమతులు గణనీయంగా తగ్గాయి. చైనాతో పోలిస్తే భారతీయులకు స్టూడెంట్ వీసా నిరాకరణలు దాదాపు రెట్టింపుగా ఉండటం గమనార్హం. ఈ మేరకు అమెరికాలోని సెంటర్ ఫర్ ఇమిగ్రేషన్ స్టడీస్ (సీఐఎస్) అధ్యయనం వెల్లడించింది. 2025 మే-ఆగస్టు మధ్యలో అమెరికా కాన్సులేట్‌లు భారతీయ విద్యార్థులకు 22,149 ఎఫ్-1 స్టూడెంట్ వీసాలు జారీ చేశాయి. 2024లోని ఇదే పీరియడ్‌లో మన వాళ్లకు 58,694 విద్యార్థి వీసాలు జారీ అవ్వగా.. గతేడాది ఆ సంఖ్య 62 శాతం మేర తగ్గింది. సాధారణంగా ఏటా ఈ సీజన్‌లో భారతీయులకు సగటున 50వేల పైనే విద్యార్థి వీసాలు వస్తాయి. కానీ, గతేడాది ఈ సంఖ్యలో భారీ తగ్గుదల కన్పించడం ఆందోళన కలిగిస్తోంది.

అదే సమయంలో చైనా విద్యార్థులకు వీసా అనుమతులు 34 శాతం తగ్గాయి. 2024లో చైనీయులకు 61,075 విద్యార్థి వీసాలు ఇవ్వగా గతేడాది ఆ సంఖ్య 40,034గా ఉంది. మే-ఆగస్టు పీరియడ్‌ను విద్యార్థి వీసాలకు అత్యంత కీలకమైన సమయంగా భావిస్తారు. అమెరికాలో విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు ఈ సీజన్‌లో అంతర్జాతీయ విద్యార్థులు వీసాల కోసం దరఖాస్తులు చేసుకుంటారు. మనకు విద్యార్థి వీసాల అనుమతులు భారీగా తగ్గినప్పటికీ.. అమెరికా విద్యాసంస్థల్లో నమోదు చేసుకుంటున్న విదేశీ విద్యార్థుల్లో అత్యధికులు భారతీయులే ఉంటున్నారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ గణాంకాల ప్రకారం.. 2024-25 విద్యా సంవత్సరంలో 3,63,019 మంది భారత విద్యార్థులు యూఎస్ కాలేజీలు, యూనివర్సిటీల్లో చేరారు. ఇదే సమయంలో చైనా నుంచి 2,65,919 మంది గతేడాది అమెరికాకు చదువుకునేందుకు వచ్చారని అధ్యయనం తెలిపింది.

ట్రంప్ రెండో దఫా అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి అమెరికాలో వలస విధానాలు కఠినతరం చేసిన సంగతి తెలిసిందే. దీంతో విదేశీ విద్యార్థులు అగ్రరాజ్యంలో చదువుకుని, కెరీర్‌ను నిర్మించుకోవడం కష్టంగా మారుతోంది. ఇప్పటికే సోషల్ వెట్టింగ్, ఇతరత్రా నిబంధనలతో విద్యార్థులు సతమతమవుతోన్న వేళ.. ఇప్పుడు వీసా అనుమతులను తగ్గించడం మరింత భయపెడుతోంది. మరోవైపు, ఎఫ్-1 వీసాదారుల నివాస అనుమతిపై కూడా ట్రంప్ సర్కారు పరిమితి విధించింది. గతంలో ఎఫ్1 వీసాలపై వచ్చిన విద్యార్థులు తమ కోర్సు పూర్తయ్యేంత వరకూ 'డ్యూరేషన్ ఆఫ్ స్టేటస్' కింద ఉండేవారు. ఇప్పుడు ఈ నిబంధనను ఎత్తివేసి నిర్దిష్ట కాలపరిమితిని అమలు చేసేందుకు సిద్ధమైంది. కొత్త నిబంధనల ప్రకారం.. నాలుగేళ్లకు మించి అమెరికాలో ఉండాలంటే విదేశీ విద్యార్థులు మళ్లీ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. సెప్టెంబరులో ఈ మార్పు అమల్లోకి రానుంది. మరోవైపు, విదేశీ జర్నలిస్టులకు వీసా నిబంధనలను కఠినతరం చేసేందుకు అమెరికా సిద్ధమైంది. వీరికి కూడా సోషల్ మీడియా వెట్టింగ్ విధానాన్ని అమలు చేసే అంశాన్ని పరిశీలిస్తోంది. వీసా కోసం దరఖాస్తు చేసుకునే పాత్రికేయులు తమ సామాజిక మాధ్యమ ఖాతాల సెట్టింగ్‌లను 'పబ్లిక్'లోకి మార్చుకోవాల్సి ఉంటుందని అగ్రరాజ్య విదేశాంగ శాఖ వెల్లడించింది. త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

## చంద్రుడిపై కూలిన స్పేస్‌ఎక్స్ రాకెట్ శకలం..

### దృశ్యాలను రికార్డు చేసిన కొరియా శాటిలైట్



వాషింగ్టన్, ఆగస్టు 7: స్పేస్ ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్ శకలం ఒకటి చంద్రుడి ఉపరితలంపై క్రాష్ అయింది. ఆ శకలం చంద్రుడిని ఢీకొట్టడానికి ముందు, తర్వాతి దృశ్యాలను దక్షిణ కొరియా శాటిలైట్ చిత్రీకరించింది.

ఫాల్కన్ 9 శకలం ప్రమాదవశాత్తూ చంద్రుడిని ఢీకొట్టిన సమయంలో కొరియాకు చెందిన దనూరి స్పేస్ క్రాఫ్ట్ ప్రభావిత ప్రాంతం మీదుగా ప్రయాణించింది. చంద్రుడి కక్ష్య నుంచి ఫొటోలు తీసింది. దక్షిణకొరియా అంతరిక్ష సంస్థ తాజాగా ఆ ఫొటోలను విడుదల చేసింది. ఆ శకలం ఢీకొట్టినప్పుడు ఒక గొయ్యి ఏర్పడింది. దుమ్ము, రాళ్లను వెదజల్లింది. క్రాష్‌కు ముందు చిత్రాలతో పోల్చిప్పుడు ఆ ప్రాంతం నల్లగా కనిపిస్తోంది. దక్షిణ కొరియా తొలి మూన్ మిషన్ 'దనూరి'ని 2022 ఆగస్టులో ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ రాకెట్ నుంచే లాంచ్ చేశారు.

#### స్పేస్ వాక్ చేసిన నాసా వ్యోమగాములు..

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం వెలుపల నాసా వ్యోమగాములు అనిల్ మేనన్ (భారత సంతతి), జెస్సికా మీర్ స్పేస్ వాక్ చేశారు. పవర్ ఛానల్ కోసం ఒక మాడిఫికేషన్ కిట్‌ను అమర్చేందుకు ఈ వాక్ చేశారు. మేనన్‌కు ఇది తొలి స్పేస్ వాక్. రష్యా అంతరిక్ష సంస్థ రోస్‌కో స్మోస్‌కు చెందిన సోయుజ్ ఎంఎస్-29 వ్యోమనౌకలో ఇద్దరు రష్యన్ వ్యోమగాములతో కలిసి అనిల్ మేనన్ ఐఎస్ఎస్‌లోకి ప్రవేశించారు. ఈ బృందం ఎనిమిది నెలల పాటు అంతరిక్ష కేంద్రంలో పరిశోధనలు నిర్వహించి, 2027 ఏప్రిల్లో భూమికి తిరిగి రానుంది.

## ఇమ్మిగ్రేషన్ దరఖాస్తు అసంపూర్ణంగా ఉంటే తిరస్కరణ

### అధికారులకు విచక్షణాధికారాన్ని పునరుద్ధరించిన అమెరికా

వాషింగ్టన్, ఆగస్టు 7: వీసా, గ్రీన్‌కార్డు వంటి ఇమ్మిగ్రేషన్ ప్రయోజనాలు కోరుతూ వచ్చే దరఖాస్తులకు సంబంధించి అమెరికా తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. అర్హతను నిర్ధారించేందుకు అవసరమైన పత్రాలను జోడించని, అసంపూర్ణ దరఖాస్తులను అదనపు వివరాలు కోరకుండానే తిరస్కరించే విచక్షణాధికారాన్ని అధికారులకు పునరుద్ధరించింది. అమెరికా పౌరసత్వం, ఇమ్మిగ్రేషన్ సేవల సంస్థ (యూఎస్సీఐఎస్) ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. నూతన విధానం తక్షణమే అమల్లోకి వచ్చినట్లు తెలిపింది. కొత్తగా వచ్చే దరఖాస్తులతోపాటు ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నవాటికీ ఇది వర్తిస్తుందని స్పష్టం చేసింది. పాత విధానం ప్రకారం- ఇమ్మిగ్రేషన్ స్టేటస్ మార్పు,




పొడిగింపు, గ్రీన్ కార్డులు, వీసా వంటి ప్రయోజనాల కోసం వచ్చే దరఖాస్తులు అసంపూర్తిగా ఉన్నా అవసరమైన పత్రాలు వాటిలో లేకపోయినా.. చాలా సందర్భాల్లో దరఖాస్తుదారులకు యూఎస్సీఐఎస్ అధికారులు 'రిక్వెస్ట్ ఫర్ ఎవిడెన్స్ (ఆర్ఎఫ్ఈ)' లేదా 'నోటీస్ ఆఫ్ ఇంటెంట్ టు డినై (ఎన్వోఐడీ)' నోటీసులు జారీ చేసేవారు.

## స్కూల్లో విద్యార్థి కాల్పులు..

# ఏడుగురి మృతి



బ్యాంకాక్, ఆగస్టు 7: థాయ్‌లాండ్‌లోని ఓ స్కూల్లో కాల్పులు కలకలం సృష్టించాయి. నొంతగురి ప్రావిన్స్ బాంగ్ క్రువాయ్ జిల్లాలోని డెబ్సిరిన్ స్కూల్లో తొమ్మిదో తరగతి చదివే విద్యార్థి తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులపై కాల్పులకు తెగబడ్డాడు. ఈ ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోగా 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ముగ్గురు టీచర్లు, ముగ్గురు విద్యార్థులు ఉన్నారు. కాల్పులు జరిపిన విద్యార్థి కూడా తనను తాను కాల్చుకుని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై థాయ్ ఉప ప్రధాని అనుతిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని.. స్కూల్‌పై దాడికి గల కారణాలు తెలుసుకోవాలని అధికారులను ఆదేశించారు.

#### ఇంట్లోవారిని హత్య చేసి..

కాల్పులకు పాల్పడ్డ విద్యార్థి స్కూల్‌కు వెళ్లడానికి ముందు ఇంట్లో తన బామ్మ, తాతలను కూడా కాల్చి చంపినట్లు థాయ్‌లాండ్ ప్రజారోగ్య మంత్రి తెలిపారు. కాల్పులకు ఉపయోగించిన 9 ఎంఎం హ్యాండ్‌గన్ అతడి తాతకు చెందినదిగా గుర్తించామన్నారు. విద్యార్థి తాత కూడా గతంలో ఉపాధ్యాయుడిగా పని చేసినట్లు తెలిపారు

## యాక్సిడెంట్ చేసి చంపెయ్..

# లేకపోతే నేను ఛస్తా

### మొగుణ్ని చంపమంటూ ప్రియుడికి మెసేజ్

### బయటపడ్డ భార్య చాటింగ్..మెసేజ్‌లు చూసి భర్త షాక్.. పోలీసులకు ఫిర్యాదు

**తనతో ఏడడుగులు నడిచి జీవితాంతం తోడుంటానని ప్రమాణం చేసిన జీవిత భాగస్వామే తన ప్రాణాలకు ముప్పుగా మారిందని ఏ భర్త ఊహించగలడు. ఎంతటీ నీచ, దుర్మార్గపు భర్తకు కూడా ఇలాంటి ఆలోచన రాదు? చేయరు కూడా. అవును ఇప్పడు అలాంటి ఘటన ఒకటి ఓ భర్తను షాక్ గురి చేసిన ఘటన తెలంగాణలో చోటు చేసుకుంది. తను మనువాడిన భర్తనే అత్యంత క్రూరంగా హత్య చేయాలన్న ఆ ఇల్లాలి ప్లాన్ భేడిసీ కోట్టగా భర్త ఫిర్యాదుతో బయటవడిన సమ సమాజమే అత్యంత సిగ్గిపడేలా చేసిన ఈ దుర్మార్గపు ఘటన మహబూబాబాద్ జిల్లాలో కలకలం రేపింది.**

హైదరాబాద్, మనం ప్రతినిధి : కట్టుకున్న భర్త హత్యకు అత్యంత దారుణంగా ప్లాన్ చేసిన భార్య ఊదంతం యావత్ లోకాన్ని షాక్ గురి చే(సింది)స్తొంది. గత కొంత కాలంగా అక్రమ సంబధాలు ముసుగులో కట్టుకున్న వాడినే కడతెర్చుతున్న ఘటనలు ఇటీవల బాగా పేరిగాయి. తాజాగా తెలంగాణలో షేక్ చేస్తున్న ఈ ఘటన భర్త అప్రమత్తతే అతని ప్రాణాలు నలిబెట్టింది. తన భార్య మొబైల్‌లో కనిపించిన వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ మెస్సెజ్‌లు చూసిన తర్వాత తనను హత్య చేయించే కుట్ర నడుస్తోందని అనుమానించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామానికి చెందిన గాదే రాజేశ్వరరావు ప్రస్తుతం ఖమ్మంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఉద్యోగం చేస్తున్నాడు. 2016లో సూర్యాపేట జిల్లా రాఘవాపురానికి చెందిన యువతిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అతను అందించిన చాటింగ్ వివరాల ఆధారంగా పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గత నెల 27న మధ్యాహ్నం భోజనం కోసం ఇంటికి వెళ్లిన సమయంలో భార్య మరో వ్యక్తితో చనువుగా ఉండటాన్ని గమనించినట్లు రాజేశ్వరరావు ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై పెద్దల సమక్షంలో మాట్లాడాలని నిర్ణయించి మరుసటి రోజు తన అన్నను తీసుకొచ్చేందుకు వెళ్లాడు. భార్యతో కనిపించిన వ్యక్తి ఆ సమయంలో తనను వెంబడించినట్లు గుర్తించి పట్టుకునే ప్రయత్నం చేయగా అతను తప్పించుకుని వెళ్లిపోయాడని తెలిపాడు.

అనుమానం మరింత పెరగడంతో భార్య మొబైల్‌ను పరిశీలించానని, అందులో ఉన్న చాటింగ్ చూసి షాక్‌కు గురయ్యానని రాజేశ్వరరావు చెప్పాడు. ఇంట్లో చంపొద్దని, బయట యాక్సిడెంగ్‌గా కనిపించేలా హత్య చేయాలని భార్య, ఆమెకు పరిచయం ఉన్న పురిమెట్ల సైదులుకు పలుమార్లు మెసేజ్‌లు పంపినట్లు ఆరోపించాడు. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లో జరిగిన సంభాషణల స్క్రీన్ షాట్‌లను కూడా పోలీసులకు సమర్పించాడు. భార్య, ఆమెతో సన్నిహితంగా ఉన్న వ్యక్తి కలిసి తనను హత్య చేసేందుకు కుట్ర పన్నారని ఆరోపిస్తూ ఈ నెల 1న డోర్నకల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. తాజాగా బాధితుడు ఖమ్మం రూరల్ పోలీసులను మరోసారి కలిసి పూర్తి వివరాలు అందించాడు. ఫిర్యాదు అందిందని, కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడతామని పోలీసులు తెలిపారు.

## భూమ్మీద లేని సరికొత్త వైరస్‌ల సృష్టికి ఏఐ..!



కాలిఫోర్నియా, ఆగస్టు 7: కృత్రిమ మేధ అన్ని రంగాల్లోకి వేగంగా విస్తరిస్తోంది. చివరకు ఈ ప్రకృతిలో లేని వైరస్‌లను సృష్టించేందుకు కూడా శాస్త్రవేత్తలు ఏఐని వాడుతున్నారు. ఇందుకోసం స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ, ఆర్క్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన పరిశోధకులు జనరేటివ్ ఏఐ మోడల్ ఈవోను ఉపయోగించారు. వైరస్ జన్యుక్రమాన్ని కొత్తగా రాసుకున్నారు. తర్వాత ఆ డీఎన్ఏను ల్యాబ్‌లో సింథసైజ్ చేశారు. ఏఐ డిజైన్ చేసిన వైరస్‌లలో 16 పునరుత్పత్తి చెందుతున్నాయని గుర్తించామని చెప్పారు. అవి ఈ-కోలి బ్యాక్టీరియాను చంపుతున్నాయని పేర్కొన్నారు. ఇది సింథటిక్ బయోలజీలో కీలక ముందడుగుగా అభివర్ణించారు. శాస్త్రవేత్తలు గుర్తించిన అంశాలు 'సైన్స్' జర్నల్లో ప్రచురితమయ్యాయి. ఈ వైరస్ బ్యాక్టీరియాకు మాత్రమే సోకుతుందని, మనుషులకు ఎలాంటి హాని కలిగించదని చెప్తున్నారు. ఈవో ఒక లార్జ్ లాంగ్వేజ్ మోడల్. ఇది డీఎన్ఏలోని ప్యాటర్న్‌ను నేర్చుకొని, వాటిని విశ్లేషిస్తుంది. దీనికి లక్షల సంఖ్యలో జీవుల జన్యుక్రమాలపై శిక్షణ ఇచ్చారని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

సింథటిక్ బయోలజీ రంగంలో ఇది కీలక విషయమే అయినప్పటికీ.. ఈ సాంకేతికతను మనుషులకు సోకే వైరస్ కోసం ఉపయోగిస్తే ఎలా అనే ఆందోళన వ్యక్తమవుతోంది. సింథటిక్ బయాలజీ అంటే జీవశాస్త్రానికి ఇంజినీరింగ్‌ను మిళితం చేస్తారు. మానవాళికి ఉపయోగపడేలా కణాలను రీప్రోగ్రామ్ చేయడానికి ఈ విధానం ఉపయోగపడుతుంది.

## విడాకుల కేసు వెనక్కి తీసుకున్న తమిళనాడు సీఎం విజయ్ సతీమణి



చెన్నై, ఆగస్టు 7: తమిళనాడు సీఎం జోసెఫ్ విజయ్ విడాకుల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. విజయ్ నుంచి విడాకులు కోరుతూ కోర్టులో వేసిన పిటిషన్ను ఆయన భార్య సంగీత వెనక్కి తీసుకున్నారు. నేడు ఈ కేసు విచారణకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరైన సంగీత.. తన కేసును కొనసాగించకపోవడానికి గల కారణాలను న్యాయస్థానానికి వివరించారు. దీంతో ఈ కేసును ముగిస్తున్నట్లు చెంగల్పట్టు జిల్లా కోర్టు ప్రకటించింది.

విజయ్పై పలు ఆరోపణలు చేస్తూ ఆయన సతీమణి సంగీత విడాకులు కోరుతూ ఫిబ్రవరిలో చెంగల్పట్టు కోర్టులో పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిష్న విచారణకు ఇరువురూ హాజరు కాకపోవడంతో కోర్టు పలుమార్లు విచారణను వాయిదా వేసింది. ఆ సందర్భాల్లో వారి తరఫు న్యాయవాదులు హాజరై.. విచారణకు ప్రత్యక్షంగా హాజరుకావడంలో నెలకొన్న ఇబ్బందులను కోర్టుకు వివరించారు. దీంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ జరుగుతూ వచ్చింది. విజయ్కు 1999 ఆగస్టు 25న సంగీతతో వివాహం జరగ్గా.. వారికి కుమారుడు, కుమార్తె ఉన్న విషయం తెలిసిందే.

## ఈ నెల 16న జిల్లాకు ముఖ్యమంత్రి రాక

### అభివృద్ధి పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలి: మంత్రి దనసరి సీతక్క

ములుగు, ఆగస్టు 7 ,మనం ప్రతినిధిః రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఈ నెల 16న ములుగు జిల్లాలో పర్యటించనున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న పంచాయతీ రాజ్ హమ్ రోడ్ల పనుల కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఇక్కడి నుండే శ్రీకారం చుట్ట నున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అన్నారు.

జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రానున్న సందర్భంగా మంత్రి సీతక్క శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ బోర్కేడే హేమంత్ సహదేవురావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా లతో కలిసి అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ముఖ్యమంత్రి హైదరాబాదు నుండి నేరుగా మేడారం చేరుకొని వన దేవతలను దర్శించుకొని, అనంతరం ములుగు చేరుకొని



పైలాన్ ప్రారంభించడమే కాకుండా ములుగు మండలం ఇంచర్ల గ్రామ శివారులో ఏడు కోట్ల రూపాయలతో నిర్మించిన ఇందిరమ్మ మహిళా శక్తి భవనాన్ని వర్చువల్, నూతన కలెక్టరేట్ సముదాయ భవనాన్ని ప్రారంభిస్తారని వెల్లడించారు.

జిల్లా లో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్న అభివృద్ధి పనుల వివరాల జాబితాను అన్ని శాఖల అధికారులు ఈ నెల 10వ తేదీ వరకు సిద్ధం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన పూర్తి షెడ్యూల్ ఈ నెల 12న వెల్లడించడం జరుగుతుందని తెలిపారు. సీఎం పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని అన్నారు. మేడారం పరిసర ప్రాంతాల్లో రహదారులు ఆక్రమించిన వ్యాపారాలు చేస్తున్న వారికి జరిమానా విధించాలని, వ్యాపారాలు ఏర్పాటు చేయకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ రఘు, రాష్ట్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ భగవాన్ రెడ్డి, ఆర్డీఓ కృష్ణవేణి, డిఆర్ఓ రవికుమార్, ఎస్ డి సి ప్రతాప్, డిప్యూటీ ట్రేని కలెక్టర్ కుషిల్ వంశీ, అన్ని శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు అత్యున్నత వైద్య సేవలు అందాలి

- సిద్దిపేట వేయి పడకల ఆసుపత్రికి త్వరలో ఎమ్మారై సౌకర్యం
- ఆరోగ్య కేంద్రాల్లో పాము, కుక్క కాటు వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచాలి
- (టీ జీ ఎం ఎస్ ఐ డి సి) మేనేజింగ్ డైరెక్టర్ గౌరవ్ ఉప్పల్

సిద్దిపేట, ఆగస్టు 7 (మనం ప్రతినిధి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు అన్ని రకాల వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉండాలని తెలంగాణ మెడికల్ సర్వీస్ అండ్ ఇంప్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గౌరవ్ ఉప్పల్ పేర్కొన్నారు. సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, వెయ్యి పడకల ఆసుపత్రి తోపాటు కుకునూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంకా కేంద్ర ఔషధ గిడ్డంగిని పరిశీలించి ఔషధ నీల్వలపై అధికారులతో చర్చించారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులతో, వారి వెంట ఉన్న కుటుంబ సభ్యులు, బంధువులతో ఆస్పత్రులు అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. కేంద్ర ఔషధ గిడ్డంగిలో ఔషధ నిల్వలను పరిశీలిస్తూ ఫార్మసిస్టులతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మందుల సరఫరా విషయాన్ని అడిగి తెలుసుకుని సూచనలు చేశారు. కుక్కునూరు పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, వైద్య సిబ్బందితో మాట్లాడి ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. ఔషధ నిల్వ, గదులను పరిశీలించి, మందుల నిల్వలు తగినంతగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో పాముకాటు, కుక్కకాటుకు సంబంధించిన వ్యాక్సిన్ అందుబాటులో ఉంచుకోవాలని, సకాలంలో నాణ్యమైన వైద్య సేవలను ప్రజలకు అందించాలని సూచించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులను ప్రేమపూర్వకంగా ఆహ్వానించి, వారికొచ్చిన ఆరోగ్య సమస్యలను ఆరా తీయాలని, అవసరం ఉన్నవారికి అన్ని రకాల పరీక్షలు నిర్వహించాలని, రోగులకు సకాలంలో చికిత్సతో పాటు, రోగి కేంద్రిత సేవలను సమర్థవంతంగా అందించాలన్నారు. మందుల నిర్వహణను పారదర్శకంగా చేపట్టాలని, కాలం చెల్లిన మందులను ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

సిద్దిపేట వెయ్యి పడకల ఆసుపత్రి సందర్శన లో భాగంగా ఆసుపత్రిలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని తొందర్లో ఎమ్మారై సౌకర్యాన్ని కూడా కల్పిస్తామన్నారు. అవసరమైన ఇన్ఫ్రా స్ట్రక్చర్ తో



సిద్ధం చేసుకోవాలని అధికారులను సిబ్బందిని కోరారు. సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సందర్శనలో అక్కడినుండి ఐసీయూ, గైనిక్ ఆపరేషన్ గదిలో కొంత డ్యామేజ్ ఉన్నట్లు వైద్యులు తెలిపారు. అనంతరం రోగుల వద్దకు వెళ్లి వారితో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకొని, వచ్చిన బంధువులకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో డా సంగీత, జి జి హెచ్ సూపర్ ఇంటెండెంట్, డా కిషోర్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ చందర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ సదానందం,సిసి గౌస్ పాషా, ఫార్మసీ ఆఫీసర్లు మసుద్ అలీ, వెంకటేశ్వరరావు, వైద్యాధికారి, ప్రేమ్ సాగర్,మరియు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన ఈడి



**సూర్యాపేట, ఆగస్టు 07 (మనం ప్రతినిధి)** జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి డీఎస్సీ డివో. గా ఈడి ఎస్సీ కార్పొరేషన్ అధికారి గా అదనపు బాధ్యతలు స్వీకరించిన కె.లత సూర్యాపేట జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో సూపరింటెండెంట్గా సేవలందిస్తు. ఈడి ఎస్సీ కార్పొరేషన్ అధికారి గా అదనపు బాధ్యతలను స్వీకరిస్తు జిల్లా కలెక్టర్ ని అదనపు జిల్లా కలెక్టర్ ని మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు చెప్పడం జరిగింది గతంలో కూడా ఆమె సూర్యాపేట జిల్లా పూర్తిస్థాయి బాధ్యతలను అత్యంత సమర్థవంతంగా నిర్వహించి మంచి గుర్తింపు పొందారు. ఇప్పుడు మరొకసారి ఈ బాధ్యతలను చేపడుతుండటం పట్ల పలువురు అధికారులు, సిబ్బంది మరియు ప్రజాసంఘాల నాయకులు తీవ్ర హర్షం వ్యక్తం చేస్తూ ఆమెకు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలువురు ఆమెకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన రాబోయే రోజుల్లో కూడా జిల్లా అభివృద్ధికి మరియు సంక్షేమ పథకాల అమలుకు నిష్టతో పనిచేస్తారని ఆశిస్తూ, ఆమె భవిష్యత్ కార్యాచరణకు అందరూ అభినందనలు తెలియజేశారు.

## కలెక్టరేట్ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలి



- మంత్రి సీతక్క

**ములుగు, ఆగస్టు 7: మనం ప్రతినిధిః** ములుగు జిల్లా కేంద్రంలోని జడ్పీ కార్యాలయం నుంచి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి ధనసరి అనసూయ సీతక్క రాష్ట్రస్థాయి వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొని ఖిఉఖ్ఖ కార్యక్రమాల అమలు తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో స్వయం సహాయక సంఘాల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు, మహిళా సంఘాల భాగస్వామ్యం, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఆగస్టు 16వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ములుగు నూతన కలెక్టరేట్ కార్యాలయం ప్రారంభం కానుందని తెలిపారు. కలెక్టరేట్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కలెక్టరేట్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. మహిళా సంఘాల బలోపేతం, వారి ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ఖిఉఖ్ఖ ద్వారా మహిళలకు మరిన్ని ఉపాధి, జీవనోపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించా రు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో అదనపు కలెక్టర్, డీఆర్డీఓ, ఏపీడీ/ఏడీఆర్డీఓ, డీపీఎంలు, ఏపీఎం లు, సీసీలు, వీవోఏలు, జిల్లా సమాఖ్య సభ్యులు, మండల సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## లోటు వర్షపాత పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

- తక్కువ నీటితో అధిక దిగుబడినిచ్చే ఆరుతడి పంటలను ప్రోత్సహించాలి
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హనుమకొండ:, ఆగస్టు 7: (మనం ప్రతినిధి )ః** ఎల్నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు తక్కువ నీటి అవసరం ఉండే ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర నీటిపారుదల, ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్కుమార్రెడ్డి సూచించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వానాకాలం సాగు, వన మహోత్సవం, సమగ్ర వ్యవసాయ క్షేత్ర చెరువులు, స్మార్ట్ రేషన్ కార్డుల అమలుపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వర్షపాతం, భూగర్భ జలాల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలని, అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని సూచించారు. వానాకాలం సాగు కోసం గోదావరి, కృష్ణా బేసిన్లలోని ప్రాజెక్టుల నుంచి సాగునీటి విడుదలకు కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలిపారు.

వన మహోత్సవం కింద రాష్ట్రంలో 16.06 కోట్ల మొక్కలు నాటే లక్ష్యానికి ఇప్పటివరకు 6.28 కోట్ల మొక్కలు నాటడం, పంపిణీ చేయడం ద్వారా 39 శాతం ప్రగతి సాధించినట్లు మంత్రి తెలిపారు. నాటిన ప్రతి మొక్కను ఖీఎఊఙఖి పోర్టల్లో జియో ట్యాగింగ్ చేసి, మనుగడను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.

## సూర్యాపేట పట్టణ అభివృద్ధే లక్ష్యం

- వెనుకబడిన వార్డులపై ప్రత్యేక దృష్టి
- మున్సిపల్ చైర్ పర్సన్ ఏఐసిసి సభ్యులు సర్వోత్త రెడ్డి



**సూర్యాపేట, ఆగస్టు 07 (మనం ప్రతినిధి):** సూర్యాపేట పట్టణ అభివృద్ధే ధ్యేయం గా పనిచేస్తామని వెనుకబడిన వార్డులపై దృష్టి పెట్టి సమన్వయంతో సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని ఏఐసీసీ సభ్యులు ₹రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. జిల్లా కేంద్రంలోని 25 వ వార్డు కౌన్సిలర్ కోడి శిరీష శివ వార్డులోని ముత్యాలమ్మ గుడి సమీపంలో మున్సిపల్ జనరల్ ఫండ్ నిధుల ద్వారా మంజూరైన ఐదు లక్షల రూపాయల వ్యయంతో సీసీ డ్రైన్ కల్వర్టుల నిర్మాణానికి మున్సిపల్ చైర్ పర్సన్ గారితో కలిసి ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 15 లోపు నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అవుతాయని తెలిపారు. సమగ్ర నివేదిక ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా దారిద్య రేఖ దిగువన ఉన్న పేదలకు ఒక కోటి 5 లక్షల రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం త్వరలో శ్రీకారం చుడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరి కుంట్ల వేణుగోపాల్, పట్టణ అధ్యక్షులు వెలుగు వెంకన్న, మున్సిపల్ కౌన్సిలర్లు నాగుల వాసు, గుణగంటి హేమ సతీష్, కొణతం రాజేష్ రెడ్డి, పాలగాని మాధవి కృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు కోతి గోపాల్ రెడ్డి, ధరావత్ వీరన్న నాయక్, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, జిల్లా కాంగ్రెస్ సేవదల్ అధ్యక్షుడు ఆలేటి మాణిక్యం, మాజీ కౌన్సిలర్ వల్దాసు దేవేందర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు నాగేల్లి అరుణ్ కుమార్, నరేందర్ నాయుడు, పడిదల రవి, యాట వెంకన్న, ఖమ్మంపాటి మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ సంస్కృతి సాంప్రదాయాలకు చేనేత రంగం ప్రతీక

- స్థానిక సంస్థల ఇన్చార్జి కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి



**నల్లగొండ,ఆగస్టు 7 (మనం ప్రతినిధి):** భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు చేనేత రంగం ప్రతీక అని స్థానిక సంస్థలఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం చేనేత మరియు జౌళి శాఖ ఆధ్వర్యంలో ఉదయాదిత్య భవన్లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భారతదేశంలో చేనేత వృత్తికి శతాబ్దాల చరిత్ర ఉందని, ఇది కేవలం వ్యాపార వృత్తి మాత్రమే కాదని,ఎంతో సూక్ష్మ నైపుణ్యం, ఓర్పు, క్రమశిక్షణ, సమన్వయంతో కూడిన గొప్ప కళ అని అన్నారు. పద్మశాలి వర్గానికి చెందిన అనేక మంది విద్య, ఉద్యోగ రంగాల్లో ఉన్నత స్థానాలను అధిరోహించారని, చేనేత కార్మికుల జీవన విధానం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. తరతరాలుగా తమ నైపుణ్యంతో చేనేత కళను సజీవంగా ఉంచుతున్న నేతన్నల సేవలు అమూల్యమైనవని కొనియాడారు. చేనేత రంగం అభివృద్ధి, చేనేత కార్మికుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, ఈ రంగానికి మరింత ప్రోత్సాహం అందించే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి వినియోగించడం ద్వారా నేతన్నలకు అండగా నిలవాలని, స్వదేశీ చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 17 నుంచి అమలులోకి రానున్న చేయూత పించన్ పథకానికి అర్హులైన చేనేత కార్మికులు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 50 సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యాపార దృక్పథంతో పాటు స్వయం శక్తితో జీవనాధారాన్ని మరింత బలోపేతం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని చేనేత కార్మికులకు సూచించారు. చేనేత సంఘం చైర్మన్ దత్త గణేష్ ,మాజీ జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం మాట్లాడారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వ్యాసరచన, వ్యక్తిత్వ వికాస పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. జిల్లాకు చెందిన పలువురు చేనేత కళాకారులు, నేతన్నలను ఘనంగా సన్మానించారు . ఈ సమావేశంలో చేనేత జౌళి శాఖ ఏడి గోవిందయ్య, ప్రసాద్,దత్త గణేష్ ,కర్నాటి వెంకటేశం ,యాదగిరి, శ్రీనివాస్ ,గంజి మురళి, సత్యనారాయణ, చేనేత కళాకారులు, అధికారులు పాల్గొన్నారు .

## అంతంపేట పాఠశాల గేటుకు తాళం వేసి విద్యార్థులు, తల్లిదండ్రుల నిరసన



- శేఖర్‌ను అంతంపేటలోనే కొనసాగించాలని డిమాండ్

**నల్లగొండ, ఆగస్టు 7 (మనం ప్రతినిధి ):** అసలే టీచర్ల కొరత ఆపై ఉన్న ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్ పై మరో పాఠశాలకు పంపించడంతో చదువులు సాగడం లేదని ఆరోపిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు స్థానిక నేతలు పాఠశాల గేటుకు తాళం వేసి నిరసన తెలిపిన సంఘటన నల్లగొండ జిల్లా గట్టుపల్ మండల పరిధిలోని అంతంపేట ఎంపీపీ ఎస్ పాఠశాలలో శుక్రవారం జరిగింది.ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మాట్లాడుతూ ఎంఈఓ తమ ఊరి పాఠశాల లో ఉన్న ఉపాధ్యాయుడు శేఖర్ ను శేరి గూడెం పాఠశాలకు బదిలీ చేశారన్నారు.ఈ విషయానికి సంబంధించి తమ ఊరి పాఠశాల ఉపాధ్యాయుడిని తమ ఊరిని కొనసాగించాలని గ్రామస్తులు కోరడంతో పత్రికల్లో ప్రచురితమైనది. అందుకు ఎంఈఓ, ఉపాధ్యాయుడు శేఖర్ కు కక్షపూరితంగా ఈనెల 6న సోకాజ్ నోటీసులు జారీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే షోకేస్ నోటీసులు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఎంఈఓ శేఖర్ ను స్వార్థం పూరితంగా టిప్యూటేషన్ చేశారని ఫలితంగా అంతంపేట పాఠశాలలో బోధన కుంటు పడిందని స్థానిక నేతలు అన్నారు. పాఠశాల గేటుకు తాళం వేసి విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారులు ఈ సంఘటనపై స్పందించి తమ ఊరి పాఠశాల ఉపాధ్యాయుడు శేఖర్ ను అంతంపేట పాఠశాలలోనే ఉపాధ్యాయుడిగా కొనసాగించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు వారి తల్లిదండ్రులు, వెంకన్న నరసింహ ,బిక్షపతి , జూరాధా,వెంకటేశ్వర్లు ,బిక్షమయ్య ,నరేందర్ లింగయ్య ,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## అవగాహనతోనే నివారణ రీజినల్ కోఆర్డినేటర్



**సూర్యాపేట, ఆగస్టు 07 (మనం ప్రతినిధి)ః** అవగాహనతోనే ఎయిడ్స్ వ్యాధిని నివారించవచ్చని ఆంధ్రప్రదేశ్ తెలంగాణ ఎన్ఎస్ఎస్ రీజనల్ కోఆర్డినేటర్ రామావత్ సైదా నాయక్ అన్నారు.శుక్రవారం డిస్టిక్ లెవెల్ వన్డే రెడ్ రిబ్బన్ కార్యక్రమంలో భాగంగా కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు జ్యోతి ప్రజల్వన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన అవసరమని వ్యాధి నిర్మూలన పై విస్తృత ప్రచారం జరగాలని ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తమ వంతు బాధ్యతగా తమ పరిసర ప్రాంతాలలోని ప్రజలకు గ్రామస్తులకు స్వచ్ఛందంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఎయిడ్స్ అనేది అంటువ్యాధి కాదని సాధారణ వ్యాధిగ్రస్తులేనని వారిని సమాజంలో చులకనగా చూడరాదని అన్నారు. మహాత్మా గాంధీ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మారం వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఎర్రరెబ్బన్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ అనుబంధ కళాశాలలో ఎయిడ్స్ వ్యాధి పట్ల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని నషా ముక్తి భారత వంటి కార్యక్రమాలను నిర్వహించి మాదకద్రవ్యా వాడకం వలన కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరిస్తున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా ఎస్సీ కళాశాల ప్రిన్సిపాల్ కెప్టెన్ ప్రొఫెసర్ వి. వెంకటేషులు మాట్లాడుతూ పాఠశాల, కళాశాలలు స్వచ్ఛంద సంస్థల ద్వారా ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఎయిడ్స్ అంటువ్యాధి కాదని ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను సమాజంలో చులకనతో చూడకూడదని అన్నారు. వ్యాస రచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు పాలకమండలి సభ్యులు కర్నాటి కిషన్ వక్త భవాని, వైస్ ప్రిన్సిపాల్ ఎంఎస్ఆర్ శాస్త్రి ప్రోగ్రాం ఆఫీసర్లు మధుసూదన్ సృజన అధ్యాపకులు కవిత నలిని మాధవి రజిత విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు

**నేరేడుచర్ల, ఆగస్టు 07 (మనం ప్రతినిధి):** విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 376 వ జయంతి వారోత్సవాలు ఆగస్టు 10 హైదరాబాద్ రవీంద్ర భారతి ఆడిటోరియంలో జరుగు వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం జై గౌడ ఉద్యమం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జై గౌడ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు కేశ గాని నాగేశ్వరరావు గౌడ్ అధ్యక్షతన హుజూర్నగర్ శ్రీ కంఠమహేశ్వర సురమాంబ తల్లి దేవాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా గౌడ జాతి ముద్దుబిడ్డ హుజూర్‌నగర్ మున్సిపల్ చైర్మన్ దొంత గాని శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... హుజూర్‌నగర్ నియోజకవర్గం నుంచి గౌడ సోదరులు సోదరీమణులు పెద్ద ఎత్తున శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వారోత్సవాలకి తరలిరావాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న నూతనంగా హుజూర్‌నగర్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియమితులైన సీనియర్ న్యాయవాది కుక్కడపు బాలకృష్ణ గౌడ్ ని గౌడ పెద్దలు ఘనంగా సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు నారపరాజు శ్రీనివాస రావు న్యాయవాది బాలకృష్ణ గౌడ్ కి శుభాకాంక్షలు తెలిపారు. రిటైరీ ఎస్ట్రు దొంతగాని నాగేశ్వరరావు గౌడ్ జై గౌడ జాతీయ ఉద్యమం జాతీయ ఉపాధ్యక్షులు నారగోని శంకర్ గౌడ్ సూర్యాపేట జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొప్పు రామకృష్ణ గౌడ్ జిల్లా ఉపాధ్యక్షుడు సోమ గాని నరసింహ గౌడ్ గీత కార్మిక సంఘం అధ్యక్షులు పండ్ల హుస్సేన్ గౌడ్ బెల్లంకొండ అమర్ గౌడ్ వీరమల్ల రామకృష్ణ గౌడ్ పులి గోవింద గౌడ్ కోల శ్రీనివాస్ గౌడ్ సోమ గాని మహేష్ గౌడ్ పుట్ట నరసింహ గౌడ్ గండు అర్జున్ గౌడ్ నర్సింగ్ సతీష్ గౌడ్ కుక్కడపు నరేష్ గౌడ్ గండు సతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## 10న నాగార్జున సాగర్‌కు సీఎం రేవంత్ రెడ్డి

### ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్



**నల్లగొండ, ఆగస్టు 7( మనం ప్రతినిధి ):** ఈ నెల 10న నాగార్జునసాగర్ సమీపంలోని విజయ విహార్ వద్ద నిర్వహించనున్న వరుణ యాగానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి హాజరుకానున్నారన్న ప్రాథమిక సమాచారం మేరకు ఏర్పాట్ల విషయమై నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ శుక్రవారం నాగర్జున సాగర్ సమీపంలోని విజయ విహార్ ను సందర్శించారు.వరుణ యాగం నిర్వహించే యాగస్థలి, ప్రవచనశాల ,యాగ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్ల పై దేవాదాయ , రెవెన్యూ, పోలీసు,ఇతర సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. వరుణ యాగానికి రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరుకానున్న దృష్ట్యా అవసరమైన అన్ని ఏర్పాట్లను చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

యాగశాల ఏర్పాటు చేసే ప్రదేశం, భారీకేడింగ్ , పగోడాల ఏర్పాటు, ప్రవచనశాల ,టెంట్లు, ఎల్ఈడిలు,పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాటు వివిధ ప్రాంతాల నుండి యాగం నిర్వహించేందుకు వచ్చే ఋత్వికులు, అర్చకులకు వసతి సౌకర్యాల వంటి ఏర్పాట్లన్నీ చేయాలని చెప్పారు. అంతేకాక అన్ని చోట్లా భారీకేడింగ్ ఏర్పాటు చేయాలని ,ప్రవచనాలు వినేందుకు బయట నుండి వచ్చే సాధారణ ప్రజలకు , యాగానికి హాజరయ్యే ప్రముఖులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు, మంత్రులు,పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి, శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు అధిరులు హాజరుకానున్న దృష్ట్యా యాగశాల వద్ద యాగాన్ని తిలకించేందుకు అవసరమయ్యే ఏర్పాట్లతో పాటు,బందోబస్తు, ఇతర ఏర్పాట్లను చేయాలని ఆదేశించారు.విజయవిహార్ మొత్తం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కోటేశ్వరరావును ఆదేశించారు. అలాగే అవసరమైన చోట పగోడాల ఏర్పాటుతోపాటు, తాగునీరు, మూత్రశాలలు, ముందు రోజు నుండి యాగానికి వచ్చే ఋత్వికులు ,అర్చకులకు భోజన, వసతి సదుపాయాలు కల్పించాలన్నారు. పోలీస్ శాఖ తరపున అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని ,వరుణ యాగం నిర్వహించే స్థలం మొత్తం ప్లాన్ తో సహా సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అదనపు ఎస్పి రమేష్, మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి, యాదాద్రి దేవాలయ డిప్యూటీ ఈవో డి. భాస్కర్ జిల్లా ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ కే. భాస్కర్ ,డీఎస్పీ రవి, ఆర్ ఐ శ్రీనివాస రెడ్డి, తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

## లయన్స్ క్లబ్ నేరేడుచర్ల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

**నేరేడుచర్ల ఆగస్టు 7 మనం న్యూస్ :** లయన్స్ క్లబ్ నేరేడుచర్ల ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుల షేక్ యూసుఫ్ అధ్యక్షతన, 14వ వార్డు కౌన్సిలర్ సరికొప్పుల విజయలక్ష్మి నాగేశ్వరరావు సౌజన్యంతో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిస్ట్రిక్ట్ చైర్పర్సన్ లయన్ చల్లా ప్రభాకర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ, పేద, నిరుపేద ప్రజలకు వైద్య సేవలు అందించాలనే గొప్ప ఆశయంతో లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా సూర్యాపేట లయన్స్ క్లబ్ ఆసుపత్రి ద్వారా పేదలకు ఉచిత కంటి పరీక్షలు, వైద్య సేవలు అందించడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు నిర్వహించడం లయన్స్ క్లబ్‌కు గర్వకారణమని అన్నారు.

లయన్స్ క్లబ్ అందిస్తున్న ఈ ఉచిత వైద్య సదుపాయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సమాజంలోని పేద, నిరుపేద ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించడంలో లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది డాక్టర్ చామంతి, రాజు ,సరిత , క్లబ్ ఉపాధ్యక్షులు గుండా సత్యనారాయణ, బాల వెంకటేశ్వర్లు, కోఆర్డినేటర్, విశ్వనాథం అడ్వైజర్ కమిటీ మెంబర్ కొప్పు లక్ష్మీనారాయణ గౌడ్, రూపావత్ బాలు మహేంద్ర, భరత్,అంజి తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అటవీ శాఖలు సమన్వయంతో పనిచేయాలి

### అడవులను నాశనం చేయవద్దు అటవీ భూముల ఆక్రమణలను అడ్డుకోవాలి

### సమస్యలు సృష్టించే వారిని గుర్తించి అవగాహన కల్పించాలి: జిల్లా ఎస్పి నరసింహ

**సూర్యాపేట, ఆగస్టు 07 (మనం ప్రతినిధి)ః** అడవులను నాశనం చేయవద్దని, అడవులు పెరిగితేనే కరవు లాంటి తీవ్ర పరిస్థితులను సమర్థవంతంగా అధిగమించవచ్చని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అటవీశాఖ అధికారులతో కలిసి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... అటవీ భూముల అక్రమ ఆక్రమణలను గట్టిగా నిరోధించాలని ఆదేశించారు. ఎక్కడైనా అటవీ భూములు ఆక్రమణకు గురవుతున్నా లేదా పోడు భూములకు సంబంధించి ఎలాంటి ధర్నాలు, ఆందోళనలు జరిగే అవకాశం ఉన్నా ఫారెస్ట్ అధికారులు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పోలీసుల సహకారం తీసుకుంటూ ముందుకు సాగాలన్నారు. అడవుల విషయంలో తరచూ సమస్యలు సృష్టించే వారిని ముందుగానే గుర్తించి, వారికి చట్టాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. ఉభయ శాఖలు పూర్తి సమన్వయంతో పనిచేస్తూ జిల్లాలో అడవులను రక్షించాలని పిలుపునిచ్చారు. అలాగే ఫారెస్ట్, పోలీస్ పరిధిలో నమోదైన పాత కేసులన్నింటినీ త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి డి ఎఫ్ ఓ.దామోదర్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు,ఇన్‌స్పెక్టర్‌లు లక్ష్మీనారాయణ, ఫారెస్ట్ రేంజ్ అధికారులు ఆదిత్య, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఎపంచ తల్లిపాల వారోత్సవాలు



**వరంగల్, ఆగస్టు 7:(మనం ప్రతినిధి )ః** ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని వరంగల్ ప్రాజెక్టు లక్ష్మీనగర్ సెక్టార్ పరిధిలోని విద్యానగర్ ఎస్సీ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం అవగాహన కార్యక్రమంతో పాటు చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గర్భిణీలు, బాలింతలు తప్పనిసరిగా సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. బాలికల భవిష్యత్ విద్య, ఉన్నత చదువులు, వివాహ అవసరాలకు సుకన్య సమృద్ధి యోజన పథకం ఎంతో ఉపయోగకరమని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రతి కుటుంబం తమ కుమార్తెల పేరిట సుకన్య సమృద్ధి యోజన ఖాతాను ప్రారంభించి, క్రమం తప్పకుండా పొదుపు చేయాలని సూచించారు. బాలికల భవిష్యత్ భద్రతకు ఈ పథకం మంచి పెట్టుబడిగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ విద్య, సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణీలు, బాలింతలు, తల్లిదండ్రులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళ సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట

## మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



హసనపర్తి ఆగష్టు 7(మనం న్యూస్ ): కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. శుక్రవారం ఎర్రగట్టుగుట్ట వెంకటేశ్వర కళ్యాణ మండలంలో 65,66వ డివిజన్లకు చెందిన మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని. గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో మహిళల జీవిత స్థాయిని మెరుగుపరచడానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రయత్నాలు చేస్తోందని ఆయన తెలిపారు.రాష్ట్రంలో మహిళా సాధికారత, స్వయం సహాయక సంఘాల అభివృద్ధి కోసం ఈ పథకాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు.అర్హులైన పేద మహిళలకు, మహిళా సంఘాల సభ్యులకు ఈ చీరలను అందజేస్తామన్నారు.అర్హులైన ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీరలు పంపిణీ అయ్యేలా పారదర్శకంగా, ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. కుటుంబ అభ్యున్నతిలో మహిళలే కీలకమని,భవిష్యత్ తరాల బాగు కోసం పిల్లలను చక్కగా చదివించాలని హితవు పలికారు.రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఇండ్లు తదితర వాటిని ప్రభుత్వం మహిళల పేరుతోనే మంజూరు చేస్తోందని, మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేస్తోందని అన్నారు.కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 66వ డివిజన్ అధ్యక్షులు కిరణ్ గారు,65వ డివిజన్ అధ్యక్షులు సునీల్,ఆత్మకూరు మార్కెట్ వైస్ చైర్మన్ తిరుపతి,మండల అధ్యక్షులు అశోక్ కుమార్,మహిళ అధ్యక్షురాలు జోరిక పూల,మహిళ ఉప అధ్యక్షురాలు స్వాతి,మాజీ మండల అధ్యక్షులు మహేందర్ రెడ్డి,సీనియర్ నాయకులు వీసం సురేందర్ రెడ్డి,వంగపహడ్ ౹అఇఖి చైర్మెన్ మెరుగు రాజేష్ గౌడ్, మండల, డివిజన్ స్థాయి నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**చేనేత వస్త్రాల కొనుగోలుతో నేతన్నలకు భరోసా**

**చేనేత రంగానికి వరంగల్ నగరం వేదిక**

**వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న , ఇన్చార్జి కలెక్టర్ రవి**



హనుమకొండ, ఆగస్టు 7:(మనం ప్రతినిధి ): హనుమకొండ: చేనేత కార్మికుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా జిల్లా చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ చేనేత అనేది కేవలం ఒక వృత్తి మాత్రమే కాదని, భారతీయ సంస్కృతి, సంప్రదాయం, కళాత్మక నైపుణ్యానికి ప్రతీక అన్నారు. తెలంగాణలో చేనేత రంగానికి విశిష్టమైన చరిత్ర ఉందని, ముఖ్యంగా వరంగల్ ప్రాంతం దేశవ్యాప్తంగా చేనేత కళకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని, వారి జీవనోపాధి మెరుగుపడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. చేనేత ఉత్పత్తులకు మార్కెట్ విస్తరణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వినూత్న డిజైన్లు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అలాగే ముడి సరుకు, రుణ సౌకర్యాలు, బీమా, సంక్షేమ పథకాలు మరింత సమర్థవంతంగా అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి చేనేత కార్మికులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. చేనేత కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ముఖ్యంగా హనుమకొండ జిల్లాలోని చేనేత కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని చేనేత కార్మికుల అభ్యున్నతికి అవసరమైన మౌలిక సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాల కోసం నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా చేనేత రంగానికి చేయూతనిచ్చే విధంగా డిపిఆర్ తయారుచేసి ఇవ్వాలని, డిపిఆర్ ను సీఎం దృష్టికి తీసుకు వెళ్తానని పేర్కొన్నారు. చేనేత రంగాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. చేనేతను కాపాడుకుంటూ చేనేత కార్మికులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. చేనేత కార్మికులందరికీ జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలను ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్చార్జి కలెక్టర్ రవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేనేత రంగానికి ప్రోత్సాహాన్ని అందిస్తుందన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సూచించిన విధంగా చేనేత సంఘం ప్రతినిధులు చేనేత సంక్షేమానికి డిపిఆర్ తయారుచేసి అందించాలని తెలియజేశారు. జిల్లాలోని 774 మంది లబ్ధిదారులకు చేనేత భరోసా పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 24 లక్షల చెక్కును ఎమ్మెల్యే, ఇన్చార్జి కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం చేనేత కార్మికులను ఘనంగా సన్మానించడంతో పాటు చేనేత రంగంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబర్చిన వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించి చేనేత వస్త్రాలతో సన్మానించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల విక్రయ స్టాల్ ను సందర్శించి చేనేత చీరను ఎమ్మెల్యే కొనుగోలు చేశారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే, ఇన్చార్జి కలెక్టర్ ఎన్. రవి చేనేత రంగ పరిరక్షణ, చేనేత కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ జయరాజ్, ఏడీ విజయలక్ష్మి, చేనేత సంఘాల ప్రతినిధులు, చేనేత కార్మికులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్లో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు



- **చేనేత కార్మికులకు సన్మానం**

వరంగల్, ఆగష్టు 7(మనం ప్రతినిధి ): జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం వరంగల్ కాపువాడ లోని పద్మశాలి కమ్యూనిటీ హాల్లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, జిల్లా కలెక్టర్ డా. సత్య శారద ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా కొత్తవాడలోని ఇందిరా గాంధీ విగ్రహం నుండి చేనేత నడవ (ర్యాలీ)ని ప్రారంభించారు. అనంతరం చేనేత రంగంలో అనుభవం, నైపుణ్యం కలిగిన పలువురు చేనేత కార్మికులను అతిథులు ఘనంగా సన్మానించారు. ప్రస్తుత ఫ్యాషన్కు తగ్గట్లు వస్త్రోత్పత్తి చేయాలి: జిల్లా కలెక్టర్ డా. సత్య శారద ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. చేనేత కార్మికులు ప్రస్తుత ఫ్యాషన్ ట్రెండ్స్కు అనుగుణంగా ఉత్పత్తులను తయారు చేసి అధిక ఆదాయం పొందాలని సూచించారు. ఖఆఉ ద్వారా కార్మికులు పేర్లను నమోదు చేసుకుని, ఎగుమతికి వీలైన నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేయాలని కోరారు. చేనేత కళాకారుల నైపుణ్య వారసత్వాన్ని కొనసాగించాలని, చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడంతో పాటు ప్రజలు చేనేత వస్త్రాలను వినియోగించేలా అవగాహన కల్పించడం ద్వారా చేనేత రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. చేనేత సంఘాలు బలోపేతం కావాలి: ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య మాట్లాడుతూ.. చేనేత సంఘాలు కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని మార్కెట్కు తగిన ఉత్పత్తులను తయారు చేయాలని, తద్వారా సంఘాలు పరిపుష్టి అయ్యేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేనేత మరియు జౌళి శాఖ సహాయ సంచాలకులు వై. శ్రీకాంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్, డెవలప్మెంట్ ఆఫీసర్ సుధీర్ కుమార్, సమాఖ్య అధ్యక్షులు పంతగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సీఎం పర్యటన ఏర్పాట్లపై ఎమ్మెల్యే సమీక్ష



పరకాల ఆగష్టు 7(మనం న్యూస్ ): పరకాల నియోజకవర్గంలో ఆగస్టు 16వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించనున్న సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరకాల నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారని తెలిపారు. ఈ పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు.100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, నూతన డిగ్రీ కళాశాల, పరకాల ఇందిరా మహిళా డైరీ, ఏటీసీ సెంటర్, తదితర పనులకు ప్రారంభోత్సవం శంకుస్థాపన చేయనున్నారని అన్నారు.

# బోడగుట్టను ఆదర్శవంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దుతాం

- **వరంగల్ పశ్చిమలో అభివృద్ధికి కొత్త ఒరవడి..**
- **బోడగుట్టలో అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే నాయిని**



హనుమకొండ, ఆగష్టు 7(మనం ప్రతినిధి ): పశ్చిమ నియోజకవర్గంలోని కాజీపేట 47వ డివిజన్ బోడగుట్ట ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. పూర్తి గ్రామీణ వాతావరణం కలిగిన బోడగుట్టకు పట్టణ స్థాయి మౌలిక సదుపాయాలు కల్పించడం తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధికి కొత్త ఒరవడి ప్రారంభమైందని ఎమ్మెల్యే అన్నారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధిని ప్రథమ ప్రాధాన్యంగా తీసుకుని ప్రతి డివిజన్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం రోజున 47వ డివిజన్ బోడగుట్టలో అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ వంటి మౌలిక వసతులను మరింత మెరుగుపరిచి బోడగుట్టను ఆదర్శవంతమైన ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

# ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ను విడుదల చేయాలి

- **ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా**



హనుమకొండ, ఆగష్టు 7 (మనం ప్రతినిధి): విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్స్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మంద నరేశ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే విద్యార్థులకు న్యాయం చేస్తామని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి హామీ ఇవ్వడంతో కాంగ్రెస్ పార్టీకి విద్యార్థులు, నిరుద్యోగులు వారి తల్లితండ్రులు నమ్మి కాంగ్రెస్ పార్టీ ఓట్లు వేశారన్నారు. అధికారంలోకి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా రేవంత్రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు విద్యార్థి, నిరుద్యోగులకు పూర్తిగా అన్యాయం చేశారని అన్నారు మ ఖ్యమంత్రి విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు మధ్యలోనే చదువులు ఆపాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థుల ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ విద్యాసంస్థను బలోపేతం చేసి అక్రమం గా ఫీజుల దోపిడీ చేస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థల పైన చర్యలు తీసుకొని, అనుమతులు లేని విద్యాసంస్థలను మూసివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

రాష్ట్రానికి విద్యాశాఖమంత్రిని నియమించి విద్యార్థులకు న్యాయం చేయకపోతే విద్యార్థుల పక్షాన ఏబీఎస్ఎఫ్ అధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని మంద నరేష్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ వరంగల్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, కేయూ అధ్యక్షుడు అడ్డా రాజేష్ జిల్లా నాయకులు పోతుగంటి ఉదయ్ కిరణ్. కార్తీక్ వెంకటేష్, భాను. సాయి కిరణ్, వెంకటేష్, ప్రసన్న, కళ్యాణి, ప్రవళిక, పల్లవి పాల్గొన్నారు.

# 15 లోపు పిఆర్‌సిని ప్రకటించి అమలు చేయాలి



మల్హర్,ఆగస్టు 7(మనం న్యూస్): ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యు ఎస్ పి సి) పిలుపు మేరకు జిల్లాలోని ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మరియు సమగ్ర శిక్షన ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి పాఠశాల విధులకు హాజరై, భోజన విరామ సమయంలో తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యుటిఎఫ్) జయశంకర్ జిల్లా అధ్యక్షుడు నక్క తిరుపతి మల్హర్ మండలంలో వివిధ పాఠశాలలను సందర్శించి మాట్లాడుతూ పాఠశాలల మరియు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పిసి)ఆధ్వర్యంలో అనేకసార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ప్రభుత్వం నుండి ఎలాంటి సానుకూల స్పందన రాకపోవడంతో అనివార్యంగా నాలుగు దశల పోరాట కార్యక్రమాన్ని ప్రకటించడం జరిగిందని తెలియజేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15 లోపు పిఆర్సీ నివేదికను తెప్పించుకొని 01.07.2023 నుండి అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న ఆరు డిఎ లను వెంటనే విడుదల చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రకారం సిపిఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయల్లో ,అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులతో పాటు సమగ్ర శిక్షలు పనిచేస్తున్న ఉద్యోగులందరికీ వెంటనే మినిమం టైం స్కేల్ ను వెంటనే వర్తింప చేయాలన్నారు. విద్యాశాఖలో ఖాళీగా ఉన్న పర్యవేక్షణ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు మరియు పదోన్నతుల షెడ్యూల్ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. రేషనలైజేషన్ జి ఓ 25ను సవరించి ప్రతి ప్రాథమిక పాఠశాలకు కనీస ఇద్దరు టీచర్లు ,40 మంది విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలకు ఐదుగురు టీచర్లను కేటాయించాలన్నారు. గురుకులాలు మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 హెడ్ కింద వేతనాలు చెల్లించాలన్నారు. అందరికీ అందుబాటులో గల ప్రభుత్వ పాఠశాలల కుదింపు ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. జి ఓ 317 కారణంగా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులు ఉద్యోగులను తమ స్థానిక జిల్లాకు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. పి ఆర్ సి ని అమలు చేసేంతవరకు జిల్లాలోని ఉపాధ్యాయులందరూ ప్రతిరోజు నల్ల బ్యాడ్జిని ధరించి విధులకు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. ఈనెల 12 13 తేదీల్లో జిల్లాలోని అన్ని తహసిల్దారు కార్యాలయాల ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించాలన్నారు. ఆగస్టు 15 లోపు ప్రభుత్వం నుండి ఎలాంటి సానుకూల నిర్ణయం వెలబడకపోతే ఆగస్టు 19వ తేదీన జిల్లా కేంద్రాల్లో మరియు ఆగస్టు 29వ తేదీన రాష్ట్ర కేంద్రంలో వేలాదిమంది ఉపాధ్యాయులతో మహాధర్నా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కోడెపాక రమేష్,మండల బాధ్యులు శర్మ, యోగానంద్, పూర్ణ, స్వర్ణలత, శ్రీధర్, యాకూబ్ పాషా, చంద్ర ప్రకాష్ ,మానస, సుజాత ,మిట్ట రమేష్ తాడిచెర్ల,మల్లారం పెద్ద తూండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

## జనగణన వివరాల సేకరణను నిర్ణీత గడువులో పూర్తి చేయాలి

- **రాష్ట్ర జనగణన సంచాలకులు భారతి హోళ్లికేరి**

హనుమకొండ, ఆగస్టు 7:(మనం ప్రతినిధి ): జనగణన-2027లో భాగంగా జిల్లా జనగణన హ్యాండ్బుక్ తయారీకి అవసరమైన గ్రామ, పట్టణ డైరెక్టరీ వివరాల సేకరణను పూర్తి ఖచ్చితత్వంతో, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర జనగణన సంచాలకులు భారతి హోళ్లికేరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో జనగణన-2027 పనుల పురోగతిపై సమీక్షించారు. గ్రామాలు, పట్టణాలకు సంబంధించిన విద్య, వైద్యం, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, రహదారులు, రవాణా, బ్యాంకింగ్, పోస్టల్, వ్యవసాయం, మార్కెటింగ్ తదితర సామాజిక, ఆర్థిక, మౌలిక వసతుల వివరాలను క్షేత్రస్థాయిలో సేకరించి వెబ్ పోర్టల్లో నమోదు చేయాలని సూచించారు. ఫీల్ సిబ్బందికి అవసరమైన శిక్షణ, సాంకేతిక సహకారం అందించడంతో పాటు, సంబంధిత శాఖల రికార్డులతో వివరాలను ధృవీకరించి నమోదు చేయాలని తెలిపారు. డేటా భద్రతకు ప్రాధాన్యతనిస్తూ అధికారిక యాప్, వెబ్ పోర్టల్నే వినియోగించాలని, యూజర్ ఐడీ, పాస్వర్డ్ను గోప్యంగా ఉంచాలని సూచించారు.

# మెట్టుగుట్ట ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి

- **ఆలయాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద**
- **ఎమ్మెల్యే నాగరాజు**



కాజిపేట్, ఆగష్టు 7(మనం న్యూస్): ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థికంగానే కాకుండా అన్నివిధాల కృషి చేస్తుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపిఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు.శుక్రవారం మెట్టుగుట్ట ఆలయ చైర్మెన్ రఘుచందర్ ఆలయ ఈఓ,అర్చకులు మర్యాదపూర్వకంగా కలిసి ఈ నెల 9,10వ తేదీలలో నిర్వహించే శ్రీ సీతారామచంద్రస్వామి పవిత్రోత్సవములకు ఆహ్వానించారు. ఎమ్మెల్యే కృషితో పది సంవత్సరాలుగా ఆలయంలో అర్చక సేవలు అందిస్తున్న పరశురాం విష్ణువర్ధన్ చార్యులు కి పర్మినెంట్ ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేశారు.అనేక సార్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, దేవదాయశాఖ మంత్రి వర్యులు శ్రీమతి కొండా సురేఖ కి ఆలయ అభివృద్ధికి కోసం కలిసిన నేపథ్యంలో ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో 6కోట్ల 98 లక్షల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.మెట్టుగుట్ట దేవస్థానం అభివృద్ధికి తనవంతు సంపూర్ణ సహకారం ఉంటుదని తెలిపారు.ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయంలో శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దీప దూప నైవేద్య పథకం కింద ఆలయాలకు ఆర్థిక చేయూతను అందిస్తుందన్నారు.గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి దేవాలయం అభివృద్ధికి నోచుకోలేదని, సీఎం రేవంత్ రెడ్డి చొరవతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు.విష్ణువర్ధన్ చార్యులు పురోహితుడు శాశ్వత ఉద్యోగం కోసం అనేక సార్లు సీఎం రేవంత్ రెడ్డి,మంత్రి కొండా సురేఖ కి కలిసిన సందర్భంగా వారికి పర్మినెంట్ ఉద్యోగం రావడం సంతోషమన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గకి,మంత్రి కొండా సురేఖ కి ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ సత్యనారాయణ, అర్చకులు అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

## మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో పాల్గొన్న ఝాన్సీ

పాలకుర్తి ఆగష్టు 7(మనం న్యూస్ ): అమెరికాలోని శాన్ఫ్రాన్సిస్కో భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో భారత కాన్సుల్ జనరల్ డా. శ్రీకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్క గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ శ్రీమతి ఝాన్సీ రాజేందర్ రెడ్డి గారు కూడా పాల్గొని, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక భారతీయ సంఘాల ప్రతినిధులు, ప్రవాస భారతీయులతో ఆప్యాయంగా మమేకమయ్యారు.

ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారు ప్రవాస భారతీయులతో ముచ్చటిస్తూ వారి అభిప్రాయాలు, సూచనలు తెలుసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ప్రవాస భారతీయుల పాత్ర ఎంతో కీలకమని, రాష్ట్రంతో వారి అనుబంధం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, ప్రవాస భారతీయులు పరస్పరం అభివాదాలు చేసుకుంటూ ఆత్మీయంగా చర్చలు జరిపారు. ఈ 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమం భారతీయ సమాజం, ప్రవాస తెలంగాణ ప్రజలు మరియు ప్రజాప్రతినిధుల మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేసే వేదికగా నిలిచింది.

## బిట్స్ స్కూల్లో ఘనంగా బోనాల సంబరాలు

పరకాల ఆగష్టు 7(మనం న్యూస్ ): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగను బిట్స్ స్కూల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో బోనం ఎత్తుకొని ఊరేగింపులో పాల్గొనగా, విద్యార్థులు పోతురాజు వేషధారణ, జానపద నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో తెలంగాణ సంస్కృతి వైభవాన్ని ప్రతిబింబించారు. : పాఠశాల చైర్మన్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, 'బోనాల పండుగ అనేది తెలంగాణ ప్రజల విశ్వాసానికి, అమ్మవారి పట్ల ఉన్న అచంచల భక్తికి ప్రతీక. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత. విద్యార్థులు పుస్తక విజ్ఞానంతో పాటు భారతీయ సంస్కృతి, తెలంగాణ సంప్రదాయాలను కూడా తెలుసుకొని ఆచరించాలి. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో దేశభక్తి, సంస్కృతి పట్ల గౌరవాన్ని పెంపొందిస్తాయి' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. సంజయ్ కుమార్ పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొని బోనాల సంబరాలను విజయవంతం చేశారు.

# వార్మప్ మ్యాచ్.. ప్రభావం చూపించని భారత బౌలర్లు




శ్రీలంక గీఐతో వార్మప్ మ్యాచ్ లో భారత బౌలర్లు పెద్దగా ప్రభావం చూపించలేకపోయారు. తొలి రోజు ఆట ముగిసే సరికి శ్రీలంక గీఐ ఎనిమిది వికెట్ల నష్టానికి 363 పరుగులు చేసింది. క్రీజ్ లో కేషర నువాంత (9₹), దిలుమ్ సుదీరా (1₹) ఉన్నారు. నిషాన్ మదుష్క (66), రవిందు రసాంత (71), సోనాల్ దినుష (51) అర్ధశతకాలతో అలరించారు. పవన్ రత్నాయకే (39), విక్రమసింఘె (31), పసిందు సూరియబండారా (35) ఫర్వాలేదనిపించారు. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా 2, కుల్దీప్ యాదవ్ 2, మానవ్ సుతార్ 2, గుర్నూర్ బ్రార్ ఒక వికెట్ తీశారు.

**ఆ ఇద్దరికీ దక్కని వికెట్లు**

టాస్ ఓడి బ్యాటింగ్ కు దిగిన శ్రీలంక గీఐజట్టుకు ఓపెనర్లు నిషాన్, రవిందు మంచి ఆరంభం ఇచ్చారు. తొలి వికెట్ కు 110 పరుగులు జోడించారు. భారత పేస్ బౌలర్లు సిరాజ్, ప్రసిద్ధ్ కు వికెట్ దక్కలేదు. వీరిద్దరూ 21 ఓవర్లు వేసి 76 పరుగులు ఇచ్చారు. బుమ్రా లేకుండానే శ్రీలంకతో టెస్టు సిరీస్ ను ఆడనుంది. ఈ క్రమంలో వికెట్ లేకపోవడం భారత శిబిరంలో కాస్త ఆందోళన కలిగించేదే. కొత్త బౌలర్ సారాంశ్ జైన్ (11-0-54-0) కూడా ఇబ్బంది పడ్డాడు. అయితే, కుల్ దీప్ తోపాటు జడేజా, సుతార్ నాణ్యమైన బౌలింగ్ తో వికెట్లు దక్కాయి.

**గిల్ గైర్హాజరు..**

వార్మప్ మ్యాచ్ తొలి రోజు ఆటకు భారత కెప్టెన్ శుభ్ మన్ గిల్ దూరంగా ఉన్నాడు. గురువారం ప్రాక్టీస్ చేస్తుండగా చేతి వేలికి గాయమైన సంగతి తెలిసిందే. దీంతో అతడికి బదులు కేఎల్ రాహుల్ సారథ్యం నిర్వర్తించాడు. రెండో రోజు గిల్ ఫిట్ గా ఉంటే బరిలోకి దిగే అవకాశం ఉంది. అదీ సాధ్యం కాకపోతే.. నేరుగా ఆగస్టు 15 నుంచి శ్రీలంకతో జరగనున్న తొలి టెస్టులోనే ఆడతాడు.



## రణబీర్ కపూర్ నా ఆల్‌టైమ్ ఫేవరెట్ నటుడు : అదితి రావు హైదరి

విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ అలరిస్తున్న అదితి రావు హైదరీ, ఇటీవల 'గాంధీ టాక్స్' చిత్రంతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ప్రస్తుతం ఆమె ప్రైమ్ వీడియో వేదికగా రాబోతున్న సరికొత్త ప్రాజెక్ట్ 'వెల్కమ్ టు ఖోయా మహల్' అనే వెబ్ సిరీస్ తో అలరించేందుకు సిద్ధమయ్యారు. కొంకణా సేన్ శర్మ, జైదీప్ సర్కార్ సంయుక్తంగా సృష్టించిన ఈ థ్రిల్లర్ సిరీస్ లో వర్సటైల్ యాక్టర్ బరుణ్ సోబ్తి కూడా ఒక కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ సిరీస్ కథాంశం ఎంతో ఆసక్తికరంగా రూపుదిద్దుకుంటోంది. పూర్వపు రాజకుటుంబానికి చెందిన అక్కాతమ్ముళ్లు, తమకు వారసత్వంగా వచ్చిన శిథిలావస్థలో ఉన్న ఖోయా మహల్ అనే హెరిటేజ్ హోటల్ ను నడపడానికి ఎలాంటి సవాళ్లను ఎదుర్కొన్నారు అనే కథతో ఇది సాగుతుందని టాక్. సరికొత్త ప్రయాణంతో ప్రేక్షకుల ముందుకు రానున్న అదితి రావు హైదరీ, ఈ సిరీస్ తో మరోసారి తన మార్క్ నటనతో మెప్పించనున్నారని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఇదిలా ఉంటే.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అదితి తోటి నటుడు రణబీర్ కపూర్ నటనా ప్రతిభను పొగుడుతూ చేసిన వ్యాఖ్యలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. దర్శకుడు ఇంతియాజ్ అలీ తెరకెక్కించిన ఐకానిక్ చిత్రం 'రాక్ స్టార్'లో రణబీర్ తో కలిసి స్క్రీన్ స్పేస్ షేర్ చేసుకున్న క్షణాలను ఆమె గుర్తు చేసుకున్నారు. రణబీర్ ను ఇండస్ట్రీలోని అత్యుత్తమ నటుల్లో ఒకరిగా పోల్చారు. రణబీర్ కపూర్ తో పనిచేసిన అనుభవాన్ని పంచుకుంటూ అదితి రావు హైదరీ మాట్లాడుతూ.. 'రణబీర్ తో కలిసి నటించడం ఒక క్రేజీ అండ్ మైండ్ బ్లోయింగ్ ఎక్స్ పీరియన్స్. ఆయన నిజంగా ఒక ఇన్ క్రెడిబుల్ యాక్టర్. నా ఆల్ టైమ్ ఫేవరెట్ నటుల్లో రణబీర్ కపూర్ ఒకరు. కెమెరా ముందుకు రాగానే సన్నివేశంలో పూర్తిగా జీవించేయడం ఆయన ప్రత్యేకత. ఆయన తన నటనతో ఎవరినైనా చాలా సులభంగా మైమరిపించి మెప్పించగలడు' అని అదితి ప్రశంసించారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వ్యాఖ్యలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి.

# అంతర్జాతీయ వేదికపై గురుకుల కెరటాలు!

- మలేషియాలో జరిగే సౌత్ ఈస్ట్ కోస్ట్ లాక్రోస్ ఛాంపియన్షిప్నకు తెలంగాణ విద్యార్థినులు
- గోపిక, సంగీతలను అభినందించిన మంత్రి పొన్నం ప్రభాకర్, వి. హనుమంతరావు





హైదరాబాద్, ఆగస్టు 7 (మనం న్యూస్): తెలంగాణ బీసీ గురుకుల విద్యార్థినులు అంతర్జాతీయ క్రీడా యవనికపై దేశ ఖ్యాతిని చాటేందుకు సిద్ధమయ్యారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన 'సౌత్ ఈస్ట్ కోస్ట్ లాక్రోస్ ఛాంపియన్‌షిప్ - 2026' పోటీలకు రాష్ట్రానికి చెందిన ఇద్దరు గురుకుల క్రీడాకారిణులు ఎంపికయ్యారు. ఈ నెల 28 నుంచి 30 వరకు మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో అంతర్జాతీయ స్థాయిలో ఈ పోటీలు జరగనున్నాయి. బీసీ గురుకుల విద్యాలయాల సంస్థ విద్యార్థినులు పి. గోపిక, సంగీత ఈ మెగా టోర్నీలో భారత్ తరఫున బరిలోకి దిగనున్నట్లు సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు ఒక ప్రకటనలో వెల్లడించారు.

**పట్టుదలతో పైపైకిః**

చిన్న వయసులోనే గురుకులాల బాట పట్టిన ఈ గ్రామీణ ప్రతిభామూర్తులు నేడు అంతర్జాతీయ స్థాయికి ఎదగడం విశేషం. ఐదో తరగతిలోనే బీసీ గురుకుల పాఠశాలలో అడుగుపెట్టిన గోపిక, సంగీత చదువుతో పాటు క్రీడల్లోనూ అసాధారణ పట్టుదలను కనబరిచారు. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో లాక్రోస్ క్రీడలో రాణిస్తూ ప్రస్తుతం ఇంటర్మీడియట్ చదువుతున్నారు. గతంలో కర్నూలు, చెన్నైలలో జరిగిన సౌత్ జోన్ ఛాంపియన్‌షిప్‌లలో అద్భుత ప్రదర్శనతో బంగారు పతకాలను కైవసం చేసుకున్న వీరు.. ఆ తర్వాత ఆగ్రా, జమ్ముకాశ్మీర్‌లలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లోనూ అత్యున్నత ప్రతిభ కనబరిచి అందరి దృష్టిని ఆకర్షించారు. జాతీయ స్థాయిలో చూపిన ఇదే జోరుతో ఇప్పుడు మలేషియాలో జరిగే అంతర్జాతీయ టోర్నీకి అర్హత సాధించి సత్తా చాటారు.

ప్రపంచంలోని అత్యుత్తమ క్రీడాకారులతో పోటీపడి, అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ, తెలంగాణ రాష్ట్ర ఉనికిని చాటిచెప్పేందుకు మన గురుకుల విద్యార్థులకు ఇదొక అద్భుతమైన అవకాశమని ఈ సందర్భంగా కార్యదర్శి సైదులు కొనియాడారు.

**మంత్రి పొన్నం అభినందనలుః**

అంతర్జాతీయ పోటీలకు ఎంపికై రాష్ట్ర కీర్తిని దశదిశలా చాటిన విద్యార్థినులు గోపిక, సంగీతలను బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయాదేవి, కార్యదర్శి బడుగు సైదులులు క్రీడాకారిణులకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి అంతర్జాతీయ స్థాయికి ఎదగడం గర్వకారణమన్నారు. విద్యార్థినుల అసాధారణ ప్రతిభ వెనుక నిరంతరం కృషి చేసిన ఫిజికల్ డైరెక్టర్లు అంజలి, మమత, శోభలతో పాటు లాక్రోస్ కోచ్‌లు శివకుమార్, ఆకాష్, ప్రిన్సిపాల్ శ్రీలతలను ఈ సందర్భంగా వారు ప్రత్యేకంగా అభినందించారు.

# ప్రేక్షకులు నా కోసం ఖర్చు పెట్టే డబ్బులకు న్యాయం చేయాలనే లక్ష్యంతో పని చేస్తాను

## - దొర సాయి తేజ



**వర్టికల్ స్టోరీస్‌లో చాయ్ షాట్స్ నుంచి వచ్చిన 'దందా' సిరీస్‌తో హీరోగా దొర సాయి తేజ ఓ ట్రెండ్ క్రియేట్ చేశారు. దర్శకుడు ఆదిత్య దేవులపల్లి తెరకెక్కించిన ఈ సిరీస్ యూ ట్యూబ్‌లో ట్రెండ్ అవుతోంది. ఈ సిరీస్ సక్సెస్ ఫుల్‌గా సాగుతున్న తరుణంలో హీరో దొరసాయి తేజ తన జర్నీ గురించి 'మనం' ఇంటర్వ్యూలో పలు ఆసక్తి కర అంశాలను తెలియజేశారు. విశేషాల్ని పంచుకున్నారు. ఆయన చెప్పిన సంగతుల గురించి చదివేద్దాం..**

**మీ సినీ జర్నీ గురించి చెప్పండి?**

ప్రభాస్ 'అడవి రాముడు' సినిమాలో హీరో చిన్నప్పటి చైల్డ్ కారెక్టర్‌కి డబ్బింగ్ చెప్పాను. 'కొత్త బంగారులోకం', 'హై స్కూల్' అనే సిరీస్‌లో నటించాను. 'అలా మొదలైంది' సినిమాలోనూ ఓ చిన్న పాత్రను పోషించాను. 2016 నుంచి ఆర్జీవీతో అనుబంధం ఏర్పడింది. 'శ్రీదేవీ' అనే ఓ విడుదల కాని సినిమాలో నటించాను. అక్కడే నాకు సినిమా పరిచయమైంది. అలా 2018లో యూ ట్యూబ్ జర్నీ సీరియస్‌గా ప్రారంభమైంది. 'బ్యాక్ బెంచర్స్' సిరీస్‌తో మంచి గుర్తింపు వచ్చింది. అలా సిరీస్‌లు చేసుకుంటూ వచ్చాను. గత ఏడాది సొంతంగా కంటెంట్ క్రియేషన్ కంపెనీ ప్రారంభించాను. రీసెంట్‌గా మళ్లీ 'దందా'తో సక్సెస్ వచ్చింది.

**ఇంత చిన్న వయసులోనే వ్యాపారస్థుడిగా, నటుడిగా, కంటెంట్ క్రియేటర్‌గా విజయం సాధించడం పట్ల మీరు ఎలా ఫీలవుతున్నారు?**

నేను నిద్ర లేచిన క్షణం నుంచి కంటెంట్ క్రియేటర్‌గా, డైరెక్టర్‌గా, యాక్టర్‌గా, ప్రొడ్యూసర్‌గా ఆలోచిస్తూనే ఉంటాను. నన్ను నేను కొత్తగా పరిచయం చేసుకోడానికి ఇదొక మార్గం. అందుకే అన్ని రకాలుగా ప్రయత్నిస్తున్నాను. కంటెంట్ క్రియేషన్ అనేది నా బిజినెస్. సినిమా అనేది నా ప్యాషన్. రెండూ కలిపితే దొర సాయి తేజ.

**మీకు పార్టీలు చేసుకోవాలని, ఎంజాయ్ చేయాలని అనిపించదా?**

ప్రతీ విషయాన్ని నేనే నేర్చుకోవాలి. నాకు నేనుగానే అన్నీ నేర్చుకుంటున్నాను. కింద పడ్డ ప్రతి సారీ ఒక కొత్త గుణపాఠం నేర్చుకుంటాను. నేను ఎప్పుడూ నా వయసు కంటే ఓ ఐదేళ్లు పెద్దవాడిలానే ఆలోచిస్తా. రోజంతా వృత్తి పరమైన పనులతోనే బిజీగా ఉంటాను. ఇతర పనులకు నాకు టైం ఉండదు. ప్రతీ రోజూ ఏదో ఒకటి కొత్తగా క్రియేట్ చేయాలని ఆలోచిస్తుంటాను.

**సోషల్ మీడియాలో వచ్చే ప్రశంసలు, విమర్శల్ని ఎలా తీసుకుంటారు?**

సోషల్ మీడియాలో అన్నీ ఉంటాయి. ప్రతీ వీడియోకి కొన్ని కొత్త ప్రశంసలు, కొన్ని తిట్లు వస్తుంటాయి. ఈ కంటెంట్ క్రియేషన్ అనే దాన్ని నేను ఒక బ్రిడ్జ్‌లా వాడతాను. ఇక్కడ నా కోసం ఉండే ఫాలోయింగ్‌ని సినిమా థియేటర్ వరకు తీసుకు రావాలని అనుకుంటున్నాను. అయితే కంటెంట్ క్రియేషన్స్‌లోనే మా రోజువారి ఖర్చులు తీసుకోవాల్సి ఉంటుంది. ఇన్ ఫ్లూయెన్సర్, కంటెంట్ క్రియేటర్ అనే మాట కంటే.. నటుడు అని పిలిపించుకోవాలని నాకు ఉంటుంది.

**సోషల్ మీడియా లైఫ్, ఈ క్రియేటర్ స్పేస్ గురించి కొత్తగా వచ్చేవాళ్లకు మీరిచ్చే సలహా ఏంటి?**

కొద్దిగా ఫాలోవర్లు లైకులు షేర్లు కనిపించాయంటే చాలు, చూసే జనాలంతా అబ్బా 'లైఫ్ అంటే వీడిది రా' అనుకుంటారు. కానీ అది నిజం కాదు, వైకుంఠపాళీ లాగా నిచ్చెనెక్కిచ్చేది అదే, ఏదైనా తేడా కొడితే కింద పడేసేది అదే. చూడటానికి అందంగా ఫ్యాన్సీగా కనిపిస్తుంది, వ్యూస్ రీచ్ కోసం ఒకటి చెప్తే ఇంకో టైటిల్ పెట్టి, తంబ్‌నెయిల్ మార్ఫ్ చేసి వాళ్ళ ప్రయోజనాల కోసం జీవితాలు నాశనం చేసే వాళ్ళూ ఉన్నారు. సో దీంట్లోకి రావాలనుకునే వాళ్ళు ఎవరైనా సరే ప్రశంసకీ విమర్శకీ రెండింటికి సిద్ధంగా ఉండాలి. అలా అయితేనే ఈ స్పేస్‌లో సర్వైవ్ అవ్వగలరు.

**అరవింద్ పాత్రకు అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. మిమ్మల్ని విమర్శించే వారు కూడా పొగిడేస్తున్నారు కదా?**

కంటెంట్ క్రియేషన్స్‌లో ఒకే రకమైన పాత్రను పోషించగలను. కానీ సిరీస్, సినిమా వరకు వచ్చే సరికి రకరకాల పాత్రలను పోషించే అవకాశం వస్తుంది. నేను 'దందా'లో అరవింద్‌గా మాత్రమే కనిపిస్తాను. ఇలాంటి ఛాలెంజింగ్ పాత్రలే రావాలని ఇన్నాళ్లు కోరుకున్నాను. ఇదంతా మా దర్శకుడి వల్లే సాధ్యమైంది.

**దర్శకుడు ఆదిత్య దేవులపల్లి మీ గురించి ఎంతో గొప్పగా చెప్పారు?.. మీరు నిజంగానే సింగిల్ టేక్ ఆర్టిస్టా?**

నాకు మానిటర్ చూసే అలవాటు ఉండదు. కెమెరామెన్‌ని చూస్తేనే విషయం తెలుస్తుంది. ఫస్ట్ టేక్‌లోనే సీన్‌ను పూర్తి చేయాలని అనుకుంటాను. అందుకే ఒక సీన్ ఉంటే.. దానికి ముందు, తర్వాత సీన్లు ఏంటన్నది కూడా చూసుకుంటాను. అందుకే దాదాపు అన్నీ కూడా సింగిల్ టేక్‌లోనే చేసేస్తాను. టేక్స్ ఎక్కువ అయితే ప్రొడక్షన్ కాస్ట్ కూడా పెరుగుతుంది. సెట్‌లో ఉన్నంత సేపు నేను అరవింద్ పాత్రలో జీవిస్తాను. అందుకే సింగిల్ టేక్‌లోనే చేసేశాను.

**ప్రస్తుతం ఉన్న మార్కెటింగ్ స్ట్రాటజీపై మీ అభిప్రాయం ఏంటి?**

కంటెంట్ ఎంత బాగున్నా.. మన దగ్గర ఉన్న కంటెంట్ గురించి జనాలకు చెప్పే మార్కెటింగ్ స్ట్రాటజీ లేకపోతే వృథానే. అందుకే ఇప్పుడు ప్రమోషన్స్, మార్కెటింగ్ అనేది ఎంతో ముఖ్యంగా మారాయి. 'దందా' కోసం నేను కూడా డిఫరెంట్‌గా ప్రమోట్ చేయాలని అనుకున్నాను. అందుకే నా రూ. 15 లక్షలు పోయాయి అని మా సిరీస్ కంటెంట్ అర్థమయ్యేలా ఓ ప్రమోషనల్ వీడియో చేశాం. అది అర్థమైంది కాబట్టి.. మా 'దందా'ని ఆడియెన్స్ బిగ్గెస్ట్ హిట్ చేశారు.

**సోషల్ మీడియాలో మీకోసం నిలబడే మీ ఫ్యాన్స్ గురించి చెప్పండి?**

ఇదంతా ఒక్క రోజులో సంపాదించింది కాదు. నేను చేసిన కంటెంట్‌లో వాళ్లని వాళ్లు చూసుకున్నారు. అలా చూసుకుని కనెక్ట్ అయ్యారు. ఇదంతా జరగడానికి కొన్ని ఏళ్లు పడుతుంది. సోషల్ మీడియాలో పాజిటివిటీతో పాటుగా నెగెటివిటీ ఉంటుంది. మాట్లాడేవాళ్లు మాట్లాడుతూనే ఉంటారు. నిజం ఏంటన్నది నాకు తెలుసు. అందుకే నేను ఏమీ పట్టించుకోకుండా ముందుకు వెళ్తుంటాను.

**సోషల్ ఇన్‌ఫ్లూయన్సర్స్ మీద ఎలాంటి బాధ్యత ఉంటుంది?**

మొన్న కామన్ వెల్త్ గేమ్స్‌లో సాక్షీ చౌదరీ బాక్సింగ్ కేటగిరిలో గోల్డ్ మెడల్ కొట్టేరు, అది ఎంతమందికి తెలుసు? కానీ మీరు ఫాలో అయ్యే ఇన్‌ఫ్లూయన్సర్ ఏం పోస్టు పెట్టేరు ఏం ట్వీట్ చేశారు అనేది మాత్రం ఖచ్చితంగా గుర్తుంటది. సో సెలబ్రిటీస్, స్పోర్ట్స్‌మేన్ కంటే ఎక్కువ జనాలు ఇన్‌ఫ్లూయన్సర్స్‌ని అడ్మైర్ చేస్తారు, వాళ్ళ లుక్స్ అండ్ స్టైల్‌ని బాగా గమనిస్తారు. కాబట్టి ఇన్‌ఫ్లూయన్సర్ ఏం చేసినా, మాట్లాడినా, బట్టలు వేసుకున్నా సరే అది చాలామంది పై ప్రభావం చూపిస్తుంది. సో వాళ్ళు చాలా జాగ్రత్తగా నడుచుకోవాలి

**ఖాళీ టైంలో దొర సాయి తేజ ఎలా ఉంటాడు?**

నేను కూడా అందరిలో ఒకడినే. కాకపోతే నాకంటూ ఓ దారి క్రియేట్ చేసుకున్నాను. అది నా ఆర్థిక పరిస్థితుల వల్ల కావొచ్చు, చిన్నప్పటి నుంచి నాకున్న ప్యాషన్ వల్ల కావొచ్చు. ఇక ముందు నన్ను అందరూ కొత్తగా చూస్తారు. థియేటర్, ఓటీటీ, సోషల్ మీడియాలో నన్ను చూసి అందరూ గర్వపడేలా చేస్తాను. ఎన్ని ఎదురు దెబ్బలు తగిలినా సరే ఆగకుండా పరిగెత్తాలి, నా లక్ష్యాన్ని సాధించాలనే ఫోకస్‌తోనే ఉంటాను.

**'దందా' టీం గురించి చెప్పండి?**

ఆదిత్య గారు వంద శాతం సక్సెస్ అయ్యారు. పేపర్ మీద రాసుకున్నది అవుట్ పుట్‌గా తీసుకు రావడం అన్నది మామూలు విషయం కాదు. ఆ విషయంలో ఆదిత్య అన్నకు ప్రశంసలు వస్తున్నాయి. 'దందా' సిరీస్‌కు సంబంధించిన ప్రతీ విషయంలో ఆయన ఎంతో కష్టపడ్డారు. ఆయన విజన్ వల్లే 'దందా' యునిక్‌గా నిలిచింది. ఈ సిరీస్‌ను ఏడు రోజుల్లో, 30 కాల్షీట్స్‌లో పూర్తి చేశాం. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా కష్టపడి పని చేశాం. అదే 'దందా'కి హైలెట్. డైరెక్టర్, మ్యూజిక్ డైరెక్టర్, సినిమాటోగ్రాఫర్, మేం ఇలా అందరం సింక్‌లో ఉన్నాం. అందుకే 'దందా' అద్భుతంగా వచ్చింది.

**ఫ్యూచర్ ప్లానింగ్ ఏంటి?**

ప్రతీ ఒక్క సాధారణ వ్యక్తి రిలేట్ అయ్యే కథల్ని థియేటర్‌లో చూపించాలని అనుకుంటున్నాను. జీరో టు హీరో అనే పాత్రలను పోషించాలని కోరుకుంటున్నాను. అందరిలోనూ స్ఫూర్తి నింపే కథల్ని, మంచి సందేశాన్ని ఇచ్చే ప్రాజెక్ట్‌ల్ని చేయాలని అనుకుంటున్నాను. మన చుట్టూ ఉండే కథల్ని, పాత్రల్ని ఎంచుకుంటాను. ప్రేక్షకులు నా కోసం ఖర్చు పెట్టే డబ్బులకు న్యాయం చేయాలనే లక్ష్యంతో పని చేస్తాను.''

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.